
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI




గురువారం | 28-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 223 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి పూర్తి; నక్షత్రం: చిత్త ఉ. 7.36 తదుపరి స్వాతి; వర్జ్యం: మ. 1.49-3.36; దుర్ముహూర్తం: ఉ. 10.12-10.56, మ. 2.37-3.22; అమృతఘడియలు: రా. 12.30-2.17; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అశ్రునివాళి







కీ॥ శే॥ శ్రీ నారా రామమూర్తి నాయుడు గారు

మాజీ శాసనసభ్యులు, చంద్రగిరి

సగటు మనిషి కోసం పాటు పడిన ఓ మహర్షి...
మెలికలను మలుపులుగా మార్చిన ఓ మార్గదర్శి...
పోరాటమే ఊపిరైన చైతన్యమూర్తి...
ఇచ్చే మనసున్న, అడిగే అవసరం రాని
సమాజం కోసం పాటుపడ్డ ఓ ప్రజాశక్తి...
చరిత్ర మీ కీర్తిని ముందుమాటగా రాసుకుంటుంది...
మీ స్ఫూర్తిని ముందు తరాలతో పంచుకుంటుంది.
ఓ మనిషీ...
ఓ మహాత్మా...
మీకు ఇవే మా జోహార్లు....

నారా చంద్రబాబు నాయుడు
నారా లోకేష్, నారా గిరీష్, నారా రోహిత్



అట్లూరి నారాయణరావు,
కన్వీనర్ - NTR Literature Committee
గౌరవాధ్యక్షులు, ఆం.ప్ర. సాధు పరిషత్

హోండా యాక్టివా ఎలక్ట్రిక్ వచ్చేస్తోంది..



బెంగళూరు: దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల విభాగంలోకి జపాన్‌కు చెందిన హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ కూడా ప్రవేశించింది. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న స్కూటర్ మోడల్ యాక్టివాలో ఎలక్ట్రిక్ వెర్షన్‌తోపాటు క్యూసీ1 అనే కొత్త ఎలక్ట్రిక్ మోడల్‌ను బుధవారం ఆవిష్కరించింది. వీటి బుకింగ్ సౌకర్యం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి నుంచి కస్టమర్లకు వాహనాలను అందించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అయితే, వీటి ధరలను మాత్రం వెల్లడించలేదు.

మార్కెట్లోకి రియల్‌మీ జీటీ 7 ప్రో

ప్రారంభ ధర రూ.56,999



న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ తాజాగా 'జీటీ 7 ప్రో' మోడల్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ఫ్లాగ్‌షిప్ చిప్‌సెట్‌తో దేశీయ విపణిలోకి వస్తున్న తొలి స్మార్ట్‌ఫోన్ మోడల్ ఇదే. దీని (12జీబీ ర్యామ్+256 జీబీ మెమొరీ) ప్రారంభ ధర రూ.59,999 కాగా, 16జీబీ ర్యామ్+ 512 జీబీ మెమొరీ సామర్థ్యంతో కూడిన మోడల్ రేటు రూ.65,999. ఈనెల 29 నుంచి అమెజాన్, రియల్‌మీ వెబ్‌సైట్లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ ఈ ఫోన్ అందుబాటులోకి వస్తుంది. లాంచింగ్ ఆఫర్‌లో భాగంగా కంపెనీ ఈ ఫోన్‌పై రూ.3,000 బ్యాంక్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈనెల 28 కల్లా బుక్ చేసుకున్న వారికి ఏడాది అదనపు వారంటీ కూడా కల్పిస్తోంది.

భారీగా పెరిగిన వెండి

» ఒక్కరోజే రూ.5,200 అప్

న్యూఢిల్లీ: దేశీయంగా విలువైన లోహాల ధరలు మళ్లీ పుంజుకున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.650 పెరిగి రూ.78,800కు చేరుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.5,200 పెరుగుదలతో రూ.95,800 ధర పలికింది. వెండి ధర ఒక రోజులో ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 1.02 శాతం పెరిగి 2,673 డాలర్లకు చేరుకోగా.. వెండి 30.94 డాలర్లకు ఎగబాకింది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ షేరు 13% వృద్ధి

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ లిస్టింగ్ రోజున అంచనాలను మించి దూసుకుపోయింది. ఐపీఓ ధర రూ.108తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ షేరు 3.33 శాతం లాభంతో రూ.111.60 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఒకదశలో 13.65 శాతం వరకు పెరిగిన షేరు.. తొలి రోజు ట్రేడింగ్ నిలిచేసరికి రూ.13.06 శాతం లాభంతో రూ.122.10 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ మొదటి రోజే రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటేసింది.

ఎస్‌బీఐ రూ.50,000 కోట్ల సేకరణ

బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఏడో విడత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల జారీ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించింది. దాంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ సేకరించిన మొత్తం నిధుల విలువ రూ.50,000 కోట్లకు చేరుకుంది.

లంచం ఆరోపణల్లేవ్..

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఏజీఈఎల్ వివరణ



న్యూఢిల్లీ: తమ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన అనుచరులపై అమెరికాలో లంచం అభియోగాలు మాత్రం నమోదు కాలేదని గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరణ ఇచ్చింది. అయితే వారిపై కేవలం జరిమానాలు విధించేందుకు అవకాశాలున్న సెక్యూరిటీస్ అండ్ వైర్ ఫ్రాడ్ సహా మూడు ఇతర అభియోగాలు నమోదైనట్లు ఏజీఈఎల్ తెలిపింది. న్యూయార్క్ కోర్టులో యూఎస్ డీఓజే (డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్) దాఖలు చేసిన అభియోగాల్లో గౌతమ్ అదానీ, ఆయన అల్లుడు సాగర్ లేదా వినీత్ జైన్‌ల పేర్లను యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) ఉల్లంఘనల ఆరోపణల్లో ఎక్కడా ప్రస్తావించలేదని ఏజీఈఎల్ పేర్కొంది. ఏజీఈఎల్ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు 25 కోట్ల డాలర్ల (రూ.2,200 కోట్ల) లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై అదానీ గ్రూప్‌పై అమెరికాలో కేసు నమోదైన విషయం తెలిసిందే.

20% వరకు పెరిగిన గ్రూప్ షేర్లు

ఏజీఈఎల్ తాజా వివరణతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు బుధవారం 20 శాతం వరకు లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 19.76 శాతం, అదానీ పవర్ 19.66 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 11.56 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ , అదానీ గ్రీన్ ఎనర్జీ 10 శాతం చొప్పున ఎగబాకాయి. ఎన్‌డీటీవీ షేరు 9.35 శాతం వృద్ధి చెందగా.. అదానీ విల్మర్ 8.46 శాతం, అదానీ పోర్ట్స్ 6.29 శాతం, అంబుజా సిమెంట్స్ 4.40 శాతం, ఏసీసీ 4.16 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 4.73 శాతం పెరిగాయి. దాంతో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.1,24,693 కోట్లు పెరిగింది.

మార్కెట్‌కు అదానీ బూస్ట్

అదానీ గ్రూప్‌తోపాటు కొన్ని ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులతో స్టాక్ మార్కెట్ సూచీలు ఒక మోస్తరు లాభాల్లో ముగిశాయి. బుధవారం ఉదయం సెషన్‌లో స్వల్ప లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన సెన్సెక్స్.. మధ్యాహ్నం ఒకదశలో 507 పాయింట్ల మేర ఎగబాకింది. చివరికి 230.02 పాయింట్ల వృద్ధితో 80,234.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 80.40 పాయింట్ల లాభంతో 24,274.90 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 రాణించాయి. అదానీ పోర్ట్స్ షేరు 6శాతానికి పైగా ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

ఐటీలో కొలువుల పండుగ

వచ్చే 6 నెలల్లో 12 శాతం వృద్ధి అంచనా



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థల స్వరూపాన్ని సంపూర్ణంగా మార్చి వేయగల టెక్నాలజీలు త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఐటీ సర్వీసుల విభాగంలో నియామకాలు జోరందుకోనున్నాయి. రాబోయే ఆరు నెలల కాలంలో ఐటీ రంగంలో నియామకాలు 10-12 శాతం పెరుగుతాయని క్వెస్ కార్ప్ తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ విభాగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆ సంస్థ చెబుతోంది. జూన్ త్రైమాసికంతో పోల్చితే నిపుణుల డిమాండ్ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) విభాగంలో 71 శాతం, సైబర్ సెక్యూరిటీ విభాగంలో 58 శాతం పెరిగినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. క్వెస్ ఐటీ స్టాఫింగ్ డిజిటల్ నైపుణ్యాల నివేదిక ప్రకారం డెవలప్‌మెంట్, ఈఆర్‌పీ, టెస్టింగ్, నెట్‌వర్కింగ్, డేటా సైన్స్ సహా ఐదు విభాగాల్లో స్థూల డిమాండ్ 79 శాతం పెరిగిందని ఆ విభాగం సీఈఓ కపిల్ జోషి తెలిపారు.

నివేదిక ముఖ్యాంశాలు..

- టెక్ ఉద్యోగాలకు జీసీసీలు ప్రధాన చోదక శక్తిగా ఉన్నాయి. ఏఐ/ఎంఎల్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్, డెవ్ ఆప్స్ విభాగాల్లో నిపుణుల డిమాండ్ అధికంగా ఉంది.
- టెక్ విభాగంలో 62 శాతం ఉద్యోగ ప్రకటనలతో బెంగళూరు తిరుగులేని నాయకత్వ స్థానంలో ఉంది. హైదరాబాద్ (43.5 శాతం), పుణె (10 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- జీసీసీల విస్తరణతో విభిన్న నగరాల్లో నిపుణులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ఇంజినీరింగ్, ఐటీ, ఫైనాన్స్, అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులను జీసీసీలు అధికంగా నియమించుకుంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో అల్లానా గ్రూప్ చికెన్ ప్రాసెసింగ్ ప్లాంట్లు

రూ.200 కోట్ల వరకు పెట్టుబడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోళ్ల పరిశ్రమకు చెందిన ప్రముఖ సంస్థ 'అల్లానా' గ్రూప్ తన వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ఆరు ప్రాంతాల్లో చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రోజుకు ఒక్కో ప్లాంటులో 60,000 కోళ్లను ప్రాసెస్ చేసేలా ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఇందులో నాలుగు ప్లాంట్లు సొంతంగా, రెండు ప్లాంట్లు ఇతర పౌల్ట్రీ సంస్థలతో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేస్తామని హైదరాబాద్‌లో జరుగుతున్న 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో'కు హాజరైన అల్లానా గ్రూప్ ఎండీ మోయిజ్ చునావాలా చెప్పారు. సొంతంగా ఏర్పాటు చేసే నాలుగు ప్లాంట్లలో ఒకటి తెలంగాణలోని జహీరాబాద్ వద్ద, రెండోది ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో ప్లాంటు ఏర్పాటుకు రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుందన్నారు. క్వాలిటీ యానిమల్‌ఫీడ్స్, కస్తూరి పౌల్ట్రీ ఫామ్స్‌తో కలిసి రెండు జాయింట్ వెంచర్ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు కూడా అల్లానా గ్రూప్ బుధవారం పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోలో ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ఎక్స్‌పో సందర్భంగా వివిధ పౌల్ట్రీ కంపెనీలతో కలిసి ఇండియన్ పౌల్ట్రీ అలయెన్స్‌ను ఏర్పాటు చేసింది.

దాణా ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గించాలి

పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు బయాస్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రంగానికి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో- 2024ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధి, పోషకాహారానికి మూలస్తంభమైన పౌల్ట్రీ రంగానికి అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యాక్సిన్ దిగుమతులకు సత్వర అనుమతులు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. దాణా తయారీలో ప్రధాన ముడి పదార్థాలైన మొక్కజొన్న, సోయాలపై జీఎస్‌టీ భారం తగ్గించాలని కోరారు. ఎగ్జిబిషన్‌కు పెద్దసంఖ్యలో కోళ్ల పరిశ్రమ వర్గాలు తరలివచ్చాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,510 ▲	71,050 ▲	97,800 ▼
ముంబై	76,180 ▲	69,780 ▲	88,430 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	595
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	109
కరీంనగర్	110	ఒంగోలు	109
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	97
కర్నూలు	110	నెల్లూరు	97
విశాఖపట్నం	115	అనంతపురం	97
గోదావరి	109		

స్పోర్ట్స్

పాలబుగ్గల ప్రాయం.. నైపుణ్యాలు అమోఘం

చెస్ వండర్ దివిత్





ప్రపంచ చెస్ వినీలాకాశంలో మరో భారత తార ఉద్భవించింది. హైదరాబాద్‌కు చెందిన పాల బుగ్గల పిల్లోడు దివిత్ అండర్-8 వరల్డ్ క్యాడెట్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ అందుకొని భారత్ చెస్ చరిత్రలో మరో అధ్యాయాన్ని ప్రారంభించాడు. రెండేళ్ల కిందటే తన అద్భుత నైపుణ్యాలతో ప్రస్తుతం ప్రపంచ చెస్ టైటిల్ కోసం తలపడుతున్న గుకేష్‌ను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేశాడు దివిత్. హైదరాబాద్‌లో జరిగిన ఆ ఎగ్జిబిషన్ చెస్ టోర్నీ సందర్భంగా ఎండ్ గేమ్‌లో దివిత్ వేసిన ఎత్తులతో గుకేష్ షాకయ్యాడు. ఆ టోర్నీలో గుకేష్‌తోపాటు తెలంగాణ స్టార్ అర్జున్‌తో దివిత్ తలపడడం విశేషం. 'ఈ బాలుడు అమోఘంగా ఆడుతున్నాడు. నిజం చెప్పాలంటే అతడి ఆట నన్ను షాక్‌కు గురి చేసింది' అని గుకేష్ అనడం దివిత్ ప్రతిభకు అద్దం పడుతుంది. సీన్ కట్ చేస్తే..ప్రస్తుతం డింగ్ లిరెన్‌తో వరల్డ్ చెస్ టైటిల్ కోసం గుకేష్ తలపడుతున్నాడు. అదే సమయంలో ఇటలీలో జరిగిన పోటీలలో దివిత్ అండర్-8 ప్రపంచ క్యాడెట్ చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. 1784 ఫిడే రేటింగ్ పాయింట్లు కలిగిన దివిత్ అండర్-8 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచాడు. ఇందులో రెండు గేముల్లో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థులను అతడు మట్టి కరిపించాడు.

చిన్నతనంలోనే మెరుపులు..

దివిత్ తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. చాలా చిన్నతనంనుంచే తమ కుమారుడు పజిల్స్ పరిష్కరించడంపట్ల అమితాసక్తి కనబరుస్తుండడాన్ని వారు గమనించారు. దాంతో హైదరాబాద్‌లోని ఓ పజిల్ ఇన్‌స్టిట్యూట్‌లో దివిత్‌ను చేర్పించారు. అక్కడ నుంచి ఆ చిన్నారి అడుగులు క్రమంగా చెస్‌వైపు పడ్డాయి. ఆరేళ్లకే అండర్-8 జాతీయ చెస్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అనంతరం పోలవరపు రామకృష్ణ శిక్షణలో దివిత్ పూర్తిస్థాయి చెస్ పయనం మొదలైంది. రామకృష్ణ విశాఖపట్నానికి చెందిన వ్యక్తి కావడంతో తొలుత దివిత్ చెస్ క్లాస్‌లన్నీ ఆన్‌లైన్‌లోనే సాగేవి. చెస్‌పై మరింత దృష్టిపెట్టే క్రమంలో దివిత్ చదువు కూడా ఆన్‌లైన్‌లో కొనసాగింది. దివిత్‌కు అద్భుత వ్యూహాత్మక సామర్థ్యాలున్నాయి. అతడి ఎత్తులు సంక్లిష్టంగా ఉంటాయి. గ్యారీ కాస్పరోవ్..దివిత్ ఆరాధ్య ఆటగాడు. దివిత్ ఎత్తులు కూడా కాస్పరోవ్ వలే చాలా దూకుడుగా ఉంటాయి. ఓడిపోయిన దశ నుంచి పుంజుకొని దివిత్ గెలిచిన గేమ్‌లు ఎన్నో. అయితే క్లిష్టమైన ఎత్తుగడలు ఒక్కోసారి దివిత్‌కు పరాజయాలూ తెచ్చిపెట్టకపోలేదు. చెస్ కెరీర్ ఆరంభంలో దివిత్ ఆశాజనక ఫలితాలు సాధించలేదు. క్లాసికల్ టోర్నమెంట్‌లో విజయాలు దక్కలేదు. అండర్-7 జాతీయ చాంపియన్‌షిప్‌లో ఏడో స్థానంతో నిరాశ పరిచాడు. గత ఏప్రిల్‌లో ఆర్మేనియాలో జరిగిన ర్యాపిడ్ ఏజ్ గ్రూప్ టోర్నీ టైటిల్ నెగ్గడం ద్వారా దివిత్ ప్రపంచ చెస్ దృష్టిని ఆకర్షించాడు. అదే టోర్నీ..బ్లిట్జ్ కేటగిరీలో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అండర్-8 వరల్డ్ కప్ క్లాసికల్ విభాగంలో ఐదో స్థానం సంపాదించాడు. ఈ ఫలితాలు అండర్-8 ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు దివిత్‌లో ఎంతో ఆత్మవిశ్వాసం ఇచ్చాయి. ఈ సంవత్సరం దివిత్ 8 నుంచి 10 రేటెడ్ టోర్నీలలో పాల్గొన్నాడు. ఇందులో మూడు ప్రపంచ టోర్నమెంట్‌లూ ఉన్నాయి. ప్రస్తుతం పిన్నవయస్సు గ్రాండ్ మాస్టర్ రికార్డు అమెరికాకు చెందిన అభిమన్యు మిశ్రా (12 ఏళ్ల 4 నెలల 25 రోజులు) పేరిట ఉంది. దివిత్ సంచలన విజయాలను పరిగణనలోకి తీసుకుంటే ఆ రికార్డును హైదరాబాద్ చిన్నోడు చేజిక్కించుకొనే అవకాశాలు లేకపోలేదు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హాకీ కుర్రాళ్ల సూపర్ బోణీ

ఆసియా కప్‌లో 11-0తో థాయ్‌లాండ్‌పై భారత్ గెలుపు

మస్కట్: జూనియర్ ఆసియా కప్‌లో భారత హాకీ కుర్రాళ్లు అద్భుత శుభారంభాన్ని అందుకున్నారు. పూల్-ఎలో భాగంగా బుధవారం జరిగిన తమ తొలి పోరులో 11-0 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్‌ను చిత్తుగా ఓడించారు. డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆరంభం నుంచే ఆధిపత్యం సాగిస్తూ పూర్తి ఏకపక్షంగా మ్యాచ్‌ను ముగించింది. అరైజీత్ సింగ్, గుర్జోత్, సౌరభ్‌లు తలో రెండు గోల్స్‌తో విజృంభించగా.. అర్షదీప్, దిల్‌రాజ్, ముకేశ్, శార్దానంద్, రోహిత్ తలో గోల్ కొట్టారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను గురువారం జపాన్‌తో ఆడనుంది.

దక్షిణాఫ్రికా 80/4

డర్బన్: దక్షిణాఫ్రికా-శ్రీలంక తొలి టెస్ట్‌కు వరుణుడు తీవ్ర ఆటంకం కలిగించాడు. దీంతో బుధవారం మొదలైన మొదటి టెస్ట్‌లో 20.4 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 80/4 స్కోరు చేసింది. వర్షంతో మొదటి రోజు ఆట నిలిచే సమయానికి కెప్టెన్ బవుమా (28), కైల్ వెరియన్నె (9) క్రీజులో ఉన్నారు. మార్‌క్రమ్ (9), టోనీ జోర్జి (4), స్టబ్స్ (16), డేవిడ్ బెడింగ్‌మ్ (4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. లహిరు కుమార రెండు వికెట్లు పడగొట్టాడు.

28 బంతుల్లో సెంచరీ

టీ20ల్లో ఉర్విల్ పటేల్ రికార్డు



ఇండోర్: ఐపీఎల్ వేలంలో ఏ జట్టుకూ పట్టని ఆటగాడిగా మిగిలిన గుజరాత్ వికెట్ కీపర్/బ్యాటర్ ఉర్విల్ పటేల్ (35 బంతుల్లో 7 ఫోర్లు, 12 సిక్సులతో 113 నాటౌట్) టీ20ల్లో రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బుధవారం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో పటేల్ కేవలం 28 బంతుల్లో సెంచరీ బాదేశాడు. ఈ క్రమంలో 2018లో ఇదే టోర్నీలో హిమాచల్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున రిషభ్ పంత్ 32 బంతుల్లో శతకం రికార్డును పటేల్ అధిగమించాడు. కాగా, ఓవరాల్‌గా పొట్టి క్రికెట్‌లో వేగవంతమైన సెంచరీ రికార్డు ఎస్తోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ (27 బంతులు) పేరిట ఉంది. పటేల్ వీరవిహారంతో.. 155/8 స్కోరును గుజరాత్ 10.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది.

తీర్థకు స్వర్ణం వర్షిత్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు సత్తా చాటారు. రాజ్‌కోట్‌లో బుధవారం జరిగిన అండర్-17 బాలుర 400 మీటర్ల మెడ్లేలో విజయవాడకు చెందిన తీర్థ సామదేవ్ స్వర్ణం, హైదరాబాద్ స్విమ్మర్ వర్షిత్ రజతం గెలిచారు.

గోవాపై ఆంధ్ర విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో గోవాపై 8 వికెట్లతో ఆంధ్ర గెలిచింది. తొలుత గోవా 20 ఓవర్లలో 154/5 స్కోరు చేసింది. శశికాంత్, స్టీఫెన్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో కెప్టెన్ రికీ భుయ్ (72), శ్రీకర్ భరత్ (57) చెలరేగడంతో ఆంధ్ర 15.4 ఓవర్లలో 155/2 స్కోరు చేసి నెగ్గింది. ఇక, రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 24 రన్స్‌తో రాజస్థాన్ చేతిలో ఓడింది.

బీజేపీలో చేరితే.. నిషేధం ఎత్తేస్తారు

బజ్‌రంగ్ పూనియా

న్యూఢిల్లీ: తనపై నాలుగేళ్ల నిషేధం విధించడంపై స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ఘాటుగా స్పందించాడు. తాను కనుక బీజేపీలో చేరితే నిషేధాన్ని ఎత్తేస్తారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. డోప్ పరీక్షకు మూత్రం నమూనా ఇవ్వకపోడంతో పూనియాపై నాలుగేళ్ల నిషేధాన్ని విధిస్తూ జాతీయ డోపింగ్ వ్యతిరేక సంస్థ (నాడా) మంగళవారం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. దీనిపై బజ్‌రంగ్ స్పందిస్తూ.. 'నాడా నిర్ణయంతో షాక్‌కు గురి కాలేదు. ఇది ప్రతీకారం తప్ప మరోటికాదు. నేనిప్పుడు బీజేపీలో చేరితే నాపై నిషేధం ఎత్తివేస్తారు' అని చెప్పుకొచ్చాడు.

ఇండియా-ఎ జట్టు వైస్ కెప్టెన్‌గా త్రిష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియా అండర్-19 ఏ-జట్టు వైస్ కెప్టెన్‌గా తెలంగాణ అమ్మాయి త్రిషా రెడ్డిని నియమించారు. ఇండియా-ఎ, బి, దక్షిణాఫ్రికా అండర్-19 జట్ల మధ్య వచ్చేనెల 3 నుంచి 12వరకు పుణెలో జరగనున్న ముక్కోణపు సిరీస్‌లో ఆడే భారత జట్లను బీసీసీఐ బుధవారం ప్రకటించింది. ఇండియా-ఎలో తెలంగాణ అమ్మాయిలు త్రిష, కావ్యశ్రీ, విశాఖపట్నం క్రికెటర్ షబ్నం, ఇండియా-బీలో హైదరాబాద్ క్రికెటర్ కేసరి ధ్రుతికి స్థానం లభించింది.

ఆదినుంచే అదరగొట్టి..

మూడో గేమ్‌లో గుకేష్ గెలుపు ● ప్రపంచ చెస్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత గ్రాండ్ మాస్టర్ గుకేష్ తొలి విజయం అందుకున్నాడు. బుధవారం జరిగిన మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను గుకేష్ చిత్తు చేశాడు. దాంతో 14 గేముల చాంపియన్‌షిప్‌లో లిరెన్, గుకేష్ చెరో 1.5 పాయింట్లతో సమంగా నిలిచారు. మొదటి గేమ్‌లో లిరెన్ గెలవగా, రెండో గేమ్ డ్రా అయిన సంగతి తెలిసిందే. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం నాలుగో రౌండ్ జరుగుతుంది. మూడో రౌండ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన గుకేష్ ఆరంభంనుంచే అదరగొట్టాడు. టోర్నీ నిబంధనల ప్రకారం..తొలి 120 నిమిషాల్లో 40 ఎత్తులను ఆటగాళ్లు పూర్తి చేయాలి. 13వ ఎత్తుకు వచ్చేసరికి గుకేష్ తిరుగులేని స్థితిలో నిలిచాడు. అప్పటికి గుకేష్ కేవలం నాలుగు నిమిషాలే తీసుకోగా..లిరెన్ సమయంలో గంటా ఆరు నిమిషాలు అయిపోయింది. దాంతో 32 ఏళ్ల చైనా జీఎం ఒత్తిడిలో పడిపోయాడు. చివరి ఆరు ఎత్తులకు అతడికి కేవలం పది సెకన్లకంటే తక్కువ సమయమే మిగిలింది. దాంతో 37వ ఎత్తులో లిరెన్ ఓటమి అంగీకరించక తప్పలేదు.

జూ. మెస్సీ అరంగేట్రం



బ్యూనస్‌ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ పెద్ద కుమారుడు థియాగో మెస్సీ అండర్-13 పోటీల్లో అరంగేట్రం చేశాడు. నెవెల్స్ కప్‌లో ఇంటర్ మయామి యూత్ జట్టు తరఫున 12 ఏళ్ల థియాగో బరిలోకి దిగాడు. అయితే, ఈ మ్యాచ్‌లో నెవెల్స్ ఓల్డ్ బాయ్స్ 1-0తో గెలిచింది. థియాగో సెకండాఫ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. ఈ మ్యాచ్ వీక్షణకు లియోనెల్ రాకపోయినా.. మెస్సీ భార్య రొకొజో, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

ప్రీక్వార్టర్స్‌కు సింధు, లక్ష్య సేన్



లఖ్‌నవూ: సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీలో పీవీ సింధు, లక్ష్యసేన్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సహచరి అన్‌మోల్ కర్బ్‌పై సింధు 21-17, 21-15తో గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో మాళవిక బన్సోడ్ 21-16, 21-7తో డబ్‌జెన్సికా (పోలెండ్)పై, అనుపమ ఉపాధ్యాయ్ 19-21, 22-20, 21-15తో పాతిమాపై, ఐరా శర్మ 21-13, 21-19తో దీప్శిక సింగ్‌పై, ఉన్నతి హుడా 21-12, 21-16తో తమోన్‌వాన్ (థాయ్)పై గెలిచారు. అయితే, మూడో సీడ్ ఆకర్షి కశ్యప్ 8-21, 12-21తో ఉ లి యు (చైనా) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-12, 21-12తో ఐదిల్ (మలేసియా)పై, కిరణ్ జార్జ్ 21-12, 23-21తో ఆలాప్ మిశ్రాపై, ప్రియాంశు రజావత్ 21-13, 21-12తో కార్తికేయపై గెలిచారు. డబుల్స్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 21-12, 21-10తో ఇషు మాలిక్-తనుపై, ప్రియ-శ్రుతి జోడీ 21-14, 21-12తో అలీషా-వర్షిణిపై గెలిచి ముందంజ వేశారు. కాగా, ట్రీసా జాలీ-గాయత్రి జంటకు వాకోవర్ లభించింది. సాయి ప్రతీక్-పృథ్వీ, ఇషాన్-శంకర్ ప్రసాద్, హరిహరన్-రూబెన్ జోడీలు కూడా రెండో రౌండ్‌కు చేరుకొన్నాయి.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 28-11-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మేఘాలలో.. తేలిపొమ్మన్నదీ..

నింగిలో సైక్లింగ్, జిప్‌లైన్ చేస్తూ.. దూరంగా కనిపించే సాగర అందాలను చూస్తుంటే ఆ అనుభూతే వేరు! వి శాఖ కైలాసగిరిలో ఈ సాహస క్రీడలు అందుబాటులోకి వచ్చాయి.





మాదకద్రవ్యాల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు సత్యకుమార్, లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, సంధ్యారాణి

మత్తు వదలాల్సిందే

గంజాయి సాగు, రవాణా, విక్రేతలకు సంక్షేమ పథకాలు కట్

- 450 మంది పోలీసులతో ప్రత్యేక దళం
- ఆరు నెలల్లో గంజాయిని తరమడమే లక్ష్యం
- సాగు-రవాణా మార్గాలపై నిరంతర నిఘా
- '1972'కు సమాచారం ఇస్తే పారితోషికాలు
- విద్యా సంస్థల్లో 'ఈగల్' కమిటీలు
- గ్రామ స్థాయిలోనూ కమిటీలకు బాధ్యతలు
- అన్ని శాఖలతో కలిపి సమన్వయం
- 'మహా సంకల్పం' పేరుతో భారీ సదస్సులు
- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో నిర్ణయాలు

6 నెలల్లో రాష్ట్రం నుంచి గంజాయిని తరిమేయడమే లక్ష్యం! ఇందుకు అన్ని మార్గాలను అన్వేషించాలి. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో కదలాలి. గంజాయి సాగు చేసే నేల నుంచి అది చేరే గమ్యం దాకా... ప్రతి దశలో నిఘా పెట్టాలి.

- మంత్రివర్గ ఉప సంఘం

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎవరు గంజాయి సాగు చేసినా... సరఫరా చేస్తూ పట్టుబడినా.. మత్తు పదార్థాలు విక్రయించినా కటకటాలు లెక్కపెట్టాల్సిందే. అంతేకాదు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ దూరం కావాల్సిందే! ఆంధ్రప్రదేశ్‌లో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైన కూటమి సర్కారు... దీనిపై బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. అన్ని వర్గాలను ఇందులో భాగస్వాముల్ని చేసి 'ఈగల్' ద్వారా మత్తు మహమ్మారిని శాశ్వతంగా నాశనం చేయాలని నిర్ణయించుకుంది. వైసీపీ హయాంలో 'దేశ గంజాయి రాజధాని'గా రాష్ట్రంపై పడిన ముద్రను తొలగించే దిశగా కఠిన చర్యలు చేపడుతోంది. ఈ దిశగా ఇప్పటికే ఉత్తరాంధ్రలో గంజాయిపై ఉక్కుపాదం

మిగతా 11వ పేజీలో...



తీరం.. అభివృద్ధి హారం

ప్రపంచ స్థాయి మారిటైమ్ రాష్ట్రంగా ఏపీ

- సుస్థిర అభివృద్ధి సాధన లక్ష్యంగా ప్రణాళికలు
- 2029 నాటికి జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి
- సముద్ర తీరం ఆధారంగా సమగ్రాభివృద్ధికి చర్యలు
- తీరంలో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక అభివృద్ధి
- పోర్టుల ద్వారా సరుకు రవాణాకు అపార అవకాశాలు
- పీపీపీ విధానంలో కమర్షియల్ పోర్టుల నిర్మాణం
- ఆలయ పర్యాటకానికి ప్రత్యేక కార్యాచరణ 11
- వాటర్‌వేస్‌కు ప్రోత్సాహకాలు.. మారిటైమ్ వర్సిటీ స్థాపన
- రాష్ట్ర మారిటైమ్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చ.. ఆమోదం

తవ్వకం చార్జీలే తీసుకోవాలి.. ఇసుకపై సీఎం ఆదేశం

అమరావతి 2.0

రిపబ్లిక్ వేడుకలూ అక్కడే!

రాజధాని కీలక ప్రాజెక్టుల పునరుద్ధరణకు త్వరలో శ్రీకారం

15న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్ క్వార్టర్ల సహా నిర్మాణ పనులన్నీ పునఃప్రారంభం

9 నుంచి 24 నెలల్లో ఆయా పనుల పూర్తికి డెడ్‌లైన్



(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

అమరావతి రాజధాని పునరుద్ధరణ పనులు డిసెంబరు 15న ప్రారంభం కాబోతున్నాయి. 2017లో మహాయజ్ఞంలా పనులు జరుగుతూ కనిపించిన ముఖచిత్రం మరోమారు సాక్షాత్కరించనుంది. ఆయా ప్రాజెక్టులను బట్టి కనిష్ఠంగా 9 నెలల నుంచి గరిష్ఠంగా 24 నెలల్లో పూర్తయ్యేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. సీఆర్‌డీఏ కార్యాలయ పునరుద్ధరణ పనులను ఇటీవలే ప్రారంభించారు. ఆ తర్వాత కీలకమైన పలు భవన నిర్మాణాలు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా పనులను వచ్చేనెల 15న పునఃప్రారంభిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్ పనులను ఆరోజున పునఃప్రారంభిస్తారు. వీటిని మల్టీస్టోరీడ్ అపార్ట్‌మెంట్లుగా నిర్మించేందుకు రూ.731.30 కోట్ల వ్యయంతో గతంలో టెండర్లు పిలిచారు. ఈ భవనాల పనులు ఇప్పటికే 74 శాతం పూర్తయ్యాయి. కాంట్రాక్టు సంస్థకు రూ.380.12 కోట్లు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చేనాటికి ఈ భవనాలకు

మిగతా 11వ పేజీలో...



అమరావతికి యాక్షన్‌ప్లాన్

- 120 రోజుల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపు
- 2019 రాజధానిలో ఆగిన పనుల బిల్లులకు ఇన్నాళ్లకు మోక్షం
- పనులు చేసినంతవరకు చెల్లింపులు
- అదనపు పనులూ ఒప్పందం పరిధిలోకే
- బిల్లులు, అడ్వాన్సులపై వడ్డీ ఉండదు
- టెక్నికల్ కమిటీ సూచనలకు ఆమోదం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రాజధాని అమరావతి పునర్‌నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోంది. గతంలో ఆగిన నిర్మాణాల పునఃప్రారంభం, ముందుగా చేయాల్సిన పనులపై ప్రభుత్వం వేసిన టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికను ఆమోదించింది. బుధవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు

మిగతా 11వ పేజీలో...



బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పక్కన జనసేన ఎంపీలు తంగెళ్ల ఉదయ్, బాలశౌరి

అదనపు నిధులివ్వండి

ప్రధానికి డిప్యూటీ సీఎం పవన్ వినతి.. జల్‌జీవన్ మిషన్‌ను జగన్ గాలికొదిలారు

- కేంద్రం 23 వేల కోట్లు కేటాయిస్తే అందులో 2 వేల కోట్లే ఖర్చు చేశారు
- చేసిన పనులు కూడా నాసిరకం.. ఎవరికీ ప్రయోజనం లేదు
- మేం సమర్థంగా అమలుచేస్తాం.. పార్లమెంటు ప్రాంగణంలో మోదీతో భేటీ
- ఎర్రచందనం ఎగుమతుల ప్రక్రియ మార్చాలి.. సింగిల్ విండోలోకి తేవాలి
- కేంద్ర అటవీ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కోరిన పవన్

న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలనే బలమైన సంకల్పంతో కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రూపొందించిన జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను నాటి సీఎం జగన్ గాలికొదిలేశారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. బుధవారం ఢిల్లీలో పార్లమెంటు ప్రాంగణంలో ప్రధాని

మిగతా 12వ పేజీలో...

రఘురామ హత్యకు సీఐడీ కుట్ర

కాళ్లు కట్టేసి రబ్బర్ బెల్టు, లాఠీతో చిత్రహింసలు

కుట్రలో జగన్, సునీల్‌కుమార్, పీఎస్ఆర్ పాత్ర

- కొడుతున్నప్పుడు వీడియో తీసిందెవరు?
- ఎవరికి పంపించారో తేలాల్సి ఉంది
- ప్రాసిక్యూషన్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వెల్లడి
- 10 వరకు విజయ్‌పాల్‌కు రిమాండ్
- గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఆదేశాలు
- అంతకుముందు ఒంగోలులో సీఐడీ మాజీ ఏఎస్పీకి వైద్య పరీక్షలు
- భారీ బందోబస్తుతో గుంటూరు తరలింపు
- 10 రోజులు కస్టడీకి కోరుతూ నేడు కోర్టులో పోలీసుల పిటిషన్



ఒంగోలు తాలూకా స్టేషన్ నుంచి విజయ్‌పాల్‌ను తరలిస్తున్న పోలీసులు

గుంటూరు/ఒంగోలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు హత్యకు వైసీపీ హయాంలో సీఐడీ కుట్ర చేసిందని పోలీసులు వెల్లడించారు. కస్టడీలో ఆయనను చిత్రహింసలకు గురిచేశారని, తాళ్లతో కాళ్లు కట్టేసి.. రబ్బర్ బెల్టు, లాఠీలతో తీవ్రంగా కొట్టారని తెలిపారు. దీనిపై జూన్ 10న గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్లో రఘురామ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఏ-1గా నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఏ-2గా నాటి నిఘా చీఫ్ సీతారామాంజనేయులు, ఏ-3గా అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి, ఏ-4గా అప్పటి సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను, తప్పుడు

మిగతా 12వ పేజీలో...

సునీల్‌కుమార్ పారిపోయే అవకాశం



లుక్‌అవుట్ నోటీస్ జారీ చేయాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు డిమాండ్

విజయ్‌పాల్ పాపం ఇప్పటికి పండిందని వ్యాఖ్య 12



రాజ్యసభకు నాగబాబు?

- అన్న కోసం డిప్యూటీ సీఎం యత్నం
- రాష్ట్రంలో ఖాళీ అయిన మూడింట్లో ఒకటి జనసేనకు దక్కేలా ప్రణాళిక
- దీనిపై బీజేపీ పెద్దలతో పవన్ చర్చలు
- పెద్దల సభలో సేనకు సీటుపై ఓకే!

2

హోదా.. ప్రభుత్వాల వ్యవహారం

- ఫలానా నిర్ణయాలు తీసుకోవాలని ఎలా ఆదేశించగలం?
- హోదా రాకుంటే ఎవరు, ఎలా నష్టపోతారో వివరాలివ్వండి
- కేఏ పాల్‌కు హైకోర్టు ఆదేశం

రాజ్యాంగాన్ని మోసం చేయడమే

రిజర్వేషన్ కోసమే మతం మారడమంటే అంతే

1 అలాంటి ఆలోచనలు రిజర్వేషన్ల స్ఫూర్తినే దెబ్బతీస్తాయి

1 హిందూ మతం నుంచి క్రైస్తవానికి మారినప్పుడు వారి కులం గుర్తింపు కూడా పోతుంది

1 తిరిగి హిందువుగా మారాలంటే తగిన ఆధారాలుండాలి

1 తనకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించాలన్న తమిళనాడు యువతి సెల్వరాణి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నవంబరు 27: కేవలం ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోసమని మతం మారడం రాజ్యాంగాన్ని మోసం చేయడమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తనను హిందువుగా గుర్తిస్తూ ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలంటూ ఓ క్రైస్తవ యువతి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. బాప్టిజం తీసుకొని హిందూ మతం నుంచి క్రైస్తవానికి మారిన వారు తిరిగి హిందువులమంటూ చెప్పుకోలేరని, వారి కులం గుర్తింపు కూడా మతం మారినప్పుడే రద్దవుతుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. మతాన్ని ఆచరించడం అనేది వ్యక్తిగత

మిగతా 2వ పేజీలో...



'అదానీ'పై దుమారం

- జేపీసీతో విచారణకు ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- పార్లమెంటు ఉభయసభల్లో ఆందోళనలు
- ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే వాయిదా

రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే యోచన లేదు

లోక్‌సభలో స్పష్టంచేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

2

మోదీదే తుది నిర్ణయం

మహారాష్ట్ర సీఎం ఎంపికపై స్పష్టత ఇచ్చిన శిందే

ఐటీలో కొలువుల పండుగ

వచ్చే 6 నెలల్లో 12 శాతం వృద్ధి అంచనా 11

ఫెంగల్ ముప్పు!

నేటి ఉదయానికి తుఫాన్‌గా మారనున్న తీవ్ర వాయుగుండం

రేపు రాత్రికి చెన్నై వద్ద తీరం దాటుతుందని అంచనా 9

తేమ 25 శాతం ఉన్నా కొంటాం

- వాహనాలకు జీపీఎస్ నిబంధన తీసేశాం
- ధాన్యం కొనుగోలులో వెసులుబాట్లు కల్పించాం: మనోహర్
- ఆరబెట్టిన ధాన్యం పరిశీలించి.. కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేసిన మంత్రి

9

మెగా డీఎస్సీ సిలబస్ విడుదల

9



జేసీ X ఆది

బూడిద రవాణాపై రగడ.. రెండో రోజూ లడాయి

కడప జిల్లా ఆర్టీపీపీ వద్ద తీవ్ర ఉద్రిక్తత 2

- ఇరువురు నేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- రేపు రాజధానికి రావాలని ఆదేశం.. దీంతో చర్చల దిశగా ఆ ఇద్దరు

అదానీ-జగన్ అవినీతి ఒప్పందంపై దర్యాప్తునకు ఆదేశించండి

11

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు షర్మిల వినతి



గవర్నర్ నజీర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న షర్మిల

రాజ్యసభకు నాగబాబు?



» అన్న కోసం డిప్యూటీ సీఎం యత్నం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో జనసేన ప్రాతినిధ్యం కోసం ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ పెద్దలను కలిసి విన్నవించినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో తమకు ఒకటి కేటాయించాలని ఆయన కోరినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ విషయాన్ని కేంద్ర పెద్దల వద్ద ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. పవన్ చర్చలు ఫలిస్తే ఆయన అన్న, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు పెద్దల సభలో అడుగు పెట్టడం నల్లేరుపై నడకేకానుంది. జనసేన ఆవిర్భావం నుంచి నాగబాబు పార్టీ కోసం పని చేస్తున్నారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో పర్యటించి అన్నీ సిద్ధం చేసుకున్నారు. కానీ, కూటమి పార్టీల సీట్లు పంపకాల్లో భాగంగా అనకాపల్లి స్థానాన్ని బీజేపీ తీసుకోవడంతో నాగబాబుకు అవకాశం దక్కలేదు. ఆ సమయంలోనే రాజ్యసభకు పంపిస్తానని నాగబాబుకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కావడంతో దీనిలో ఒకటి తీసుకుని నాగబాబును పెద్దల సభకు పంపించాలని పవన్ భావిస్తున్నారు.

చంద్రబాబుతో భాష్యం రామకృష్ణ భేటీ

» రాజ్యసభ ఉప ఎన్నికలో సీటుపై చర్చ?

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. దాదాపు అరగంటకు పైగానే చర్చలు జరిపారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రామకృష్ణ ముఖ్యమంత్రిని కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. భాష్యం పేరు కూడా రాజ్యసభ సీట్ల భర్తీలో పరిశీలనకు రావచ్చని సమాచారం. ఇదిలావుంటే, రామకృష్ణతోపాటు తాజాగా పార్టీ సీనియర్ నేత టీడీ జనార్దన్‌రావు పేరు కూడా రాజ్యసభ రేసులో తెరపైకి వచ్చింది. టీడీ గతంలో ఎమ్మెల్సీగా చేశారు. సుదీర్ఘకాలంగా పార్టీలో పలు బాధ్యతలు నిర్వహించిన ఆయన గత ఎన్నికల్లో పార్టీ అంతర్గత వ్యూహ రచనలో కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా రాజ్యసభ సీటును ఆశిస్తున్నట్లు తెలిసింది.

నెల రోజులు.. 52.45 లక్షలు

» లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో అనతికాలంలోనే అధిక సభ్యత్వాలు నమోదు

» టాప్ 10 నియోజకవర్గాల నేతలకు చంద్రబాబు అభినందనలు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో మొదటి 10 స్థానాల్లో ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యేలను, నేతలను టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు అభినందించారు. సభ్యత్వాల నమోదుపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని, అనతికాలంలోనే 52 లక్షల సభ్యత్వాలకు చేర్పడంపై మంత్రి లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు పార్టీ అధ్యక్షులు, గ్రామ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ సభ్యత్వాన్ని గత నెల 26న ప్రారంభించామని.. నెలరోజుల్లో ఇప్పటికి 52.45 లక్షల మంది కార్యకర్తలు సభ్యత్వం తీసుకున్నారని.. ఇదొక చరిత్రగా పేర్కొన్నారు. రాజంపేట, కుప్పం, కల్యాణదుర్గం, పాలకొల్లు, ఆత్మకూరు, మంగళగిరి, కనిగిరి, కోడూరు, వినుకొండ, కావలి నియోజకవర్గాలు మొదటి పది స్థానాల్లో ఉన్నాయంటూ అక్కడి నాయకత్వాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్ల అరాచక పాలనలో మన కార్యకర్తలు ప్రాణాలు, ఆస్తులు పోగొట్టుకున్నారని.. అయినా భయపడకుండా పోరాడడం వల్ల 57 శాతం ఓట్లతో 93 శాతం స్ట్రయిక్ రేటుతో టీడీపీ కూటమి విజయం సాధించిందని చెప్పారు.

త్వరలో నీటి సంఘాలు, సహకార ఎన్నికలు

కొద్ది రోజుల్లోనే సాగునీటి సంఘాలు, సహకార ఎన్నికలు జరగనున్నాయని.. వీటిలో కూడా కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా పని చేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులను కోరారు. 'రోడ్ల మరమ్మతులకు రూ.1,400కోట్లు మంజూరు చేశాం. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతలు లేకుండా చేస్తాం. యువతకు ఉద్యోగ కల్పనే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇది సంక్షేమానికి పెద్ద పీట వేసే ప్రభుత్వం. అభివృద్ధికి నాంది పలుకుతున్నాం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, తప్పులు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడేలా చేస్తాం. గత ఐదేళ్లూ విచ్చలవిడితనంతో ఎక్కడికక్కడ భూ సమస్యలు సృష్టించారు. త్వరలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి, పరిష్కరిస్తాం' అని చెప్పారు.

పర్యాటకంలో నంబర్ వన్: మంత్రి దుర్గేష్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకాభివృద్ధికి బాటలు వేస్తూ, కేంద్రం సహకారంతో రాబోయే ఐదేళ్లలో ఏపీని పర్యాటక రంగంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అఖండ గోదావరి, గండికోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకమైన సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ. 113.75 కోట్లు నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఒడిశా ఒప్పందం కంటే జగన్ లంచమే ఎక్కువ: ఆనం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అదానీ కంపెనీతో ఒడిశా రాష్ట్రం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందం విలువకంటే మాజీ సీఎం జగన్ తీసుకొన్న లంచమే ఎక్కువగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ విషయం తాము చెప్పడం లేదని, అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ వెల్లడించిందన్నారు. తాను డిమాండ్ చేసిన లంచం ఇవ్వడానికి ఒప్పుకొన్న అదానీ కంపెనీకి సౌర విద్యుత్ టెండర్లు కట్టబెట్టడానికి ముఖ్యమంత్రి హోదాలో జగన్ దుర్మార్గానికి పాల్పడ్డారన్నారు. ఈ క్రమంలో పిలిచిన టెండర్లను కూడా రద్దు చేసి మరీ అదానీలకు కట్టబెట్టారని విమర్శించారు.

'అదానీ'పై దుమారం!

జేపీసీకి విపక్ష సభ్యుల డిమాండ్.. పార్లమెంటు ఉభయసభల్లో ఆందోళనలు

ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే వాయిదా



న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో 'అదానీ' దుమారం ఆగడం లేదు. శీతాకాల సమావేశాల్లో రెండో రోజైన బుధవారం కూడా ఉభయసభల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగలేదు. ప్రతిపక్ష పార్టీల సభ్యుల ఆందోళనలతో లోక్‌సభ, రాజ్యసభ ఉదయం ఒకసారి వాయిదా పడ్డాయి. మళ్లీ సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. లోక్‌సభ సమావేశమైన వెంటనే బుధవారం ఉదయం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే అదానీ సంస్థపై వచ్చిన ఆరోపణల మీద చర్చించాలని; యూపీలోని సంభాల్‌లో జరిగిన హింసపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ మళ్లీ సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. ఇక రాజ్యసభలోనూ గందరగోళం నెలకొంది. సభలో కార్యకలాపాలన్నింటినీ నిలిపివేసి అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 18 వాయిదా తీర్మానాలను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. సభ్యులు నిరసనకు దిగడంతో సభను వాయిదా వేశారు. వాయిదా తీర్మానాల్లో సగం కాంగ్రెస్ సభ్యులే ఇవ్వడం గమనార్హం. అవి కూడా అదానీ అంశంపైనే ఇచ్చారు. మిగిలిన సగంలో కొన్ని యూపీ, మణిపూర్ హింసపై చర్చ జరగాలని, మరికొన్ని ఇతర కారణాలతో వేర్వేరు పార్టీల సభ్యులు ఇచ్చారు. సభలో గందరగోళం నెలకొనడంతో గురువారానికి వాయిదా వేశారు. కాగా, ప్రభుత్వ మొండి వైఖరితోనే ఉభయసభలు వాయిదా పడ్డాయని కాంగ్రెస్ ఆరోపించింది. అదానీ సంస్థపై వచ్చిన ఆరోపణల మీద చర్చించడానికి మోదీ సర్కారు ఇష్టపడడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. మోదానీ స్కాంపై జేపీసీతో విచారణ జరిపించాల్సిందేనని, తాము ఈ డిమాండ్ చేస్తూనే ఉంటామని చెప్పారు.

అదానీని అరెస్టు చేయాల్సిందే: రాహుల్

అదానీని అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడారు. దేశంలో చిన్న చిన్న ఆరోపణలకే వందలాది మందిని అరెస్టు చేస్తున్నారని, అలాంటప్పుడు అదానీ ఎందుకు జైల్లో లేరని ప్రశ్నించారు. 'జైల్లో ఉండాల్సిన ఆయన్ను ప్రభుత్వం కాపాడుతోంది' అని రాహుల్ ఆరోపించారు. కాగా, అదానీపై వచ్చిన లంచం ఆరోపణల తీవ్రతను నీరుగార్చేందుకు 'మోదానీ ఎకోసిస్టమ్' ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ ఆరోపించారు. ఇటువంటి హాస్యాస్పద ప్రయత్నాలతో అమెరికా ఏజెన్సీలు చేస్తున్న ఆరోపణల తీవ్రతను తగ్గించలేరని స్పష్టం చేశారు.

ముడుపుల కేసులో అదానీలపై ఒక్క ఆధారమూ లేదు

న్యాయకోవిదులు ముకుల్ రోహత్గీ, మహేశ్ జెఠ్మలానీ ధ్వజం


న్యూఢిల్లీ, నవంబరు 27: గౌతమ్ అదానీ, సాగర్ అదానీపై అమెరికాలో పెట్టిన ముడుపుల కేసుల్లో ఒక్క ఆధారం కూడా లేదని ప్రముఖ న్యాయకోవిదులు ముకుల్ రోహత్గీ (మాజీ అటార్నీ జనరల్), మహేశ్ జెఠ్మలానీ(రాజ్యసభ సభ్యుడు) అన్నారు. అమెరికా న్యాయ శాఖ అభియోగాల్లో స్పష్టత, నిర్దిష్టత లోపించాయన్నారు. ప్రతిపక్షాలు దీనిపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. వారిద్దరూ కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'అమెరికా కోర్టులో మొత్తం ఐదు అభియోగాలున్నాయి. మొదటి, ఐదో కేసులు వీటిలో ముఖ్యమైనవి. వీటిలో అదానీల పేర్లు లేనే లేవు. 2,3 కేసుల్లో అదానీ పేర్లు ఉన్నాయి. మౌలికంగా ఇవి సెక్యూరిటీలు, బాండ్లకు సంబంధించినవి. విద్యుత్ సరఫరా, కొనుగోళ్ల వ్యవహారంలో భారతీయ అధికారులకు అదానీలు ముడుపులిచ్చారన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఎవరికి లంచాలిచ్చారు.. ఏ రూపంలో ముడుపులు ముట్టజెప్పారు. సదరు అధికారి ఏ శాఖకు చెందిన వారో అందులో ఒక్క పేరు గానీ, వివరం గానీ లేవు' అని రోహత్గీ వ్యాఖ్యానించారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నాక.. ఆ పరాజయం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్, ఇండీ కూటమి అదానీ వ్యవహారాన్ని వాడుకుంటున్నాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా.. విదేశీ ప్రమేయం ఉన్న అదానీ, మణిపూర్ అంశాలపైనే అవి దృష్టిపెట్టాయి' అని మహేశ్ జెఠ్మలానీ విమర్శించారు.

రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే యోచన లేదు

లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, నవంబరు 27: ప్రజాపంపిణీ(పీడీఎస్) కార్యక్రమంలో రేషన్ డీలర్లకు మార్జిన్ పెంచే ఆలోచనేదీ కేంద్రం దృష్టిలో లేదని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి బుధవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. అయితే కేంద్రం నిర్ణయించిన మార్జిన్ల కంటే పెంచి ఇచ్చేందుకు రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉందని ఈ అంశంపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2022 ఏప్రిల్‌లో సవరించిన ఆహార భద్రత నిబంధనల మేరకు డీలర్లకు క్వింటాల్‌కు ఇచ్చే మార్జిన్ రూ.90. జనరల్ కేటగిరీ రాష్ట్రాల్లో ఈ మొత్తానికి మరో రూ.21 కలిపి ఇస్తారు. అదే ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాల్లో క్వింటాల్‌కు రూ.180తోపాటు అదనంగా మరో రూ.26 కలిపి ఇస్తారు. కాగా రేషన్ షాపులకు లైసెన్సులు ఇవ్వడం, వాటి పర్యవేక్షణ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపైనే ఉన్నాయని కేంద్రమంత్రి గుర్తుచేశారు. డీలర్లకు ఇచ్చే వాస్తవ మార్జిన్, కమిషన్‌ని నిర్ణయించడంలో కేంద్రానికి ఎటువంటి పాత్రా లేదని స్పష్టం చేశారు. కాగా ప్రయాణికుల విమానాలకు ఈ ఏడాది మొత్తం 994 ఉత్తుత్తి బెదిరింపు కాల్స్ వచ్చాయని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మహోల్ బుధవారం పార్లమెంటులో తెలిపారు. ఈ బెదిరింపు కాల్స్ తీవ్రతను అంచనా వేసి పటిష్ఠ చర్యలు తీసుకొనేందుకు పౌర విమానయాన భద్రత బ్యూరో(బీసీఏఎస్) పటిష్ఠ భద్రతా ప్రణాళికను రూపొందించిందని ఆయన వివరించారు. అందులో భాగంగా దేశంలో ప్రతి విమానాశ్రయానికి ఒక ప్రత్యేక బాంబు బెదిరింపు తీవ్రత అంచనా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా సామాజిక మాధ్యమాల్లో అసభ్య సమాచారాన్ని(కంటెంట్) నివారించేందుకు ఇప్పుడున్న చట్టాలను మరింత కఠినతరం చేయాల్సి ఉందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో చెప్పారు.

లోకం తీరు



రాజ్యాంగాన్ని మోసం చేయడమే

(మొదటి పేజీ తరువాయి)

విశ్వాసాల ఆధారంగా ఉండాలే తప్ప రిజర్వేషన్ల కోసం కాదని, ఎస్సీ సర్టిఫికెట్‌ను ఇప్పించలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తమిళనాడుకు చెందిన సెల్వరాణి అనే యువతి.. తనకు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెల్వరాణి తండ్రి హిందువు. తల్లి క్రిస్టియన్. సెల్వరాణి 1990 నవంబరులో జన్మించారు. 1991 జనవరిలో ఆమెకు బాప్తిజం చేశారు. అయితే, 2015లో పుదుచ్చేరి డివిజన్ క్లర్క్ పోస్టు కోసం తనకు ఎస్సీ సర్టిఫికెట్‌ను ఇప్పించాలని ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆమె వినతిని తిరస్కరించగా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. స్కూల్ రికార్డుల్లో తను ఎస్సీ అనే ఉందని, తన తండ్రి హిందువుల్లో వల్లువన్(ఎస్సీ) కులానికి చెందినవారని, తన సోదరుడు కూడా హిందువేనని వాదించారు. అయితే, పిటిషనర్ క్రైస్తవాన్ని పాటిస్తున్నారని, తరచూ చర్చికి వెళ్తున్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని కోర్టు పేర్కొంది. క్రైస్తవాన్ని ఆచరిస్తూ ఆమె హిందువునని చెప్పుకొంటున్నారని, ఇలాంటి ద్వంద్వ వైఖరిని కోర్టు ఆమోదించబోదని తెలిపింది. రిజర్వేషన్ కోసమే ఆమె మతం మారాలనుకోవడం లాంటి ఆలోచనలు రిజర్వేషన్ విధానపు స్ఫూర్తినే దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించింది. మతం మారిన వారు తిరిగి హిందూ మతంలోకి వెళ్లాలంటే తగిన ఆధారాలుండాలని, వారు హిందూ మత విశ్వాసాలను పాటిస్తూ ఉండాలని వివరించింది. ప్రస్తుత కేసులో ఇలాంటి ఆధారాలేవీ లేవని స్పష్టం చేసింది. పైగా, పిటిషనర్ తండ్రి, సోదరుడు కూడా బాప్తిజం తీసుకున్నట్లు ఆధారాలున్నాయని తెలిపింది. సెల్వరాణి అభ్యర్థనను తిరస్కరిస్తూ పిటిషన్‌ను కొట్టేసింది.

'ఇస్కాన్'పై బంగ్లాదేశ్‌లో నిషేధం!

ఢాకా/న్యూఢిల్లీ, నవంబరు 27: అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం(ఇస్కాన్)పై నిషేధం విధించనున్నట్టు బంగ్లాదేశ్ సంచలన ప్రకటన చేసింది. ప్రస్తుతం నిషేధం విధించే ప్రక్రియ కొనసాగుతోందని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్(ఏజీ) అసదుజ్జమాన్ వెల్లడించారు. ఇస్కాన్‌ను మతతత్వ సంస్థగా అభివర్ణించారు. ఇస్కాన్‌కు నాయకుడు, ఆధ్యాత్మిక వేత్త చిన్మయ్ కృష్ణదాస్‌ను దేశ ద్రోహం కేసు కింద బంగ్లాదేశ్ అరెస్టు చేసి, జైలులో పెట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. మరోవైపు కృష్ణదాస్ అరెస్టును ఖండిస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సహా పలు ప్రాంతాల్లో ఇస్కాన్ సభ్యులు, హిందూ వర్గాలు కూడా తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలపై బుధవారం ఢాకా హైకోర్టులో సుప్రీంకోర్టు న్యాయవాది మొనిరుజ్జమాన్ పిటిషన్ దాఖలు చేశారు. ఇస్కాన్‌పై నిషేధం విధించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అదేవిధంగా రంగ్‌పూర్, చట్టోగ్రామ్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎమర్జెన్సీ విధించాలని కోరారు. హైకోర్టు స్పందిస్తూ.. ఇస్కాన్ కార్యకలాపాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని బంగ్లా ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇస్కాన్‌పై నిషేధం విధించే ప్రక్రియ కొనసాగుతోందని, తాజా పరిణామాలపై రాజకీయ పార్టీల నాయకులతో ప్రభుత్వం చర్చిస్తోందని ఏజీ హైకోర్టుకు తెలిపారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో చిన్మయ్‌పై నమోదైన కేసు, అరెస్టు వ్యవహారంలో ఐక్యరాజ్యసమితి(ఐరాస) జోక్యం చేసుకోవాలని ఇస్కాన్ కోల్‌కతా కార్యాలయం కోరింది. మరోవైపు, చిన్మయ్ అరెస్టును తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. "బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే పాకిస్థాన్‌ను తలపిస్తోంది" అని కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ విమర్శించారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి కచ్చితంగా జోక్యం చేసుకోవాల్సి ఉందన్నారు.

మోదీదే తుది నిర్ణయం

» సీఎం ఎంపికపై శిందే స్పష్టత



ముంబై, న్యూఢిల్లీ, నవంబరు27: మహారాష్ట్ర కొత్త సీఎం ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటుపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే స్పష్టం చేశారు. మోదీ, షాతో తాను ఫోన్‌లో మాట్లాడానని, కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై తమ తరఫున ఎలాంటి అడ్డంకులు ఉండబోవని స్పష్టం చేసినట్లు ముంబైలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తనకు కేంద్ర మంత్రి పదవిపై ఆసక్తి లేదని కూడా శిందే తేల్చి చెప్పారు. అయితే మహాయుతికి ప్రజలు ఘన విజయం అందించిన నేపథ్యంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఉధృతంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. శిందే ప్రకటనతో బీజేపీ తరఫున కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసేందుకు మార్గం సుగమమైంది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై చర్చలు జరిపేందుకు ఢిల్లీకి రావాలని శిందే, అజిత్ పవార్‌లకు బీజేపీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. సీఎం, డిప్యూటీ సీఎం పదవులతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల కేటాయింపులపై శిందే, పవార్‌లతో చర్చించే అవకాశం ఉంది. మరోవైపు, శివసేన ఎంపీలు పార్లమెంట్‌లో అమిత్ షాతో సమావేశమయ్యారు. మహారాష్ట్ర బీజేపీ సీనియర్ నేత ఫడణవీస్ ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. శిందే విలేకరుల సమావేశంలో చేసిన ప్రకటనతో అందరి అనుమానాలు తీరి ఉంటాయని ఫడణవీస్ చెప్పారు.

నిరసనకారుల నుంచే నష్టపరిహారం వసూలు

» రాళ్లు రువ్విన వ్యక్తుల పోస్టర్లు.. సంభాల్‌పై యూపీ నిర్ణయం

లఖ్‌నవూ, నవంబరు 27: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సంభాల్ అల్లర్లలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఆ రోజు ప్రభుత్వ ఆస్తులకు వాటిల్లిన నష్టానికి నిరసనకారుల నుంచి పరిహారం వసూలు చేయాలని నిర్ణయించింది. రాళ్లు రువ్విన వారి పోస్టర్లను బహిరంగ ప్రదేశాల్లో అంటించనుంది. వారికి సంబంధించిన సమాచారం ఇస్తే పారితోషికం అందజేయనుంది.

లాటరీలో బ్రిటన్ వ్యక్తికి రూ.1800 కోట్లు

లండన్, నవంబరు 27: బ్రిటన్‌కు చెందిన ఓ వ్యక్తి జాక్‌పాట్ కొట్టాడు. అతడు కొన్న లాటరీకి సుమారు రూ.1800 కోట్ల(177 మిలియన్ పౌండ్లు) ప్రైజ్‌మనీ తగిలింది. మంగళవారం బ్రిటన్‌లోని నేషనల్ లాటరీని నిర్వాహకులు డ్రా తీశారు. 07, 11, 25, 31, 40 నంబరు గల టికెట్‌కు లాటరీ దక్కినట్లు ప్రకటించారు.

'హోదా' ప్రభుత్వాల మధ్య వ్యవహారం

» ఫలానా విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఎలా ఆదేశించగలం?

» హోదా రాకుంటే ఎవరు, ఎలా నష్టపోతారో వివరాలివ్వండి: హైకోర్టు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారమని హైకోర్టు పేర్కొంది. ఇందులో ఫలానా విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాలను తామెలా ఆదేశించగలమని ప్రశ్నించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఎవరు నష్టపోతారు? ఎలా నష్టపోతారనే వివరాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్‌ను ఆదేశిస్తూ విచారణను డిసెంబరు 11కి వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్ కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ... పునర్విభజన సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ వేదికగా ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని తెలిపారు. ప్రత్యేక హోదా ప్రకటిస్తే పరిశ్రమలకు ప్రోత్సాహకంగా ఉంటుందని, తద్వారా ఉపాధి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ప్రత్యేక హోదాపై రాతపూర్వక ఉత్తర్వులు ఏమైనా ఉన్నాయా అని ఆరాతీసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు వాదనలు వినిపిస్తూ..... రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై రాతపూర్వకంగా ఎలాంటి ఉత్తర్వులు లేవని తెలిపారు. కేఏ పాల్ స్పందిస్తూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ వేస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. ధర్మాసనం స్పందిస్తూ కౌంటర్లు వేయాలని తాము శాసించలేమని స్పష్టం చేసింది.

కె.శ్రీనివాస్, తెలకపల్లికి గజ్జల మల్లారెడ్డి పురస్కారం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవికి గజ్జల మల్లారెడ్డి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.క్రిష్టారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూలో జరిగిన ఎంపిక కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకుని సమాజానికి ఉపయోగపడే రచనలు చేయడంలో కె.శ్రీనివాస్, తెలకపల్లి రవి తమదైన శైలిలో ముందున్నారన్నారు. ప్రజాపక్షం వహించి సంపాదకీయాలు రాయడంలో, సాహిత్య రచనలు చేయడంలో వీరిద్దరూ ప్రజాస్వామ్య పద్ధతులను అవలంబించారని చెప్పారు.

రెండో రోజూ లడాయి!

» జేసీ వర్సెస్ ఆదిల మధ్య బూడిద రవాణా రాజకీయం

» ఆర్టీపీపీ వద్ద తీవ్ర ఉద్రిక్తత

ఎర్రగుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) వద్ద రెండో రోజైన బుధవారం కూడా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీపీపీ యాష్ పాండ్ నుంచి తాడిపత్రి సిమెంట్ ఫ్యాక్టరీకి ఫ్లైయాష్ రవాణా చేసే విషయంలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నేత, ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డిల మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆర్టీపీపీకి వస్తారని తెలియడంతో పోలీసులు భారీగా మోహరించారు. మంగళవారం ఆయన రాకపోగా బుధవారం వస్తానని ఎస్పీకి లేఖ రాయడంతో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఉదయం 10గంటలకు జేసీ పంపిన నాలుగు లారీలు ఫ్లైయాష్ లోడింగ్ కోసం ఆర్టీపీపీకి వచ్చాయి. వీటిని పోలీసులు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఆది వర్గీయులు అక్కడికి చేరుకున్నారు. ఆది వర్గీయులు లోడింగ్ చేస్తామంటేనే లోపలికి అనుమతిస్తామని లేదంటే పంపబోమని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో లోడింగ్ చేయాలని జేసీ డ్రైవర్లు ఆది వర్గీయులను కోరారు. దీనికి ఆది వర్గీయుడు సంజీవరెడ్డి స్పందిస్తూ.. తమకు చాలా బకాయిలున్నాయని వాటన్నింటినీ చెల్లించాలని, రవాణా ఖర్చులో సగభాగం వాటా ఇవ్వాలని షరతు విధించారు. దీంతో చేసేది లేక జేసీ డ్రైవర్లు యజమానికి విషయాన్ని తెలిపారు. మరోవైపు ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి టిప్పర్‌ను, లారీని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు.



ఆది వర్గీయులతో మాట్లాడుతున్న లారీ డ్రైవర్లు

రూ.80 లక్షల బకాయిలున్నాయి

జేసీ లారీలకు లోడింగ్ చేసినందుకు సుమారు రూ.80 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని ఎమ్మెల్యే ఆది వర్గీయుడు సంజీవరెడ్డి తెలిపారు. దీంతో 2 నెలల నుంచి లోడింగ్ నిలిపివేసినట్టు తెలిపారు. బకాయిలు చెల్లించి, రవాణాకు 50 శాతం కాంట్రాక్టు ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు.

వెనక్కి వెళ్లేది లేదు

తమ యజమాని ఆదేశాల మేరకు ఆర్టీపీపీలో లోడింగ్ కోసం తాడిపత్రి వచ్చినట్లు జేసీ తాలూకు డ్రైవర్లు తెలిపారు. ఇక్కడివారు లోడింగ్ చేయమంటున్నారని, ఈ విషయాన్ని తమ యజమానికి చెప్పామన్నారు. లోడింగ్ చేసుకోకుండా వెనక్కి వెళ్లేది లేదని చెప్పారు.

చంద్రబాబు ఆగ్రహం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర రెడ్డిల వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరినీ శుక్రవారం రాజధానికి వచ్చి తనను కలవాలని ఆదేశించారు. ఆర్టీపీపీ ఫ్లైయాష్ వ్యవహారంలో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వివాదం రోడ్డుకెక్కి గత రెండు రోజులుగా ఆ రెండు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి పార్టీల నేతల మధ్య వివాదం కావడంతో అధికార యంత్రాంగానికి కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది. ఇరువైపులా ఎవరి వాదనలు వారు వినిపిస్తుండటంతోపాటు సవాళ్లు, ప్రతి సవాళ్ల వరకు వ్యవహారం చేరింది. ఈ వివాదం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. చంద్రబాబు ఆగ్రహంతో ఉండటంతో ఆయన వద్దకు రావడానికి ముందే సమస్యను పరిష్కరించుకోవడానికి ఆది, జేసీలు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు, ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతిభద్రతల సమస్య రానివ్వొద్దని, సమస్య సృష్టించడానికి ఎవరు ప్రయత్నించినా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక, మంత్రి గొట్టిపాటి బుధవారం ఆ శాఖ ఉన్నతాధికారులతో ఫ్లైయాష్ వ్యవహారంపై సమీక్షించారు.

వినియోగదారుల ఫోరం అధ్యక్షులకు ఊరట

» తదుపరి ఉత్తర్వుల వరకు వారినే కొనసాగించండి: హైకోర్టు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాల వినియోగదారుల ఫోరం అధ్యక్షులు, సభ్యులకు హైకోర్టు ధర్మాసనం ఉపశమనం కలిగించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు గతంలో ఉన్నవారినే కొనసాగించాలని స్పష్టం చేసింది. వారి నియామకానికి సంబంధించిన రికార్డులను తమ ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 4కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చిత్తూరు, కడప, నెల్లూరు, గుంటూరు ఫోరంల అధ్యక్షులు, కడప, తిరుపతి జిల్లాల ఫోరం సభ్యుల నియామకంపై అభ్యంతరం తెలుపుతూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. వీరి నియామకాలను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయా జిల్లాలు అధ్యక్షులు, ఫోరం సభ్యులు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ పోస్టులన్నీ రాజకీయ నియామకాలేనని వ్యాఖ్యానించింది. ఫోరం అధ్యక్షులు, సభ్యుల ఎంపిక కమిటీలో హైకోర్టు సీజే లేదా ఆయన నామినేట్ చేసిన న్యాయమూర్తులు, ఐఏఎస్‌లు సభ్యులుగా ఉంటారని, ఆ కమిటీ ఎంపికను తప్పుపట్టలేమని చెప్పింది. కమిటీ ఎంపిక చేసిన పేర్లకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలా? లేక అందులో ఎవరినైనా ఫోరం అధ్యక్షులు, సభ్యులుగా నియమించవచ్చా? అనే విషయాన్ని తేలుస్తామని పేర్కొంది.

పాఠశాలల్లో అగ్నిమాపక పరికరాల ఏర్పాటుపై పిల్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలోని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేతినీడి అఖిలశ్రీ గురుతేజ ఈ పిల్ వేశారు.

గిరిజనేతరులకు మద్యం దుకాణాలపై పిల్

గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల ఆమోదం లేకుండా గిరిజనేతరులకు మద్యం దుకాణాల లైసెన్స్‌లు ఇవ్వడంపై కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు టి.వెంకటశివరామ్ ఈ పిల్ వేశారు.



తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ జరిగింది. గురువారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

నడి సంద్రంలో చిక్కుకున్న పడవ

- బిక్కుబిక్కుమంటూ 9 మంది మత్స్యకారులు
- కలెక్టర్ చొరవతో కాపాడిన మత్స్య శాఖ, పోర్టు అధికారులు



ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, మెరైన్ ఎస్‌ఐ తదితరులు, సముద్రంలో నిలిచిపోయిన మెకనైజడ్ బోట్

నెల్లూరు (వ్యవసాయం)/వాకాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంజన్ మరమ్మతులకు గురై సముద్రంలో నిలిచిపోయిన మెకనైజ్డ్ బోటును మత్స్య శాఖ అధికారులు, కృష్ణపట్నం పోర్టు సిబ్బంది సహకారంతో బుధవారం ఒడ్డుకు తీసుకొచ్చారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం చెన్నారాయనిపాళెం పంచాయతీ పాతపాళెం, తాటిచెట్లపాళెం గ్రామాలకు చెందిన 9 మంది మత్స్యకారులు మెకనైజ్డ్ బోటులో చెన్నై వైపు నుంచి కృష్ణపట్నం పోర్టుకు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో తిరుపతి జిల్లా వాకాడు మండలం వైట్‌కుప్పం, ఓడపాళెం తీరానికి 14 కిలోమీటర్ల దూరాన సముద్రంలో వీరి బోట్ ఇంజన్ పాడైంది. అలలతాకిడికి కదలలేనిస్థితిలో ఆ బోట్‌లో మత్స్యకారులు చిక్కుకుపోయారు. బోట్‌లోని అత్యవసర ఇండికేటర్‌ను వేయడంతో కృష్ణపట్నం పోర్టు కోస్ట్‌గార్డ్‌కు సమాచారం అందగానే వారు.. నెల్లూరు, తిరుపతి జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే సముద్రంలో అల్పపీడన ప్రభావంతో వాయుగుండం బలపడి తీవ్ర తుఫాన్‌గా మారడంతో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సమాచారం అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. వాతావరణం ఇబ్బందిగా ఉన్నప్పటికీ కృష్ణపట్నం ఓడరేవు నుంచి కోస్ట్‌గార్డ్ నావికా దళం, అధికారులు, సిబ్బంది ప్రత్యేక బోట్‌లో సముద్రంలోకి వెళ్లారు. చిక్కుకుపోయిన మెకనైజడ్ బోట్‌ను గుర్తించి బుధవారం ఉదయం 10 గంటలకు కృష్ణపట్నం తీసుకొచ్చారు. పోర్టు వైద్య సిబ్బంది వారికి వైద్య పరీక్షలు చేయగా, మత్స్యశాఖ అధికారులు భోజన సదుపాయం కల్పించారు. రాత్రంతా సముద్రంలో ఎగిసిపడే రాకాసి అలల మధ్య ప్రాణభయంతో అల్లాడిన మత్స్యకారులు.. తమను ఒడ్డుకు చేర్చిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులకు అచ్చెన్న అభినందనలు

కోటబొమ్మాళి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సముద్రంలో నిలిచిపోయిన మత్స్యకారుల బోటును సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చిన అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు తెలియజేశారు. బుధవారం ఉదయం నుంచి యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలు ఫలించి బోటులో చిక్కుకున్న 9 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేరుకునేందుకు కృషి చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంటేశ్వర్, కృష్ణపట్నం మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్, ఇతర అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.



పట్టు చీరలను పరిశీలిస్తున్న హీరోయిన్లు సంయుక్త మీనన్, నైన సారిక, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, వెనిగండ్ల తదితరులు

సీఎంఆర్‌ను గుడివాడ ప్రజలు ఆదరిస్తారు

- షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో కామినేని, వెనిగండ్ల

గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వందేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ప్రభావం చూపిన వ్యక్తులు గుడివాడ పరిసర ప్రాంత వాసులేనని ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ 38వ షోరూమ్‌ను నిన్న వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ గుడివాడ ప్రజలు నిష్ణాతులని, నూతనంగా ప్రారంభించిన సీఎంఆర్ మాల్‌ను ప్రజలు ఆదరిస్తారన్నారు. గుడివాడకు మరిన్ని మాల్స్ రావాలని, దీంతో స్థానికులకు ఉపాధి దొరుకుతుందని వెనిగండ్ల ఆకాంక్షించారు. హీరోయిన్ సంయుక్త మీనన్ మాట్లాడుతూ తనకు సీఎంఆర్ షాపింగ్ మాల్‌తో మంచి అనుబంధం ఉందని, తానే 4 మాల్స్‌ను ప్రారంభించడం తన అదృష్టమన్నారు. "కోఫేం నైనా సారిక మాట్లాడుతూ రూ.99 నుంచి పైస్థాయి వరకు వస్త్రాలు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. సీఎంఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ గత 4 దశాబ్దాలుగా ఒడిశాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో 38 షోరూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. సీఎంఆర్‌లో షాపింగ్ చేస్తే ప్రపంచస్థాయి అనుభూతి కలుగుతుందన్నారు.

ఒత్తిడి భరించలేక వైద్య విద్యార్థి ఆత్మహత్య




వీర రోహిత్

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చదువుల ఒత్తిడి భరించలేక ఓ వైద్య విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన శివప్రసాద్, శారద దంపతుల కుమారుడు వీర రోహిత్(21) అనంతపురం మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. డిసెంబరులో పరీక్షల నేపథ్యంలో కాలేజీ హాస్టల్‌లోని ప్రత్యేక గదిలో ఒక్కడే ఉంటున్నాడు. అతని తమ్ముడు బుధవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా స్పందించక పోవడంతో అనంతపురంలో తమ బంధువు ధీరజ్‌కు విషయం తెలియజేశాడు. ధీరజ్ కాలేజీ హాస్టల్‌కు వెళ్లి చూసేసరికి రోహిత్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే రోహిత్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. తన చావుకు తానే కారణమని, ఆలోచనల నుంచి బయట పడలేకపోతున్నానని రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తేమ శాతం సడలించి పత్తి కొనుగోలు

- రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీసీఐ కేంద్రాల్లో పత్తి తేమ శాతం సడలించి కొనుగోలు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత అధికారులను ఆదేశించారు. గుంటూరులోని సీసీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్ పాణిగ్రాహి ఇతర ఉన్నతాధికారులతో బుధవారం ఆమె ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చే పత్తిలో 8-12 శాతం మేర తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామన్న నిబంధనను కొంత సడలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇంకా తెరవని 17 సీసీఐ కేంద్రాలను 24 గంటల్లో తెరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వాతావరణ అధర్మం

వాతావరణమార్పుమీద ప్రపంచదేశాలన్నీ ఏకతాటిమీదకు వచ్చి సంఘటితంగా యుద్ధం చేయగలవన్న ఆశ అంతకంతకూ నశించిపోతున్నది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏటా జరిగే సభ్యదేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్)లో అప్పుడప్పుడు కొన్ని మెరుపులు తప్ప, ప్రభావవంతమైన చర్యలు కనిపించడం లేదు. అజర్‌బైజాన్ రాజధాని బాకులో మొన్న ముగిసిన సదస్సు కూడా ఎప్పటిలాగానే, కాస్తంత ఎక్కువసాగి, మరోరెండు రాత్రులు చర్చోపచర్చలు జరిగినా, ఫలితం మాత్రం ఘనంగా లేకపోయింది. ఈ 29వ సదస్సును ప్రత్యేకంగా 'ఫైనాన్స్ కాప్' అని అనుకోవడంలో ప్రధానోద్దేశం, వాతావరణంలో ప్రతికూల మార్పులమీద పోరాడేందుకు వీలుగా వర్ధమాన దేశాలకు ధనికదేశాలు అందించే ఆర్థికసాయాన్ని అధికం చేయడం. వాతావరణమార్పులపై పోరాటాన్ని సుసాధ్యంచేయాలంటే, ఎదుగుతున్నదేశాలకు పెద్దదేశాలు అందించాల్సిన సాయం 1.3 ట్రిలియన్ డాలర్లు ఉండాలన్న నిర్దిష్టమైన అంచనాలకు పూర్తి భిన్నంగా, పదేళ్ళపాటు ఏటా మూడువందల బిలియన్ డాలర్లు ఇవ్వడానికి మాత్రమే ధనికదేశాలు సిద్ధపడటం, సదస్సులో తదనుగుణంగా తీర్మానం జరగడం విచిత్రం.

వాతావరణ నిధిని ఈ మేరకు సరిపెట్టేయడం భారత్ సహా మిగతా అభివృద్ధి చెందుతున్నదేశాలకు ఏ మాత్రం నచ్చలేదు. వాతావరణంలో ప్రతికూలమార్పుల వల్ల ప్రధానంగా నష్టపోతున్నది బడుగుదేశాలే కనుక, అధిక కాలుష్యంతో వాతావరణాన్ని నాశనం చేస్తున్నది అగ్రదేశాలే కనుక వాటినుంచి ఇవి ఎక్కువ సాయాన్ని ఆశించడంలో తప్పు లేదు. వాతావరణ బీభత్సాలతో, విపత్తులతో అభివృద్ధిచెందుతున్న దేశాలకు ఒనగూరే నష్టంతో పోల్చితే అగ్రరాజ్యాలు ఏటా ఇచ్చే మూడు వందల బిలియన్ డాలర్లు ఏ మూలకూ రాదు. మొదట 250 బిలియన్ డాలర్లకు ఒప్పుకొని, ఆ తరువాత వర్ధమాన దేశాల ఒత్తిళ్ళతో, సదస్సు విఫలమయ్యే ప్రమాదాలు కనిపించడంతో 300 బిలియన్ డాలర్లకు ఈ నిధిని పెంచడానికి అవి అంగీకరించాయి. అనేకగంటలపాటు చర్చలు నిలిచిపోయి, నిరసనలు, వాకౌట్లతో సదస్సులో గందరగోళం ఏర్పడిన తరుణంలో మరో యాభై బిలియన్ డాలర్లు అదనంగా చేర్చేందుకు అవి ఒప్పుకున్నాయి. ఇంతహడావుడివల్ల కాబోలు, ఈ చిన్న మొత్తమే అమెరికాకు మహాద్భుతంగా కనిపించింది.

ప్రపంచ ఉష్ణోగ్రతలను ఒకటిన్నర డిగ్రీల సెల్సియస్‌కు కుదించాలన్న లక్ష్యం పెట్టుకొని దాదాపు పదిహేనేళ్ళవుతోంది. పారిస్‌లో అనుకున్నదానిమీద పెద్దగా అడుగు ముందుకు పడకుండానే, మరోపక్క ఉద్గారాలు పెరిగిపోతున్నాయి, భూ ఉష్ణోగ్రత హెచ్చుతోంది. కొత్తగా చేసుకుంటున్న ఈ చేటును పరిమితం చేసుకుంటేనే, గతంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సాధ్యపడుతుంది. ఉద్గారాలు తగ్గించుకోవాలంటే, ఆర్థికసాయంతో పాటు ఆధునిక సాంకేతికతలసాయం కూడా ఎదుగుతున్నదేశాలకు అందాలి. ఇవేమీ జరగకుండా, తమ ఉత్పత్తిని ఆవగింజంత తగ్గించకుండా, కాలుష్యాన్ని కుదించకుండా ధనికదేశాలు విచిత్రమైన విన్యాసాలు చేస్తున్నాయి.

గతంలో హామీ పడిన ఏటా 100 బిలియన్ డాలర్ల సాయం ఇప్పుడు మూడింతలు పెరిగినందుకు సంతృప్తిపడి సరిపెట్టుకోవడం వినా చేయగలిగిందేమీ లేదు. పదేళ్ళుగా ఆ పాత సాయం కూడా సరిగా సమకూరని స్థితిలో, ఇప్పుడు కొత్తగా హామీపడినదానికి ఆ దేశాలు ఏమేరకు కట్టుబడివుంటాయో చూడాలి. మానవాళి అంతటికీ చెందిన ప్రకృతిని నాశనం చేసి, సిరిసంపదలతో, సకల సౌఖ్యాలతో తులతూగుతున్న ధనికదేశాలు కర్బన ఉద్గారాల పాపాన్ని మాత్రం దేశాలన్నింటికీ పంచాలనుకుంటాయి. ఉద్గారాల్లో డెబ్బయ్‌ఐదుశాతం వాటాతో ప్రకృతిని నాశనంచేస్తున్న సంపన్న దేశాలు పర్యవసానాలను మాత్రం పేదదేశాలమీద రుద్దుతున్నాయి. పర్యావరణ పరిరక్షణలో అవి కనీస బాధ్యత వహిస్తే కాప్ సదస్సులు ఇలా మొక్కుబడిగా తయారయ్యేవి కావు. అధిక పారిశ్రామికీకరణతో, హద్దులు లేని ఉత్పత్తితో లాభపడుతున్న సంపన్న దేశాల దగ్గరనుంచి ఇప్పుడు హామీపడిన ఆర్థికసాయాన్ని పొందడంతో పాటు, పర్యావరణ అనుకూల విధానాలకు మారేందుకు ఉపకరించే ఇతరత్రా పరిజ్ఞానాలను కూడా ఉచితంగానో, కారుచవుకగానో వర్ధమానదేశాలు పొందవలసి ఉంది. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జరగబోయే కాప్ 30 సదస్సులో ప్రపంచదేశాలన్నీ ఏకతాటిమీదకు వచ్చి వాతావరణ మార్పుపై మానవ పోరాటాన్ని విజయవంతం చేసే దిశగా నిర్దిష్ట కార్యాచరణకు పూనుకోవాలి.

పెను సవాళ్ళకు దారితీయనున్న వర్గీకరణ తీర్పు

'కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?' శీర్షికన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ రాసిన వ్యాసంలో (24–10–2024) ఆయన మాలలపై అక్కసుతో అబద్ధ ప్రచారాల పరంపరను మరోసారి కొనసాగించారు. గత ఆగస్టు ఒకటో తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇచ్చిన తీర్పు కక్షిదారులకన్నా దాని ప్రభావిత వర్గాలను తీవ్రమైన ఆందోళనకు గురిచేసింది. ప్రధానంగా ఉత్తర భారత దళితులు ఈ తీర్పును అంగీకరించేది లేదని ఆందోళనలు చేస్తున్నారు. తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన భారత్ బంద్‌లో ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా మాదిగ సామీప్య కులం లాంటి చమార్ కులస్తులు అధికంగా ఉన్న ప్రాంతాలలో, విజయవంతం కావడమే అందుకు నిదర్శనం. తీర్పుపై వేసిన అనేక రివ్యూ పిటీషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిజానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఇచ్చిన ఏ తీర్పుపై కూడ రివ్యూ పిటీషన్లను ఆయన అనుమతించలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ల భవితవ్యంపై నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నది.

నిజానికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయిన తర్వాత వర్గీకరణ డిమాండ్‌కు మునుపటి ప్రాధాన్యత లేకుండే. కాని 2023 నవంబర్ 11న సికింద్రాబాద్ సభలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలో రాజీవ్ గౌబా నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత అన్నీ చకచకా జరిగిపోయినవి. ఇరవై సంవత్సరాల అనంతరం అనూహ్యంగా 2024 ఫిబ్రవరి 6న సుప్రీంకోర్ట్ రివ్యూ పిటిషన్‌ను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేసింది. వర్గీకరణ వాదులకు రెండురోజులు, వ్యతిరేకులకు ఒకరోజు మాత్రమే వాదనలను అనుమతించడంతోనే రాబోయే తీర్పును చాలామంది ముందుగానే ఊహించినారు. ఇది ఖచ్చితంగా రాజకీయ ప్రేరేపిత తీర్పు.



సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు.

565 పేజీల తీర్పును క్షుణ్ణంగా పరిశీలిస్తే, అనేక సంక్లిష్ట అంశాల ప్రస్తావన కూడా తీర్పులో ఉంది. ఎస్సీ ఎస్టీ ఉపకులాలు సజాతీయులు కారంటూ, ఎస్టీ వర్గీకరణను కూడా ఉటంకిస్తూ క్రీమీలేయర్ ప్రస్తావన తెచ్చింది. 'ఎంపరికల్ డాటా' ఆధారంగా అనేది అనేక సంక్లిష్టతలతో కూడుకొన్నది. దీని ప్రకారం ముందుగా జనాభా లెక్కలు తీయాలి. ఇది కేంద్ర ప్రభుత్వం మాత్రమే చేయాలి. 2011 జనాభా లెక్కల అనంతరం రాష్ట్రం విడిపోయింది కాబట్టి ప్రజల వలసలు జరిగిన నేపథ్యంలో పాత లెక్కలు రెండు రాష్ట్రాలకూ ఎంతమాత్రం ప్రామాణికం కాజాలవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన 2014 నుంచి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన సుమారు పదహారు రకాల స్కీముల ఆర్థిక ప్రయోజనాలు పొందిన లబ్ధిదారుల కులం లెక్కల సేకరణ, ప్రకటన జరగాలి. సుప్రీం తీర్పులో జనాభా, నిష్పత్తి పంపిణీ ప్రస్తావన లేదు. అయినా జనాభా శాతం కన్నా ఎక్కువ పొందిన వారిని వెనుక వరుసలోను, తక్కువ ప్రయోజనం పొందిన వారిని ముందు వరుసలోను ఉంచడమే సహజ న్యాయం. డేటాలో తేడాలు ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్ళవచ్చు అని తీర్పులోనే సూచించింది. ఇదంతా 'ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా' జరగాలని కూడా పేర్కొంది.

అసలు అన్నింటికీ మించి ఉమ్మడి రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యోగాల స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఆర్టికల్ 371డి పరిష్కరించడం న్యాయశాఖకు ఒకపెద్ద సవాలే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అమలవుతున్న జిల్లా జోనల్ మల్టీ జోనల్ స్థాయి కేటగిరీ పోస్టుల్లో వర్గీకరణ ఎలా చేస్తారనేది మిలియన్ డాలర్ ప్రశ్న. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుకు వెళ్తే గతంలో మాలలకు 6శాతం, మాదిగలకు 7శాతం కేటాయించిన వాటాలను అలాగే కొనసాగించాలి. ఏ గ్రూపుకు 1శాతం, డి గ్రూపుకు 1శాతం, రెండు గ్రూపులకు కేటాయించిన వాటాలను కలిపి ఏ గ్రూపుగా 2శాతం, ఉషామెహ్రా కమిషన్ రిపోర్ట్ పేజీ 54 ప్రకారం తెలంగాణలో మాదిగలకన్నా వెనుకబడిన మాలలను బీ గ్రూపుగా 6శాతం, దగా పడ్డామంటూనే అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన ఉన్న మాదిగలను సీ గ్రూపుగా 7శాతం నిర్ణయించి కేటాయించడమే శాస్త్రీయ వర్గీకరణ అవుతుంది. పంజాబ్ రాష్ట్రంలో అమలవుతున్న 25శాతం ఎస్సీ రిజర్వేషన్లను ఏ – బీ అనే రెండు గ్రూపులుగా మాత్రమే వర్గీకరించిన అంశాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి.

1965లో బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాల కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగించమని సిఫారసు చేసిందంటూ కృపాకర్ రాసిన రాతలు అబద్ధం. అలాంటి డిమాండ్ అర్థరహితమైనదని 116 పేజీల బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టు పేజి నెంబర్ 56లో తిరస్కరించింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇటువంటి అబద్ధపు రాతలు రాస్తూ, మాదిగ శ్రేణులను రెచ్చగొడుతూ, సమాజాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గం.

సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది. మంత్రివర్గ ఉపసంఘంలో ఇప్పటివరకు అగ్రభాగ ఫలాలు అనుభవించిన కులాల ప్రతినిధులను సభ్యులుగా ఉంచడం ఎవరి మెప్పుకోసమో కాలమే సమాధానం చెప్తుంది. ఏనుగును ఏడుగురు గుడ్డివారు ఏడురకాలుగా వర్ణించినట్లు వర్గీకరణ తీర్పును పలువురు పలు రకాలుగా వక్రీకరిస్తున్నారు. చికిత్స చేసేముందు రోగనిర్ధారణ చేసి చికిత్సకు పూనుకోవాలి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా చికిత్సకు ఏర్పాట్లు చేసి రోగనిర్ధారణ ప్రయత్నాలు చేస్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు.

○ **మామిడి నారాయణ**
రీసెర్చ్ స్కాలర్, యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, జైపూర్

తరం తరం ఒక కొత్త చరిత్ర

మనకు తెలిసినదే వాస్తవమని, ఆ తెలిసిన దానిలో మనకు నచ్చినదే జీవిత సత్యమని నమ్మే భావన ఒక సామాజిక అవగాహనగా దాదాపు మనందరిలోనూ స్థిరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ భావనలు పాక్షికమైనవి. వాస్తవానికి భిన్నమైనవి. ప్రతి అంశానికి విరుద్ధమైన పూర్తి వ్యతిరేకమైన అంశం మరొకటి వుండి తీరుతుంది. ఈ నియమం జీవరాశులకు మాత్రమే కాక, మనం సాధారణంగా నిర్జీవరాశులుగా భావించే రాళ్ళు, రప్పలు, ఖనిజాలు, యంత్రాలకు కూడ వర్తిస్తుంది. ప్రపంచంలో ప్రతీదీ నిరంతరం విరుద్ధ అంశాల పరస్పర సంఘర్షణ (dialectics)లోనే ముందుకు సాగుతుంటుంది.

చరిత్ర గమనాన్ని అవగాహన చేసుకునేందుకు మనకు అనేక పనిముట్లు అందుబాటులో వున్నాయి. అసలు పనిముట్ల ఆధారంగానే మానవ చరిత్రను వివరించే విధానం ఒకటుంది. పాత రాతియుగం, మధ్యరాతి యుగం, కొత్త రాతియుగం, కంచు యుగం, ఇనుము యుగం, పురాతన యుగం, మధ్య యుగం మొదలుకుని ఇప్పటి డిజిటల్, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు పనిముట్ల వినియోగం ఆధారంగా మానవ సంబంధాల్లో వస్తున్న మార్పుల్ని వివరించవచ్చు. రాజులు, చక్రవర్తులు... వాళ్ళ కులమతాలు, అనుసరించిన పరిపాలనా విధానాల ద్వారా కూడ చరిత్రను వివరించే పద్ధతులు కొన్ని ఉన్నాయి.

చరిత్ర అంటే గతం అనుకుంటాం; నిజానికి అది వర్తమానం కూడ కాదు; భవిష్యత్తు!. భవిష్యత్తును నిర్మించుకునే లక్ష్యంతోనే మనిషి గతం నుండి కొన్ని అనుభవాలను, పరికరాలను ఎంచుకుంటాడు. 'రేపు–నిన్న–రేపు' అనేది చరిత్ర రచన క్రమానికి సమీకరణం. ప్రతిలోనూ మంచీ వుంటుంది; చెడూ వుంటుంది. భావి రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం గత చరిత్రను వక్రీకరించే పద్ధతులు ఇప్పుడు చురుగ్గా పనిచేస్తున్నాయి. మధ్యయుగాల్లో ముస్లిం పరిపాలకులు హిందువులను హింసించారని ఒక అభియోగాన్ని విస్తృతంగా ప్రచారంలో పెట్టి, ఇప్పుడు ముస్లింలను రాజకీయార్థిక సాంస్కృతిక రంగాల్లో హింసించి ప్రతీకారం తీసుకుంటామని శపథాలు చేస్తే ఓటర్లలో ఓ మూడవ భాగమైనా ఉత్తేజితులై బలపరుస్తారు. అలా అధికారం సులువుగా దక్కుతుందనేది ఆధునిక రాజకీయార్థిక చరిత్ర రచన ఫార్ములా. మూడవ భాగం అనేది అల్పసంఖ్య. అయితేనేం? మల్టీపార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మూడవ భాగం ఓట్లు మాత్రమే వచ్చినా సరే తిరుగులేని విజయం అని చెప్పుకునే అవకాశం వుంది.

'చరిత్ర తనంతతానుగా పునరావృతం అవుతుంది; మొదటిసారి విషాదంగానూ, రెండోసారి ప్రహసనంగానూ' (History repeats itself, first as a tragedy, second as a farce.) అన్న కార్ల్ మార్క్స్ వ్యాఖ్య చాలా మందికి తెలుసు. ఆయన చరిత్ర గురించి ఇంకా చాలా చాలా అన్నాడు. పునరావృతం అవ్వడం అంటే జరిగిన సంఘటనలే సరిగ్గా అలాగే మళ్ళీమళ్ళీ జరుగుతాయని కాదు; వాటి స్థాయి పెరుగుతుందన్నాడు. సంఘటనలు గతానికి విరుద్ధంగా పునరావృతం అవుతాయనే అర్థమూ అందులో వుంది.

వలస పాలన కాలం ఎలావున్నా ఆధునిక చారిత్రిక ఘటనలకు అనివార్యంగా రాజ్యాంగంతోనూ, కొత్త చట్టాలతోనూ ఒక సంబంధం వుంటుంది. రాజ్యాంగం మీద ఒక్కో చారిత్రక సందర్భంలో ఒక్కో అభిప్రాయం వెలువడుతూ వుంటుంది. ఇవి పరస్పరం వ్యతిరేకంగానూ వుంటాయి. రాజ్యాంగసభను బ్రిటీష్ పాలకులే ఏర్పాటు చేశారు కనుక అది వలస రాజ్యాంగం అనేవారున్నారు. భారత రాజ్యాంగం గొప్ప ప్రజాస్వామికమైనది అనే వారున్నారు. కొందరు ఒక అడుగు ముందుకేసి అది సామ్యవాదాన్ని ఆకాంక్షిస్తుంది అంటుంటారు. దాన్ని పెట్టుబడిదారుల రాజ్యాంగం అనేవారూ వున్నారు. రాజ్యాంగ రచనే ఒక కుట్ర అన్నవారూ వున్నారు. ఎమర్జెన్సీని మించిన క్రూరమైన చట్టాలతో పీడిత ప్రజల్ని నిరంతరం పరమ కిరాతకంగా చంపేయడానికి రాజ్యాంగం దోహద పడుతుందనేవారూ వున్నారు. రాజ్యాంగం గాంధీజీ–అంబేడ్కర్‌ల మార్గంలో అహింసను ప్రోత్సహిస్తుంది అనే వారున్నారు. 'దేవతలు నివసించడానికి ఒక ఆలయాన్ని నిర్మిస్తే దెయ్యాలు దాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పుడు ఆ ఆలయాన్ని నాశనం చేయడం తప్ప మనం ఏమి చేయగలం?' అని ఓ సందర్భంలో అంబేడ్కర్ వాపోయారు. రాజ్యాంగానికి ఎంత చెదపట్టినాసరే ఇప్పటికి అదే మనకు గతి అనేవారూ వున్నారు. సామాజికార్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు సాయుధులై తిరగబడతారని అంబేడ్కర్ ఎలాగూ హెచ్చరించాడు. రాజ్యాంగం అంటే రాజ్యపు అంగం అనేది నిఘంటువు అర్థం. రాజ్యం అంగి; రాజ్యాంగం దాని అంగం.



చరిత్ర అంటే గతం అనుకుంటాం; నిజానికి అది వర్తమానం కూడ కాదు; భవిష్యత్తు!. భవిష్యత్తును నిర్మించుకునే లక్ష్యంతోనే మనిషి గతం నుండి కొన్ని అనుభవాలను, పరికరాలను ఎంచుకుంటాడు. ఇరవయ్యవ శతాబ్దాన్ని నడిపించిన వాదనలు ఇరవై ఒకటవ శతాబ్దంలో పనికిరావు. ఈ ధర్మసూక్ష్మం తెలియడమే చారిత్రక దృష్టి. అది ఇప్పుడు మనకు చాలా అవసరం.

ప్రజల ఆందోళనలు, ఉద్యమాలు, పోరాటాల ఆధారంగా ఇటు సమాజంలో అటు ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పుల్ని వివరించడం చరిత్ర రచనలో ఇంకో పద్ధతి. అయితే ఇందులో కూడ ఒక తిరకాసు వుంది. ప్రజాందోళనలు సాధించిన విజయాలు కూడ ఒక దశ తరువాత తిరుగుముఖం పడతాయి.

ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లలో రాచరిక – భూస్వామ్య వ్యవస్థ మీద పెట్టుబడిదారులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన దేశంలో రాచరిక – భూస్వామ్య వ్యవస్థ మీద కొన్నిచోట్ల కమ్యూనిస్టులు ప్రాణాలొడ్డి పోరాడారు. మన భూస్వాములు యూరోపియన్ భూస్వాములకన్నా బాగా తెలివైనవారు. పెట్టుబడిదారులతో తలపడితే తమ పతనం తప్పదని తెలుసుకుని వాళ్ళే పెట్టుబడిదారులైపోయారు. ఈ పరిణామాన్ని రాజ్యాంగ సభలోనే చూడవచ్చు. సభ్యుల్లో అత్యధికులు రాచరిక – భూస్వామ్య వ్యవస్థ ప్రతినిధులు. అయినప్పటికీ వారు అత్యంత ఆధునిక రాజ్యాంగానికి ఆమోదం తెలిపారు.

1970లలో రాజభరణాలు రద్దు, భూపరిమితి చట్టం, బ్యాంకుల జాతీయకరణ, అటవీ భూములపై ఆదివాసులకు ప్రత్యేక హక్కులు వగైరా ప్రజాస్వామిక చట్టాలు వచ్చాయి. ఇవన్నీ నక్సలైట్ సాయుధ పోరాట విస్తరణకు భయపడి రూపొందించిన చట్టాలే. ఆ మేరకు అవి ప్రజా విజయాలే. అయితే, రాజ్యం తన స్వభావాన్ని భూస్వామ్యం నుండి పెట్టుబడిదారీ దిశగా మార్చుకోవాలనుకోవడం కూడ దీనికి మరో కారణం.

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు భూస్వాములు ముదిరి పెట్టుబడిదారులయ్యారు. పెట్టుబడిదారులు ముదిరి కార్పొరేట్లు అయ్యారు. వాళ్ళు ముదిరి మెగా కార్పొరేట్లయ్యారు. వాళ్ళు తిమింగలాలను మించిపోయారు. బ్లూ వేల్, లివియాథాన్ (Leviathan) వంటివన్నమాట. తెలుగులో తిమింగలగిలం అంటారు. వాళ్ళకిప్పుడు అలనాటి జమిందారులు, జాగీర్దారులు ఆ మాటకొస్తే చక్రవర్తులకు వుండినంత భూమి కావాలి. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మూడు వేల ఎకరాల భూమి కావాలి. స్టీల్ ప్లాంటుకు ముప్పయి వేల ఎకరాలు కావాలి. ఇంకో ప్రాజెక్టుకు మొత్తం నికోబార్ ద్వీపం కావాలి. ఇంకొకరికి మొత్తం మిజోరాం, మణిపూర్ రాష్ట్రాలు కావాలి. వాళ్ళ కోసం అటవీ భూముల పరిరక్షణ చట్టాల్ని పార్లమెంటు సవరిస్తుంది. అలా 1970వ దశాబ్దంలో వచ్చిన ప్రజాస్వామికం అనుకునే చట్టాలన్నీ ఒకదానివెంట మరొకటి రద్దయిపోతాయి. లేదా శవపేటికలో వుండిపోతాయి. 'Undoing the doing' అన్నమాట.

ఇవన్నీ దేశాభివృద్ధి పేరిటే జరుగుతాయి. దేశాభివృద్ధి మంత్రం ముందు మరేదీ నిలవదు. ఇంతకీ దేశాభివృద్ధి అంటే ఏమిటీ? ఎవరి నిర్వచనం వారిది. దీపావళికి ముందు బంగారం ధర పెరుగుతుంటుంది. ఆ ఊపులో అవసరానికి మించి పెరిగిపోతుంది. దీపావళి తరువాత ధర తగ్గుముఖం పడుతుంది. ఆ నైరాశ్యంలో అవసరానికి మించి తగ్గిపోతుంది. మళ్ళీ సంక్రాంతికి ధర పెరుగుతుంది. ఈసారి కూడా అవసరానికి మించి పెరుగుతుంది. మళ్ళీ అవసరానికి మించి తగ్గుతుంది. స్టాక్ మార్కెట్‌లో షేర్లు కూడ అంతే. పెరిగేటప్పుడూ అతిశయమే తగ్గేటప్పుడూ అతిశయమే. రాజకీయాలూ అంతే. అతిశయాలతో నిండిపోతాయి. అప్పుడు 'Undoing the doing' అని వార్యమైపోతుంది.

కొన్నాళ్ళు వామపక్షమే మేలనిపిస్తుంది. అది అతిశయించినపుడు కుడిపక్షం మేలనిపిస్తుంది. అదీ అతిశయిస్తుంది. అప్పుడు మళ్ళీ వామపక్షమే మేలనిపిస్తుంది. ఈ వృత్తం పూర్తి అయ్యేసరికి పాత వామపక్షమూ వుండదు; పాత కుడిపక్షమూ వుండదు. వాటి మధ్య పాత పోరాట రూపమూ వుండదు. అన్నీ మారిపోతాయి. అన్నింటి స్థాయి పెరిగిపోతుంది. నిలువుగా పైకి ఎగబ్రాకే స్ప్రింగు చుట్టలా స్పైరులాకృతిలో సమాజం ముందుకు సాగిపోతుంటుంది.

ప్రజాస్వామ్య వైఫల్యాల నుండే ఫాసిజం పుడుతుంది. ఫాసిజం అతిశయాల నుండే సమానత్వం పుడుతుంది. ఇవ్వాల్టి ఫాసిజం గత శతాబ్దపు ఫాసిజం కాదు. నిన్న దాటిన మైలురాయి మళ్ళీ ఎదురైనట్టు అనిపిస్తుంది. ఆ మైలురాయి నిన్నటిదికాదు. నిన్నలా దాన్ని దాటడమూ కుదరదు. దానికొక కొత్త పద్ధతి కావాలి. దానికి అవసరమైన కొన్ని సూచనలు మాత్రమే మనకు చరిత్ర నుండి దొరకవచ్చు. వర్తమానానికి కావలసింది సరికొత్త సృజనాత్మకత. అదే చరిత్రను నడుపుతుంది.

ప్లస్సుకు మైనస్సు వ్యతిరేకం అయినట్టు, పగటికి రాత్రి వ్యతిరేకం అయినట్టు కొందరు మెజారిటీ మతతత్వానికి విరుగుడు మైనారిటీ మతతత్వం అంటుంటారు. సమాజం మరీ ఎలిమెంటరీ స్కూలు లెఖ్ఖలంత ఈజీ కాదని వీళ్ళకు కొంచెం గట్టిగానే చెప్పాలి.

శాంతిదూత బిరుదాంకితులు కావచ్చు, బౌద్ధం శరణం గచ్ఛామి అనొచ్చు మయన్మార్ శ్రీలంక పాలకుల్ని నియంతలు అనకుండా వుండగలమా? ఇరవయ్యవ శతాబ్దపు ఫాసిస్టులు, నాజీయిస్టులు పాటించిన డ్రెస్ కోడ్‌ను ఇరవై ఒకటో శతాబ్దపు ఫాసిస్టులు పాటించరు. ఇండియా జర్మనీని దాటడానికి ఇంకా ఒక్క అడుగే ఉందట. ఎందులో? ఇంకా ఎంతకాలం జార్జి డిమిత్రోవ్, రజిని పామే దత్ నిర్వచనాల్లో మునిగితేలుతుందాం? కొంచెం కొత్త నీళ్ళ కోసం వెతుకుదాం.

ఓ భగత్‌సింగ్, ఓ అల్లూరి, ఓ చారు మజుందార్ మళ్ళీ పుట్టాలి అని కొందరు కవితలు రాస్తుంటారు. భావుకత వరకు అది సరేగానీ, ఇరవయ్యవ శతాబ్దంలో వాడిన ఆయుధాలు ఇరవై ఒకటవ శతాబ్దంలో పనికిరావు. ఆ ధర్మసూక్ష్మం తెలియడమే చారిత్రక దృష్టి. అది ఇప్పుడు చాలా అవసరం. చరిత్ర అంటే గతంకాదు భవిష్యత్తు. ప్రతి తరం ఒక కొత్త చరిత్ర రాయాల్సిందే.

• **డానీ**
సమాజ విశ్లేషకులు

మహిళలపై ప్రతిచోటా పడగ విప్పుతున్న హింస

'ప్రతి పది నిమిషాలకు ఒక మహిళ మరణించే పరిస్థితి ఉండటం క్షమార్హం కాదు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఏకం కండి' అనే నినాదంతో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి 'మహిళలపై హింస నిర్మూలన' లక్ష్యంగా పదహారు రోజుల కార్యాచరణకు పిలుపునిచ్చింది (నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు).

మహిళలపై అనేక రూపాలలో జరిగే హింసలో అంతగా చర్చకు రానిది– మాతృత్వ హింస. భారతదేశంలో అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. దీనివల్ల గౌరవప్రదమైన మాతృత్వ హక్కు ప్రమాదంలో పడుతున్నది. మద్రాసు ఐఐటీ జరిపిన ఒక పరిశోధన ప్రకారం 2016–2021 మధ్య కాలంలో ప్రైవేట్ ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు 6.5శాతం పెరిగాయి (40.9శాతం నుంచి 47.4 శాతానికి). జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019–21 ప్రకారం అస్సాం, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఇవి 70శాతాన్ని మించిపోయాయి. సిజేరియన్ ప్రాణ రక్షక చికిత్స. కానీ అనవసరపు సిజేరియన్ వల్ల తల్లీబిడ్డలకు పలు సమస్యలు ఎదురవుతాయి: రక్తం కోల్పోవడం, ఇన్‌ఫెక్షన్, కోలుకోవడానికి ఎక్కువ రోజులు పట్టడం, బిడ్డలకు పాలివ్వడంలో ఆలస్యం, తరువాతి గర్భధారణలో సమస్యలు... వంటివి. ప్రతి వైద్యశాలలో గత సంవత్సరం సిజేరియన్ ప్రసవాల శాతాన్ని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధన విధిస్తే ఈ అంశంపై గర్భవతి విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకొనే అవకాశం కలుగుతుంది.

మహిళలు హింసను ఎదుర్కొంటున్న మరో చోటు– సోషల్ మీడియా. కృత్రిమ మేధస్సు (ఏఐ)ను కూడా మహిళలను వేధించేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. ఇందుకు 'డీప్‌ఫేక్' ట్రెండ్ ఒక ఉదాహరణ. నగ్న చిత్రాలతో వేధింపులు (ఇమేజ్ బేస్డ్ అబ్యూజ్) ఎక్కువ కావటం వల్ల మహిళలు, ముఖ్యంగా బాలికలు, ఆత్మహత్య చేసుకుంటున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. భారతదేశంలోని 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ఆర్థిక నేరాలతో పాటు నగ్న చిత్ర వేధింపులపై కూడా మరింత దృష్టి పెట్టాలి.

సోషల్ మీడియాను ఒక సాధనంగా వాడుకుంటూ మహిళలను రాజకీయాల నుంచి దూరం చేయాలనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. అజ్ఞాతంగా కామెంట్ చేయగలిగే అవకాశం ఉండటంతో, ట్రోలర్లు– ధైర్యంగా ఎలాపడితే అలా రాస్తున్నారు. మహిళల గురించి రాసేప్పుడు ఈ ధైర్యం ఇంకా ఎక్కువ ప్రదర్శిస్తున్నారు. తరతరాలుగా ముదిరిపోయిన పురుషాధిక్యతా ధోరణే ఇందుకు కారణం. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే మహిళలు ప్రజాక్షేత్రంలోకి, పరిపాలనా రంగంలోకి రావడానికి వెనుకాడతారు.

పశ్చిమ బెంగాల్ వైద్యురాలి హత్యాచార ఘటన విషయంలోనే గాక, ఇలాంటి అనేక సందర్భాలలో హంతకులు పోర్నోగ్రఫీ వ్యసనపరులని వార్తలొచ్చాయి. కొంతకాలమైనా పోర్నోగ్రఫీపై నిషేధం విధించి ప్రభావాన్ని గమనించాలి. చైనా, యూఏఈ వంటి దేశాలు పోర్నోగ్రఫీపై పకడ్బందీగా నిషేధాన్ని అమలు చేసున్నాయి. ఈ రెండు దేశాలూ బాలలకు, మహిళలకు భద్రమైన దేశాలని పేరున్నది. జీవితంలోని అన్ని అంశాలలో మహిళలకు భద్రతను, గౌరవాన్ని హామీ ఇవ్వడం ద్వారా మాత్రమే భారతదేశం మరింత న్యాయమైన, వికసిత భవిష్యత్తు వైపు పురోగమిస్తుంది.

– **శ్రీనివాస్ మాధవ్**, సమాచార హక్కు పరిశోధకులు

సీమకు చేసిన ద్రోహం చాలదా జగన్?

రాయలసీమ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యంగా కావాల్సింది సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, వ్యవసాయ మోటార్లకు మీటర్ల రద్దు, 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాల సరఫరా, హత్యా రాజకీయాల నివారణ. 1947 నుండి 2024 వరకు అంటే 77 ఏళ్ల పాలనలో 56 ఏళ్లు అధికారంలో ఉన్నది జగన్ తండ్రి పార్టీ, జగన్‌రెడ్డి పార్టీనే. ఈ సుదీర్ఘ కాలంలో రాయలసీమ రాళ్లసీమగానే మిగిలిపోయింది.

1983లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, 90శాతం సబ్సిడీతో డ్రిప్, ఉద్యానవన పంటల ప్రోత్సాహం, రహదారుల అభివృద్ధి, టూరిజం అభివృద్ధి చెప్పుకోదగిన స్థాయిలో జరిగింది. ఫ్యాక్షన్ హత్యల్ని అదుపుచేసి రక్తపాతం తగ్గించారు. సామాజిక న్యాయం టీడీపీ పాలనలోనే అమలైంది. కడప జిల్లా నుండి తొలిగా బీసీ ఎమ్మెల్యే, బలిజలు మంత్రులు అయ్యారు. బీసీలను టీటీడీ ఛైర్మన్లుగా చేసింది టీడీపీనే. విశ్వవిద్యాలయ వీసీలుగా మైనార్టీలను నియమించింది టీడీపీ పాలనలోనే.

కాంగ్రెస్, వైసీపీ పాలనలో దోచుకొని నేతలు బాగుపడ్డారు. టీడీపీ పాలనలో రాయలసీమ ప్రజలు బాగుపడ్డారు. సీమ రైతులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు బాగుపడితే తమ పెత్తనం, దోపిడీ సాగదని భావిస్తున్న వైసీపీ నేతలు శ్రీబాగ్ పేరుతో ప్రాంతీయ చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారు. ఏ జగన్ కుటుంబమైతే సీమకు ద్రోహం చేసిందో వారి సొంత మీడియాలో శ్రీబాగ్ పేరుతో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. వీరి ఉచ్చుల్లో తగులుకుంటే సీమ రైతులు, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎక్కువగా నష్టపోతారు.

వైఎస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రీబాగ్ అంటూ ఎన్టీఆర్ ప్రభుత్వంపై విద్వేషం రెచ్చగొట్టారు. హక్కు జలాలా? మిగులు జలాలా? అంటూ కుతర్కం లేవదీసి తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరునగరిపై ప్రజల్ని రెచ్చగొట్టారు. ఎన్టీఆర్‌పై దాడి ప్రయత్నం చేశారు. అధికారానికి వచ్చిన వైఎస్ పాలనలో జలయజ్ఞాన్ని జగన్ ధనయజ్ఞం చేశారు. ఓబులాపురం గనులు, మంగంపేట బెరైటీస్ గనులు, లైమ్ స్టోన్ గనులు, శేషాచలం ఎర్రచందనం, అసైన్‌మెంట్ భూములు, నదుల్లోని ఇసుక వంటి సీమ సహజ వనరుల్ని కొల్లగొట్టారు. ప్రజల భూముల్ని, ప్రభుత్వ భూముల్ని, చర్చీ, మసీదు, దేవాదాయ భూముల్ని కొల్లగొట్టారు. జగన్ పాలనలో హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో స్థాపించలేదు. పైగా కృష్ణా ట్రిబ్యునల్ కార్యాలయాన్ని విశాఖపట్నంలో పెట్టమని కేంద్రానికి లేఖ రాశారు.

కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కుల్ని కేంద్రానికి ధారాదత్తం చేసింది జగనే. కృష్ణా నదిలో మిగులు జలాలపై హక్కు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు వైఎస్ ప్రభుత్వం లేఖ ఇచ్చి సీమ సాగునీటి ప్రాజెక్టులకు ద్రోహం చేశారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రాయలసీమ లిఫ్ట్ పేరుతో జగన్ తెలుగు రాష్ట్రాల మధ్య జల జగడాన్ని సృష్టించి– కృష్ణా, తుంగభద్ర, గోదావరి నదులపై రాష్ట్ర హక్కుల్ని కేంద్రానికి ధారాదత్తం చేశాడు. ఏ వివాదం లేని, పైగా 798 అడుగుల నుండి నీరు తోడుకొనే ముచ్చుమర్రిని, హంద్రీ నీవా కెనాల్ వెడల్పు పనుల్ని, గాలేరు నగరి రెండో దశ, కుందూ నదిపై రిజర్వాయర్ నిర్మాణం, గుండ్రేవుల, ఆర్‌డీఎస్, వేదవతి, గురురాఘవేంద్ర లాంటి నిర్మాణాలకు మొండి చేయి చూపారు. ఉన్న రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటి నిలువలకు అవసరమైన భూసేకరణకు తగు నిధులు కేటాయించలేదు. దీనివల్ల 120 టీఎంసీల హక్కు జలాలను కూడా రిజర్వాయర్లలో నిలుపుకునే వీలులేకపోతోంది. ఇసుక మాఫియాకు అన్నమయ్య ప్రాజెక్టును బలిపెట్టారు. కొట్టుకుపోయిన పింఛా ప్రాజెక్టును తిరిగి నిర్మించలేదు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మత్తులకు నిధులు ఇవ్వనందున తుంగభద్ర గేటుతోపాటు అనేక గేట్లు కొట్టుకుపోయాయి. 90శాతం సబ్సిడీ సదుపాయం ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌ను నీరుగార్చారు. 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో రూ.7లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు చేయగా– అందులో సాగునీటి ప్రాజెక్టులకు రూ.71వేల కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సీమ ప్రాజెక్టులపై రూ.12,500 కోట్లు ఖర్చు చేసింది. 2019–24 మధ్య జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.12లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు చేయగా– అందులో సాగునీటి ప్రాజెక్టులకు రూ.31వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇందులో సీమ ప్రాజెక్టులపై కేవలం రూ.3వేల కోట్లు ఖర్చు చేసింది. పైగా ఎన్జీటీలో వివాదంలో ఉన్న ఆవులపల్లి లాంటి పనులకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి లాంటి వారికి రూ.600కోట్లకు పైగా దోచిపెట్టారు. సీమ భూములన్నింటికీ నీరు పారి రైతులు, రైతు కూలీలు బాగుపడితే తమ ఫ్యాక్షన్ ముఠాకు కిరాయి హంతకులు దొరకరనే భయంతో సీమ ప్రగతికి తూట్లు పొడవడానికి శ్రీబాగ్ పేరుతో తిరిగి చిచ్చుపెట్టే కుట్రలు చేస్తున్నారు. అధికారం పోతుందని తెలిసి పరిపాలన చివరి రోజుల్లో రాజధానిలో ఉండాల్సిన కొన్ని ఆఫీసుల్ని కర్నూలులో పెట్టారు. కొత్త ప్రభుత్వం వాటిని మార్చుతుందని, ఆ సాకుతో ప్రాంతీయ చిచ్చును రెచ్చగొట్టవచ్చని పథకం పన్నారు. ఇప్పుడు అదే చేస్తున్నారు.

సీమ భూములన్నింటికీ నీరు పారి రైతులు, రైతు కూలీలు బాగుపడితే తమ ఫ్యాక్షన్ ముఠాకు కిరాయి హంతకులు దొరకరనే భయంతో సీమ ప్రగతికి తూట్లు పొడవడానికి శ్రీబాగ్ పేరుతో తిరిగి చిచ్చుపెట్టే కుట్రలు చేస్తున్నారు వైసీపీ నేతలు. వీరి ఉచ్చుల్లో తగులుకుంటే సీమ రైతులు, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎక్కువగా నష్టపోతారు.



రాయలసీమ ప్రజల అభివృద్ధికి కావల్సింది సాగునీటి ప్రాజెక్టులకు భారీ నిధుల కేటాయింపు. భారీ పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించటం కావాలి. విద్యా సంస్థలకు నిధుల కేటాయింపులు పెరగాలి. పంటలకు ధరలు పడిపోకుండా కాపాడాలి. ఇవన్నీ చంద్రబాబు ప్రభుత్వం చేసింది, చేస్తున్నది. తెలుగుదేశం ప్రభుత్వం గత నెలలోనే కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక పార్కులకు రూ.25 కోట్ల పెట్టుబడులతో 75 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు కేంద్రం నుండి అనుమతి పొందింది. రాయలసీమ జిల్లాలకు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ సాధించింది. విద్యుత్ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులతో రూ.7.75 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోంది. ఇందులో అధిక భాగం సీమకే దక్కుతాయి. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జగన్ పథకాన్ని రద్దు చేశారు. కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటును యుద్ధప్రాతిపదికన వరద సమయంలోనే బిగించి రాయలసీమ సాగునీటిని కాపాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో గాలేరు నగరికి రూ.2,888కోట్లు, హంద్రీ నీవాకు రూ.1,867కోట్లు, పులివెందుల కెనాల్‌కు రూ.398కోట్లు, తెలుగుగంగకు రూ.887కోట్లు ఇలా భారీగా నిధులు కేటాయించారు. బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి గోదావరి జలాలు, బానకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు అనుసంధానం ద్వారా సీమలో ప్రతి ఎకరాకు నీరందించే లక్ష్యంతో పోలవరం నదుల అనుసంధానం జరుగుతోంది. తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరునగరి, కేసీ కెనాల్ మోడరైజేషన్, పోతిరెడ్డిపాడు నిర్మాణం, ముచ్చుమర్రి ఎత్తిపోతల చేసింది తెలుగుదేశం. 7,500 మెగావాట్ల సామర్థ్యం గల విండ్ సోలార్ ప్లాంట్‌ను నిర్మించి 13వేల ఉద్యోగాలు కల్పించింది. కియా పరిశ్రమను స్థాపించింది చంద్రన్నే. స్విమ్స్, బర్డ్, టాటా క్యాన్సర్ ఆసుపత్రి, తిరుమలకు తెలుగుగంగ జలాలు, ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధి జరిగింది చంద్రన్న పాలనలోనే. రేణిగుంట విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా చేశారు. ఓర్వకల్లు, కడప విమానాశ్రయాలకు వయోబులిటి ఫండ్ ఇచ్చారు. ద్రవిడ యూనివర్సిటీ, తిరుపతి ఐఐటీ, ఐషర్, ట్రిపుల్ ఐటీ, శ్రీసిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, హిందూపూర్‌లో నేషనల్ అకాడమి ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సస్, ట్రిపుల్ ఐటీ కర్నూల్, ఉర్దూ యూనివర్శిటీ కర్నూల్ ఇవన్నీ చంద్రబాబు స్థాపించినవే. జగన్ ముఠా అధికారంలో ఉంటే దోచుకోవడం, అధికారం పోతే శ్రీబాగ్ అంటూ ప్రాంతీయ చిచ్చు, కుల చిచ్చు రేపటం పనిగా పెట్టుకున్నారు. వైకాపా కుట్రలను, అబద్ధాలను తిప్పికొడదాం, రాయలసీమ ప్రగతి సాధిద్దాం.

■ **గురజాల మాల్యాద్రి**
ఛైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

• బ్యూటిఫుల్


గుడివాడలో కొత్తగా ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ హీరోయిన్లు సంయుక్త మీనన్, నయన్ సారిక బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ తెలుగులో పలు సినిమాలతో పాటు హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, హీరో నిఖిల్‌తో స్వయంభూ అనే సినిమా చేస్తున్నానన్నారు. హీరో శర్వానంద్‌తో మరో సినిమా, ఇంకో రెండు తెలుగు సినిమాలకు సంతకం చేశానని, మరో మూవీ గురించి చర్చలు జరుగుతున్నాయన్నారు.

- గుడివాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)



మళ్లీ గ్రేటర్ ఆశలు

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామాల ఎదురుచూపులు



పంచాయతీ పాలకవర్గాల సమావేశాల్లో చర్చలు
టీడీపీ కూటమి రాకతో ఆ 45 గ్రామాల్లో ఆశలు
ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలంటూ వినతులు

గ్రేటర్ విజయవాడ అంశం మళ్లీ తెరపైకి వస్తోంది. విలీన ప్రతిపాదిత జాబితాలోని పంచాయతీల పాలకవర్గాలు కూడా ఇదే కోరుతున్నాయి. గతంలో వైసీపీ పాలనలో బ్రేక్ పడిన గ్రేటర్ అంశాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సానుకూల సంకేతాలు పంపుతున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

గతంలో టీడీపీ హయాంలో..

గతంలో టీడీపీ ప్రభుత్వం విజయవాడను గ్రేటర్ సిటీగా చేయటానికి విలీన ప్రతిపాదిత జాబితా తయారుచేసింది. దీనిపై పంచాయతీల నుంచి అభిప్రాయ సేకరణ జరపగా, నూటికి 95 శాతం గ్రామాలు సానుకూలంగా తీర్మానాలు చేసి పంపాయి. ఆ తర్వాత ఎన్నికలు రావటంతో అది వెనుకపడింది. గ్రేటర్ విజయవాడ కోసం 45 గ్రామాలను విలీనం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా గ్రామాలపై పన్నుల భారం పెరగకుండా ప్రత్యేక పన్ను విధింపు జోన్‌లోకి తీసుకురావాలని నిర్ణయించింది.

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతిపై ఉన్న కోపాన్ని విజయవాడపై చూపించింది. ఆ ప్రతిపాదనను మూలనపడేసింది. విజయవాడను విస్తరించకుండా ఉండటానికి మున్సిపాలిటీల ఎత్తుగడ వేసింది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాలు విజయవాడ గ్రేటర్ విలీన జాబితాలో ఉన్నాయి. కానీ, ఈ రెంటినీ కలిపి కొండపల్లి మున్సిపాలిటీగా వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో విజయవాడ నగరం ఇబ్రహీంపట్నం వైపు విస్తరించే అవకాశానికి బ్రేక్ పడింది. అలాగే, కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు గ్రామాలను కలుపుతూ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఈ రెండింటి దెబ్బతో విజయవాడతో విలీన అనుసంధాన ప్రతిపాదనను తెంచేసింది.

విలీన ప్రతిపాదిత గ్రామాలివే..

కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు, పెనమలూరు, గంగూరు, గోసాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, దొనె ఆత్కూరు, గూడవల్లి, కేసరపల్లి, వెంకటనరసింహాపురం, అజ్జంపూడి, బుద్దవరం, గన్నవరం, వెదురుపావులూరు, సావారిగూడెం, జక్కులనెక్కలం, రామచంద్రాపురం, పురుషోత్తపట్నం, బీబీగూడెం, చిన్న అవుటపల్లి, అల్లాపురం, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, గొల్లపూడి, తుమ్మలపాలెం, గుంటుపల్లి, రాయనపాడు, మల్కాపురం, గూడూరుపాడు, ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాలు గ్రేటర్ విలీన జాబితాలో ఉన్నాయి. వీటిలో కానూరు, తాడిగడప మినహాయిస్తే మిగిలిన అన్ని గ్రామాలూ విజయవాడలో విలీనానికి సానుకూలంగా తీర్మానాలు చేసి పంపించాయి.

ఈస్ట్, వెస్ట్ బైపాస్‌తో మరింత అభివృద్ధి

విజయవాడ వెస్ట్ బైపాస్‌తో నగరం గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న కేసరపల్లి, ఇంచుమించు గన్నవరం వరకు విస్తరించింది. విజయవాడ తూర్పు బైపాస్ ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. వెస్ట్ బైపాస్ వల్ల తమ ప్రాంతాలు కొంతమేర అభివృద్ధి చెందటాన్ని గుర్తించిన ఆయా పంచాయతీ పాలకవర్గాలు, త్వరలో వచ్చే ఈస్ట్ బైపాస్, ఇన్నర్ రింగ్‌రోడ్లను దృష్టిలో ఉంచుకుని విజయవాడ గ్రేటర్ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి.

టీడీపీ కూటమి రాకతో ఆశలు

ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావటంతో గ్రేటర్ అంశం తెరపైకి వచ్చింది. విలీన జాబితాలో ఉన్న గ్రామాలన్నీ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోనే ఉన్నాయి. వీటి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను సీఆర్‌డీఏ సిద్ధం చూస్తోంది. ప్రధానంగా అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రోడ్డు విజయవాడ చుట్టూ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలు ఉన్నాయి. అలాగే, సీఆర్‌డీఏ ఇన్నర్ రింగ్‌రోడ్డు ఆయా గ్రామాల ముందు నుంచి వెళ్తుంది. ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని తమ గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందాలంటే తక్షణం తమ ప్రాంతాలను విజయవాడలో విలీనం చేస్తే బాగుంటుందని పంచాయతీలు కోరుతున్నాయి.

ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంపు

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలోనే..



రైల్వేస్టేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ మార్గాల్లోని ప్రత్యేక రైళ్ల కాలపరిమితిని పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం ప్రారంభమయ్యే తిరుపతి-అకోలా రైలు (07605)ను డిసెంబరు 6 నుంచి 27 వరకు, ప్రతి ఆదివారం ప్రారంభమయ్యే అకోలా-తిరుపతి రైలు (07606)ను డిసెంబరు 8 నుంచి 29 వరకు, ప్రతి సోమవారం బయల్దేరే పూర్ణా - తిరుపతి రైలు (07609)ను డిసెంబరు 9 నుంచి 30 వరకు, ప్రతి మంగళవారం బయల్దేరే తిరుపతి-పూర్ణా రైలు (07610)ను డిసెంబరు 10 నుంచి 31 వరకు, ప్రతి ఆదివారం బయల్దేరే తిరుపతి-సికింద్రాబాద్ రైలు (07481)ను డిసెంబరు 22 నుంచి 29 వరకు, ప్రతి సోమవారం బయల్దేరే సికింద్రాబాద్ - తిరుపతి రైలు (07482)ను డిసెంబరు 23 నుంచి 30 వరకు, సోమ, బుధ, శుక్రవారాల్లో బయల్దేరే కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలు (07445)ను డిసెంబరు 6 నుంచి 30 వరకు, మంగళ, గురు, శనివారాల్లో బయల్దేరే లింగంపల్లి-కాకినాడ టౌన్ రైలు (07446)ను డిసెంబరు 7 నుంచి 31 వరకు పొడిగించారు.

రేపటి నుంచి రైళ్లవేళల్లో మార్పులు

తిరుపతి-అకోలా ఎక్స్‌ప్రెస్ రైలు (07605) సమయాలను ఈనెల 29 నుంచి మార్చారు. ఈ రైలు పూర్ణాలో ఉదయం 8.10 గంటలకు చేరుకుని, ఉదయం 8.30కు బయల్దేరుతుంది. బస్మత్‌లో 8.59 గంటలకు చేరుకుని 9 గంటలకు బయల్దేరుతుంది. హింగోలికి 9.59 గంటలకు చేరుకుని 10 గంటలకు బయల్దేరుతుంది. వశిమ్‌కు 10.59 గంటలకు చేరుకుని 11 గంటలకు బయల్దేరుతుంది. అకోలాకు మధ్యాహ్నం 1.35 గంటలకు చేరుకుంటుంది. తిరుపతి-అకోలా రైలు (07606) గద్వాల్‌కు రాత్రి 8.54 గంటలకు చేరుకుని, 8.55 గంటలకు బయల్దేరుతుంది.

• మనోనేత్రంతో..



డిసెంబరు 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం పారా ఒలింపియన్ (ఆర్చరీ) ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో దివ్యాంగుల స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ మీట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రారంభించడంతో పాటు కళ్లకు గంతలు కట్టుకుని దివ్యాంగ క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

• మున్సిపల్ మంత్రి నారాయణ

8లో

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ

6లో



కార్మికుల కడుపు కొట్టారు!

- 'అయోధ్య' అపార్టుమెంట్ల నిర్మాణంలో కార్మికులకు రూ.4కోట్ల బకాయిలు
- ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదంటూ పెద్దపెట్టున నినాదాలు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కుటుంబ సభ్యులతో కలిసి కార్మికుల ఆందోళన
- వంశీ అనుచరుడు గుర్రం నాని బెదిరింపులకు దిగుతున్నాడని ఆవేదన

6లో

అజ్ఞాతంలోకి మొండితోక బ్రదర్స్

• చంద్రబాబుపై రాళ్ల దాడి కేసులో బిగుస్తున్న ఉచ్చు

కంచికచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు మెడకు చుట్టుకోవటంతో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లారు. కొద్దిరోజుల నుంచి ఇద్దరు సోదరుల సెల్‌ఫోన్లు మూగబోయాయి. ఫోన్లు స్విచ్చాఫ్ చేసి రహస్యంగా ఉంటున్న ఈ సోదరులు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా, వచ్చేనెల నాల్గో తేదీకి విచారణ వాయిదా వేసినట్టుగా తెలిసింది.

అధికారులు అప్రమత్తం



గుడివాడ రూరల్ మండలం లింగవరం ఆర్‌బీకే ఎదురుగా ధాన్యం బస్తాలు తడవకుండా పట్టాలు కప్పిన రైతులు

వణుకు పుట్టిస్తున్న తుఫాను కదలికలు

- వరికోతలు వేగవంతం చేసిన అన్నదాతలు
- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యటన
- రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం
- మిల్లర్లతో మాట్లాడి పనులు వేగిరం
- ఇతర జిల్లాలకూ ధాన్యం తరలింపు

30వ తేదీ వరకూ వర్షాలు : వాతావరణ శాఖ



చినఓగిరాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్, కృష్ణా కలెక్టర్ బాలాజీ

తుఫాను కదలికలు అటు అన్నదాతలతో పాటు ఇటు అధికారులను సైతం వణికిస్తున్నాయి. బుధవారం జిల్లాలో వర్షం కురవనప్పటికీ ఈదురుగాలులతో పాటు వాతావరణం చల్లగా ఉండటంతో వరికోతల ప్రక్రియ వేగవంతమైంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పౌరసరఫరాల కమిషనర్ సహా కృష్ణా కలెక్టర్, ఇతర జిల్లా యంత్రాంగం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గం చూపిన అధికారులు ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా రైతులను తుఫాను భయం వెంటాడుతూనే ఉంది. తుఫాను ప్రభావంతో ఈనెల 30 వరకు కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులతో పాటు అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. యంత్రాల ద్వారా వరికోతలు పూర్తిచేసిన ప్రాంతాల నుంచి ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సమకూరుస్తున్నారు. దగ్గరలోని, ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యాన్ని తరలించే పని మొదలుపెట్టారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ తదితరులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. దావులూరు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపి ధాన్యం రవాణాకు ఈ వాహనాలను ఉపయోగించేలా ఆర్డీవో సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కంకిపాడు మండలం కోలవెన్ను తదితర మిగతా 6లో..

మూడురోజులు వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావానికి కోస్తాతీరం వెంబడి గురు, శుక్ర, శనివారాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాను ప్రభావంతో గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని తెలిపింది. కాగా, బుధవారం జిల్లాలో వర్షం కురవకున్నా.. ఈదురుగాలులు వీయడంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. దీంతో యంత్రాల ద్వారానే వరి కోతలు పూర్తిచేస్తున్నారు.

కళ్లాల్లోనే.. 1262 ధాన్యం రాశులు!

6లో

త్రిలింగ దర్శిని, యాగంటి, మహానందికి బస్సులు

8లో

దుర్గమ్మకు రూ.3.80 కోట్ల ఆదాయం

• యనమలకుదురు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కుమార్తెను బాలాజీనగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాడు. ఏడాదికి స్కూల్ ఫీజుగా రూ.13 వేలు చెల్లించాలి. ఇప్పటికే ఆయన రూ.10 వేలు చెల్లించాడు. మరో రూ.3 వేలు చెల్లించాలి. మిగిలిన ఫీజు చెల్లించాలంటూ కొద్దిరోజులుగా చిన్నారితో తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం కబురు పంపుతోంది. నాలుగు రోజుల క్రితం ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామని తెగేసి చెప్పారు. డిసెంబరులో చెల్లిస్తానని తండ్రి చెప్పినప్పటికీ విద్యార్థినిని మాత్రం పరీక్ష రాయనివ్వలేదు. తరగతిలో 18 మంది ఉంటే.. వారిలో 8 మందిని ఇలాగే చేశారు. ఫీజు చెల్లించాక పరీక్ష నిర్వహిస్తామని ఉపాధ్యాయులే చెప్పడం గమనార్హం.



ఫీజుల కక్ష.. పరీక్షల శిక్ష..

ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నపిల్లలపై ఫీజుల ఒత్తిడి

ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులను కూడా వదలకుండా..

మొత్తం ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయించేది..!
లేదంటే అనుమతి నిరాకరణ
నగరంలోని చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించకపోవడం, సెమిస్టర్ పరీక్షలు రాయనివ్వకపోవడం వంటివి ఇప్పటి వరకు కార్పొరేట్ కళాశాలల్లోనే చూశాం. తాజాగా ఈ తంతు ప్రైవేట్ పాఠశాలలకు, ముఖ్యంగా ఎల్‌కేజీ, యూకేజీ చదివే విద్యార్థులకు సైతం పాకింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను పదేపదే కౌన్సెలింగ్ చేస్తున్న పలు విద్యాసంస్థలు.. తమది వ్యాపారకోణం కాదని, విద్యాభివృద్ధి లక్ష్యమని బిల్డప్ ఇస్తున్నారు. తీరా విద్యార్థులను చేర్చాక ఫీజుల కోసం పేచీ మొదలుపెడుతున్నారు. ఫీజు చెల్లించడం కాస్త ఆలస్యమైతే చిన్నపిల్లల విషయంలో సైతం అసమానతలను చూపిస్తున్నారు. ఇందుకోసం పరీక్షలను ఉపయోగించుకుంటున్నారు. యాజమాన్యం నిర్దేశించుకున్న ఫీజులను చెల్లించిన వారి విషయంలో ఒకలా, చెల్లించని వారి విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారు.

అడ్మిషన్‌లో ఒకలా.. తర్వాత మరోలా..

ఏటా జూన్‌లో విద్యా సంవత్సరం మొదలవుతుంది. కొత్త అడ్మిషన్ల కోసం మే మొదటి వారం నుంచే ప్రచారాన్ని హోరెత్తిస్తారు. ఉపాధ్యాయులను ఇంటింటికీ తిప్పి కరపత్రాలు పంపిణీ చేయిస్తారు. ప్రస్తుతం నడుస్తున్న విద్యావిధానానికి భిన్నంగా తమ స్కూల్లో బోధన ఉంటుందని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తారు. కొత్తకొత్త కాన్సెప్ట్‌లతో కొత్త విద్యాలయాలకు మిగతా 6లో..



వల్లూరుపాలెం నది ఒడ్డున 1262 రకం ధాన్యం రాశులు

కల్లాల్లోనే.. 1262 ధాన్యం రాశులు!

- ఈ రకం కొనలేమంటున్న వ్యాపారులు.. పట్టని అధికారులు
- వల్లూరుపాలెం నది ఒడ్డున 400 ఎకరాల ధాన్యం నిల్వలు
- గతేడాది అధిక డిమాండ్‌తో మూడు గ్రామాల్లో విరివిగా సాగు
- తుపాను హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు

తోట్లవల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, రొయ్యూరు గ్రామాల రైతులు 1262 రకం ధాన్యం అమ్ముడుపోక దిక్కులు చూస్తున్నారు. గతేడాది ఈ రకం ధాన్యాన్ని ఎగబడి కొనటంతో మంచి డిమాండ్ ఉంటుందన్న ఉద్దేశంతో 90శాతం రైతులు ఈ రకాన్ని ఎంచుకుని పండించారు. యంత్రాలతో ధాన్యాన్ని కోతకోసి ట్రాక్టర్లపై తెచ్చి వల్లూరుపాలెం కృష్ణానది ఒడ్డున విశాలమైన స్థలంలో వందల మంది రైతులు కళ్లాలు చేసి పరదాలపై ఆరబెట్టారు. సుమారు 15 రోజులుగా ధాన్యాన్ని ఎండబెట్టి తేమశాతాన్ని కూడా తీయించారు. 16 నుండి 17 శాతం తేమ ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదని ఆర్ఎస్‌కె సిబ్బంది చెపుతున్నారని రైతులు చెపుతున్నారు. గతేడాది 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు బియ్యం ఆడించి బీపీటీ బియ్యంలో కలిపి మంచి లాభాలు గడించారని, ఈసారి వెనుకడుగు వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 శాతం తేమతో ఉన్నప్పటికీ రూ.1,350కి ఇస్తారా అని అడుగుతున్నారని, ఇదెక్కడి న్యాయమని వాపోతున్నారు. సుమారు 400 ఎకరాల 1262 రకం ధాన్యం రాశులుగా ఉందని, మంగళవారం వరకు ఒక్క అధికారి కూడా రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపాను హెచ్చరికలు నిద్ర లేకుండా చేస్తున్నాయని, రేయింబవళ్లు ధాన్యాన్ని కాపాడుకుంటు గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు. ఎలాంటి ధాన్యాన్నయినా మద్దతు ధరకు కొంటామని ప్రభుత్వం చెబుతుంటే అందుకు తగ్గట్టుగా అధికారులు పనిచేయటం లేదని ఆరోపిస్తున్నారు. గరికపర్రులో ధాన్యం లోడుతో ఆర్ఎస్‌కె వద్దకు వచ్చిన ట్రాక్టర్లను మిల్లులకు పంపటంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, రోజంతా వాహనాలతో గడపాల్సి రావటంతో మరో లోడు కోసం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉండటం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.



గరికపర్రు ఆర్ఎస్‌కె వద్ద కదలని ధాన్యం ట్రాక్టర్లు

1262 రకం కొనటం లేదు!

- కొండవీటి నాగేశ్వరరావు, రైతు, రొయ్యూరు



రెండు ఎకరాల స్వంత పొలంలో 1262 రకం ధాన్యాన్ని పండించాను. యంత్రంతో కోసి 8 రోజులుగా ఎండబెట్టాను. 16 తేమ శాతం వచ్చింది. అయినా అధికారులు మిల్లుకి పంపటం లేదు. నాకంటే 10 రోజుల ముందు నుంచి ఉన్న రైతులదీ అదే పరిస్థితి. వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి.

ఎలాంటి ధాన్యం అయినా కొంటాం

- జి.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి

1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయమని ఎవరూ అనలేదు. రైతు పండించిన ఎలాంటి ధాన్యాన్ని అయినా కొనుగోలు చేస్తాం. వల్లూరుపాలెంలో ఈ సమస్య ఎందుకు వచ్చిందో పరిశీలించి ధాన్యాన్ని అమ్మిస్తాం.



చినఓగిరాలలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వీరపాండియన్, బాలాజీ

రైతులను నష్టపోనివ్వం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండియన్

చినఓగిరాల(ఉయ్యూరు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండియన్ అన్నారు. చినఓగిరాలలో ధాన్యం సేకరణ కేంద్రం(రైతుసేవా కేంద్రం)ను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో హేలా షారోన్‌తో కలిసి బుధవారం సందర్శించారు. రోడ్డుపక్కన, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం పరిశీలించి తరలింపులో రైతుల ఇబ్బందులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కోతకోసిన పంట వివరాలు, తేమశాతం వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మిల్లులకు తరలించేందుకు ఇబ్బందులను రైతులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులతో ఒకేసారి ఎక్కువగా ధాన్యం కోతకోయడం వల్ల కొంత ఇబ్బంది కలుతోందని, జిల్లాలో మిల్లుల వద్ద గోదాములు చాలకపోవడంతో ఎన్టీఆర్, ఏలూరు, బాపట్ల, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తరలించేలా కలెక్టర్, జేసీలకు ఆదేశాలిచ్చామన్నారు. ధాన్యం తరలింపునకు రవాణా శాఖ నుంచి మరిన్ని వాహనాలు సమకూర్చుతున్నామన్నారు. వాతావరణ హెచ్చరికల కారణంగా అవకాశం ఉన్నవారు పంటకోత వాయిదా వేయాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. ధాన్యం తరలించేందుకు వాహనాలకు జీపీఎస్ అవసరం లేకుండా చర్యలు తీసుకున్నామని, జీపీఎస్ లేని వాహనాలు రైతు సహాయకేంద్రంలో నమోదు చేయించుకుని ధాన్యం తరలించవచ్చన్నారు.

ఆర్టీసీ 'ఔట్‌సోర్సింగ్' వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాజీ

బస్‌స్టేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేముల బాజీ ఎన్నికైనట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగుడు ముత్యాలరావు తెలిపారు. ఆర్టీసీలో సుమారు 8వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను ఏపీ జేఏసీ అమరావతికి అనుబంధంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఐఎంఏ ఉత్తమ కార్యదర్శిగా నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జాతీయ స్థాయిలో ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరులోని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఎంపికయ్యారు. 2023-24లో గుంటూరు ఐఎంఏ శాఖ పలు విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చడంతో అప్పట్లో ఈ శాఖ కార్యదర్శిగా వ్యవహరించిన డాక్టర్ నరేంద్రరెడ్డిని ఈ అవార్డు వరించింది. ఈ మేరకు ఢిల్లీలోని ఐఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం ఆయనకు సమాచారం అందింది. డిసెంబరు 27న హైదరాబాద్‌లో జరగనున్న ఐఎంఏ జాతీయ సమావేశాల్లో డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డును అందజేయనున్నారు.

టీడీపీకి కౌన్సిలర్ రామలక్ష్మి గుడ్‌బై?

- జనసేనలో చేరేందుకు సన్నాహాలు
- ఉదయభానుతో భేటీ.. బుజ్జగించిన నెట్టెం



జగ్గయ్యపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పదో వార్డు టీడీపీ కౌన్సిలర్, జిల్లా బీసీ మహిళా విభాగం మాజీ అధ్యక్షు రాలు కన్నెబోయిన రామలక్ష్మి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరనున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా టీడీపీ కార్యక్రమాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ పదవి ఇస్తామని అధినాయకత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవటంతో పాటు, వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రను తెలుగుదేశం పార్టీలో చేర్చుకున్నాక పార్టీ తనను మరింత దూరం పెట్టిందన్న భావనలో ఆమె ఉన్నారు. త్వరలో జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. జనసేన నేత ఒకరు మధ్యవర్తిత్వం నడిపి బుధవారం ఆమెను జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను నివాసానికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. ఈ పరిణామం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం రామలక్ష్మిని, ఆమె తండ్రి పార్టీ సీనియర్ నేత తూమాటి వెంకన్నను పిలిపించి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని నచ్చచెప్పినట్టు సమాచారం.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

- ఇంజనీరింగ్ కాలేజీ సంఘం విజ్ఞప్తి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫీజుల బకాయిలు విడుదల చేసి కాలేజీల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రూ.వేల కోట్ల ఫీజుల బకాయిలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా కాలేజీలకు ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయని తెలిపింది. 2023-24 విద్యా సంవత్సరం వరకు ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. నూతన ఐటీ విధానం ద్వారా 20లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పనలో సహకరిస్తామని సంఘం నేతలు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజుల విడుదలకు షెడ్యూలు ప్రకటించడంపై త్వరలో మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూధనరావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీచర్ల సెలవులపై పరిమితి సరికాదు: టీఎన్‌యూఎస్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సెలవులపై పరిమితులు విధించడం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ అన్నారు. ఒక పాఠశాల/మండలంలోని టీచర్లలో రోజుకు 7 నుంచి 10శాతం మంది మాత్రమే సెలవులు వినియోగించుకోవాలనే నిబంధన విధించారని తెలిపారు. దీనివల్ల టీచర్లు అత్యవసర, అనారోగ్య కారణాలతో వారి సెలవులు వినియోగించుకోవడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు విధించవద్దని కోరారు.

ఫార్మసీ అడ్మిషన్లకు షెడ్యూలు జారీ

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బి.ఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ బుధవారం షెడ్యూలు జారీ చేసింది. ఎంపీసీ స్ట్రీమ్ విద్యార్థులు 29 నుంచి 30 వరకు, బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులు 30 నుంచి డిసెంబరు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎంపీసీ విద్యార్థులకు 4న, బైపీసీ విద్యార్థులకు 11 సీట్ల కేటాయింపు చేస్తామని పేర్కొంది. కాగా సుమారు 30 ప్రైవేటు కాలేజీలకు అనుమతులు జారీ కాకపోవడంతో అవి ఈ కౌన్సెలింగ్‌లో జాబితాలోకి రావు. ఈ ఏడాది కాలేజీలకు అనుమతుల జారీలో ఉన్నత విద్యాశాఖ జాప్యం చేసింది. ఫలితంగా అడ్మిషన్లు ఆలస్యమయ్యాయి. అయితే ఇప్పటికీ మొత్తం కాలేజీలు కౌన్సెలింగ్‌లోకి రాకపోవడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపసభాపతి పీఎస్‌గా నరేష్‌కుమార్

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు వ్యక్తిగత కార్యదర్శిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎక్సైజ్‌లోని ఎస్టీఎఫ్ విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను రిలీవ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన రెండేళ్ల పాటు పీఎస్‌గా కొనసాగుతారని తెలిపింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

- పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన జీవనానికి స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యావరణానికి మేలుచేసే ప్రకృతి వ్యవసాయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం, ఎరువులు, విత్తనాల నాణ్యత పరీక్షలు, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ, పంట రుణాలు, పంటల బీమా తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంలో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అధిక ఆదాయం లభించే ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా రైతులను ప్రోత్సహించాలన్నారు. పత్తి వంటి పంటల్లో అంతర పంటలతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఇండ్ జీఏపీ సర్టిఫికేషన్‌పైనా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు పంటల సాగులో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేలా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రతి మంగళ, బుధవారాల్లో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆర్ఎస్‌కే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విసన్నపేట, విజయవాడ రూరల్ మండలాల్లో మామిడి ప్రధాన ఉద్యాన పంటగా వుందని అధికారులు వివరించారు. అదేవిధంగా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, గంపలగూడెం మండలాల్లో మిర్చి ప్రధాన పంటగా వున్నట్లు తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈఓ)-ఆయిల్‌పామ్ కింద జిల్లాలో పంట వైవిధ్యంలో భాగంగా 2 వేలహెక్టార్ల మేర ఆయిల్‌పామ్‌ను విస్తరించాల్సి ఉన్నందున లక్ష్యాన్ని చేరుకొనేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీఎంఐపీ పీడీ పీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

కృష్ణలంక : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.సాంబయ్య, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో కలిసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయాలు సిబ్బందితో వీడియా కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ సర్వేలో మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు, విధి విధానాలపై పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహనా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే పరిశ్రమల శాఖ అధికారులు, కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఎంఎస్ఎంఈ సర్వేలో పాల్గొనేందుకు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు కొట్టారు!

- 'అయోధ్య' అపార్టుమెంట్ల నిర్మాణంలో కార్మికులకు రూ.4కోట్ల బకాయిలు!
- ఫిర్యాదులు చేసినా జరగని న్యాయం
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కుటుంబ సభ్యులతో కలిసి కార్మికుల ఆందోళన
- వంశీ అనుచరుడు గుర్రం నాని బెదిరింపులకు దిగుతున్నాడని ఆవేదన



న్యాయం జరగకుంటే ఆత్మహత్య శరణ్యమంటూ పురుగు మందు డబ్బాలు చూపుతున్న బాధితులు

గన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం-పురుషోత్తమపట్నం మార్గంలో నిర్మించిన అయోధ్య అపార్ట్‌మెంట్ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. తమతో పనిచేయించుకుని డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నారంటూ కన్నీరుమున్నీరయ్యారు. రూ.4కోట్ల బకాయిలను గుర్రం నాని చెల్లించాల్సి ఉండగా వాటిని చెల్లికుండా అడిగిన వారిపై బెదిరింపులకు దిగుతున్నాడని.. దిక్కున్న చోట చెప్పుకోండి.. ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదంటున్నారని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుంచి 2022 వరకూ గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ నిర్మాణ(తాపీ) పనులు చేసిన తమను అగౌరవపరచటమే కాకుండా తప్పుడు లెక్కలు చూపుతూ తామే ఎదురు ఇవ్వాలని చెప్పటం బాధాకరమన్నారు. బుధవారం అయోధ్య అపార్టుమెంట్స్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. గన్నవరం-పురుషోత్తపట్నం రోడ్డుపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. బకాయిలు అడిగితే బిల్డర్ గుర్రం అంజయ్య(నాని) ఇబ్బందులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మేస్త్రి రామ్మోహన్‌రావు అన్నారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. నాలుగేళ్ల పాటు పనులు చేయించుకుని డబ్బులు ఏమీ రావంటూ బుకాయిస్తున్నారని చెప్పారు. 14 మంది తాపీ మేస్త్రులు 1200 మంది కార్మికులు ప్రతిరోజు పని చేసేవారని తెలిపారు. వారికి సుమారు రూ.4కోట్ల వరకూ ఇవ్వాలని చెప్పారు. తమ కింద పనిచేసే కార్మికులకు కొంతమేర తమకు ఉన్న దాంట్లో అమ్మి సర్దుబాట్లు చేశామన్నారు. నేడు భార్యా బిడ్డలతో రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆవేదన చెందారు. అపార్టుమెంట్‌లో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణ ప్రసాద్, సైట్ ఇంజనీర్ సాయిసుందర్‌లు తప్పుడు లెక్కలు చూపి ఒక్క రూపాయ కూడా రాదని చెబుతున్నారన్నారు. తమ లెక్కల ప్రకారం రూ.కోట్లల్లో రావాల్సి ఉండగా పైసా కూడా రాదని చెప్పటం దుర్మార్గమన్నారు. కార్మికుల కడుపులు కొట్టారని చెప్పారు. దీనిపై అధికారులను కలవటంతో పాటు స్పందనలో ఫిర్యాదులు చేసినా న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ తమకు న్యాయం చేయాలని కోరారు.

వల్లభనేని వంశీమోహన్ అనుచరుల్లో ఒకరు గుర్రం అంజయ్య(నాని). వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా ఎక్కడికక్కడ వెంచర్లు వేశారు. అక్రమాల సొమ్ముతో అంతస్థుల కొద్దీ అపార్టుమెంట్లు నిర్మించారు. ఇందులో పనిచేసిన కార్మికుల కష్టార్జితాన్ని స్వాహా చేశారు. పూర్తయిన ఫ్లాట్లను విక్రయించి కాసులు వెనుకేసుకున్నారు. చివరికి బకాయిలు చెల్లించాలన్న కార్మికులపై ఎదురుదాడికి దిగడంతో ఆ కుటుంబాలు ఆందోళన బాట పట్టాయి.

మొత్తం బాకాయిలు

మేస్త్రిలు రామ్మోహనరావుకు రూ.1.56 కోట్లు, బాబుకు రూ.56లక్షలు,సతీష్‌కురూ.99లక్షలు, దాస్‌కు రూ.1.40కోట్లు, తేజకు రూ.14లక్షలు, వెంకన్నకు రూ.84లక్షలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సతీష్, బాబు, తేజ, వెంకన్న, హసీనా, ప్రసన్న, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తాం

- హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ

శాంతియుతంగా రాస్తారోకో చేస్తున్న కార్మికుల వద్దకు హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ వచ్చి హల్‌చల్ చేశారు. మీరంతా స్టేషన్‌కు వస్తే సమస్య పరిష్కరిస్తాం. మీరెందుకు రోడ్డు మీద కూర్చున్నారు. అందరి మీద కేసులు పెడతామంటూ మహిళ కార్మికులను భయాందోళనకు గురిచేశారు. గతంలో కేసులు పెట్టామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నా కంప్లెయింట్ కాపీ చూపాలంటూ హడావిడి చేశారు.



స్టేషన్‌కు వస్తే న్యాయం చేస్తామంటూ హెచ్చరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ జానీ

ఫీజుల కక్ష.. పరీక్షల శిక్ష..

(5వ పేజీ తరువాయి)

తలుపులు తెరుస్తున్నారు. బాల్యం నుంచే పిల్లలను ఆంగ్లంలో ఆరితేరిన వారిలా తయారు చేయాలన్న తల్లిదండ్రుల ఆత్రుతను యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. నగరంలో సుమారు 150 ప్రైవేట్ పాఠశాలలుండగా, చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు

విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజును చెల్లించాలని కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులకు షరతులు విధిస్తున్నాయి. కొన్ని ప్రతినెలా ఫీజును చెల్లించాలనే నిబంధన పెడుతున్నాయి. నెలనెలా ఫీజులు చెల్లించే విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. ఫీజును విడతలవారీగా చెల్లించే విద్యార్థులకు యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నాయి. విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజును చెల్లించాలని అడ్మిషన్ సమయంలో చెప్పిన వారు ఆ తర్వాత కనిపించడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రంగప్రవేశంచేసి నవంబరు నాటికి మొత్తం ఫీజును చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో కొద్దిరోజుల క్రితం పరీక్షలు జరిగాయి. మొత్తం ఫీజు చెల్లించిన విద్యార్థులతో పరీక్షలు రాయించిన యాజమాన్యాలు.. చెల్లించని వారితో పరీక్షలు రాయనివ్వలేదు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారుల వివరణ కోరగా, తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులు అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

గ్రామాలకు వాహనాలను పంపి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఆన్‌లైన్ చేయక అవస్థలు

గూడూరు మండలం రాయవరం అడ్డరోడ్డు వద్ద ధాన్యం ఆరబెడుతున్న, సంచుల్లోకి ధాన్యం ఎత్తుతున్న రైతులతో కలెక్టర్ బాలాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా మాగంటి బాపూజీ, రంగబాబు, నాగమల్లేశ్వరరావు అనే రైతులు మాట్లాడుతూ ఈ నెల 25న వరి కోత కోసి, కొంతమేర ధాన్యాన్ని దగ్గరలోని మిల్లులకు పంపామని, ఇంకా ఈ ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేయలేదని తెలిపారు. స్పందించిన కలెక్టర్ ధాన్యం మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులతో మాట్లాడారు. సంబంధిత రైతుల ధాన్యం వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. తరకటూరుపాలెంలోని గోమతి రైస్‌మిల్లును కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులు యంత్రాలతో వరికోతలు పూర్తిచేయడంతో, పరిమితికి మించి మిల్లులకు ధాన్యం వస్తోందని, మిల్లు సామర్థ్యానికి మించి ధాన్యం దిగుమతి చేసుకోలేకపోతున్నామని మిల్లు యజమాని తెలిపారు. తమ మిల్లు ద్వారా బ్యాంకు గ్యారెంటీగా రూ.2.50 కోట్లు చూపామని, ఇప్పటివరకు రూ.80 లక్షల విలువైన ధాన్యం కొన్నామన్నారు. మరపట్టిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకు పంపేందుకు సర్వర్ సమస్య తలెత్తిందని, పరిష్కారం కాగానే బియ్యాన్ని తరలిస్తామని మిల్లు యజమాని తెలిపారు. అనంతరం కంకిపాడు మండలం పొద్దుటూరు టోల్‌గేట్ సమీపంలోని బాలాజీ రైస్‌మిల్లును కలెక్టర్ పరిశీలించి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ఉయ్యూరు మండలం చినఓగిరాల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పౌరసరఫరాలశాఖ కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వీరపాండియన్ తెలిపారు. రైతుసేవా కేంద్రం వద్ద ధాన్యంలో నమోదైన తేమశాతానికి, మిల్లుల వద్ద నమోదయ్యే తేమశాతానికి వ్యత్యాసం ఉంటోందని, దీంతో మద్దతు ధరలో మిల్లర్లు కోత పెడుతున్నారని రైతులు అధికారులకు తెలిపారు. రైతుసేవా కేంద్రాల వద్ద నమోదుచేసిన తేమశాతమే పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షం హెచ్చరికల నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా రైతులు వరికోతలు పూర్తిచేయాలని వీరపాండియన్ సూచించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయాలి: కేఏ పాల్

ధర్నాచౌక్, నవంబరు 27: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం తాను హైకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ డిసెంబర్ 11కు వాయిదా వేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి కలిగే లాభాలపై కోర్టులో వాదించానన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరాలన్నారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేనప్పుడు ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు పోరాడాలని సూచించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం హైకోర్టులో న్యాయపరంగా పోరాడుతున్నానని పాల్ తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనేక రోజుల నుంచి నిరసన దీక్షలు చేస్తున్నట్టు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

జాతీయస్థాయి జూడోకు ప్రవల్లిక ఎంపిక



విజయవాడకల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 68వ ఏపీఎస్‌జీఎఫ్ ఇంటర్ జిల్లాల జూడో చాంపియన్ షిప్‌లో అండర్-19లో సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని జి.ప్రవల్లిక గోల్డ్‌మెడల్ గెలుచుకొని నేషనల్స్‌కు సెలక్ట్ అయింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రవల్లికను అభినందించారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు

9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

కుట్టుమిషన్లు ఉన్నా.. ప్రారంభం కాని శిక్షణ

● అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో బూజుపట్టి మూలకు చేరిన కుట్టుమిషన్లు

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బలవంతంగా ఖాళీ చేసి నెలలు గడుస్తున్నా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయకపోగా తెచ్చిన కుట్టుమిషన్లు పాడవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఎన్నికల ముందు రాణిగారితోట 18వ డివిజన్ సిమెంట్ గోడౌన్‌లో స్థానిక మహిళల కోసం కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి స్థానిక కార్పొరేటర్ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఇందుకోసం ఎన్నో ఏళ్ల నుంచి సిమెంట్ గోడౌన్‌లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్న పళానా ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు ఈ విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నా వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు చేసేది ఏమీలేక పోవడంతో తప్పని పరిస్థితుల్లో ఖాళీ చేశారు. దీంతో కుట్టు మిషన్ కేంద్రానికి రూమ్‌లు లభించాయి. రూమ్‌లు ఖాళీ అయినా కుట్టు మిషన్ కేంద్ర మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు తీసుకువచ్చిన కుట్టు మిషన్లు బూజు పట్టి పాడయ్యాయి. ఖాళీ చేయించిన గదిలోనే ఈ మిషన్లు ఒక మూలన పడేశారు. దీనిపై స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వ నిధులతో ఈ మిషన్లు కేటాయిస్తే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అవి మూలకు చేరాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆగిపోయిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, కుట్టు మిషన్లను పక్కన పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



బూజు పట్టిన స్థితిలో కుట్టుమిషన్లు



ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతాం

నెలల తరబడి సిమెంట్ గోడౌన్‌లో నిరుపయోగంగా ఉన్న కుట్టుమిషన్ల విషయాన్ని తమ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళతాం. ఆయన చేతుల మీదుగా కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించే విధంగా చేస్తాం. ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లను నిరుపయోగంగా ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– కొక్కిరి తిరుపతయ్య, టీడీపీ తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు

అమెరికాలో తెలుగోళ్ల పరువు తీసిన జగన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమెరికాలో ఆంధ్రప్రదేశ్ పరువుతీశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. తూర్పు పరిధిలోని మూడో డివిజన్ శ్రీ రామచంద్ర నగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలోని కెనరా బ్యాంక్ ఎదురుగా రోడ్డు పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రూ.1750 వేల కోట్లు కక్కుర్తి పడితే రాష్ట్రంలోని ప్రజలకు రూ.2 లక్షల కోట్ల భారం పడిందన్నారు. ఈ భారం ప్రజలే తీర్చాలన్నారు. అగ్రరాజ్యమైన అమెరికాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముఖ్యమంత్రి లంచం తీసుకున్నాడంటే అది తెలుగు వారికి చాలా అవమానమైన విషయం అని అన్నారు. తూర్పు పరిధిలోని ప్రధాన సమస్యలను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, తాడి బాబురావు, పోతినీడు సీతారామయ్య, కొండయ్య, గొల్లపల్లి నారాయణరావు, దాడిసుబ్బారావు, గుత్తికొండ మోహన్ రావు, జాస్తి శ్రీనివాసరావు, యలమంచిలి పండు, గద్దె రమేష్, జనసేన నేతలు బండి కోమలి, తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వ్యక్తిగత బ్యాంకు, ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచండి

ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ సీఐ రవికుమార్, సైబర్ క్రైం ఎస్సై మూర్తి తదితరులు

లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత బ్యాకు, ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచాలని ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సైబర్ మోసాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆయన బుధవారం బెంజిసర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి మాట్లాడుతూ నేరాలపై ప్రజలను చైతన్యపరచడానికి కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం బెంజి సర్కిల్ వద్ద ఈ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, రావి శరత్, పొట్లూరి చంద్రశేఖర్ ఇతర అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్

రక్తదానం చేయండి

చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్

లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ఒక వ్యక్తి ప్రాణాన్ని నిలబెడుతుందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానంపై సరైన అవగాహన లేక అనేక మంది వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ బి.వి.ఎస్.కుమార్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సీహెచ్.రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఆర్.మాధవి పాల్గొన్నారు.

వారధి సర్కిల్‌లో ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

రాణిగారితోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ వారధి సర్కిల్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు పలు శాఖల సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. వారధి సర్కిల్ వద్ద గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పోలీస్ అవుట్ పోస్ట్ నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లేందుకు టర్నింగ్ పాయింట్ చాలా ఇరుకుగా ఉండడంతో వాహన దారులు ఇబ్బందులుపడుతు న్నారు. ముఖ్యంగా ఆర్టీసి, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు గుంటూరు వైపు నుంచి వచ్చి వారధి వద్ద కృష్ణలంక వైపు ఉన్న బస్టాప్‌లో ప్రయాణికులను దించుతాయి. ఈ సందర్భంతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలు అక్కడి నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లేందుకు టర్నింగ్ తీసుకునేందుకు సరైన టర్నింగ్ పాయింట్ లేక ఇబ్బందులు పడుతున్నాయి. అయితే ఇందుకు సర్కిల్ మధ్యలో ఉన్న బౌద్ధ చక్రం ఏర్పాటు చేసిన స్థలాన్ని కొంత తగ్గిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిర్ణయించిన అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. ఇందుకోసం పోలీస్ అవుట్ పోస్ట్ వైపు ఉన్న గేటును కొంత వెనక్కి జరిపి నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు ప్రారంభించారు.



వారధి సర్కిల్ వద్ద జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు



పరామర్శ

అనారోగ్యంతో విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ వీరాభిమాని తుమ్మల సత్యను పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. సత్య ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో చర్చించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని డాక్టర్లను శ్రీరామ్ కోరారు.

నలందలో ఘనంగా ఎన్‌సీసీ డే



లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల వ్యతిరేకత అవగాహన ర్యాలీని బందరురోడ్డులోని నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ -17 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నలంద ఎన్‌సీసీ కేడెట్స్, ఇతర కళాశాల ఆర్మీ, నేవీ ఎయిర్ ఫోర్స్, ఎన్‌సీసీ కేడెట్స్ 200 మంది పాల్గొన్నారు. ఆంధ్రా బెటాలియన్ సీవో లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే సూచనల మేరకు నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఏఎన్‌వో కె సుధాకర్, సుబేదార్ సురేష్ చౌదరీలు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ తమ కళాశాలలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. విద్యార్థులు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బిషప్ అజరయ్య స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

వరద విపత్తుల నుంచి ఆదుకోండి

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరదల వల్ల సెంట్రల్‌లో మైనార్టీలు ఆర్థికంగా దెబ్బతిన్నారని, వారిని ఆదుకోవాలని కోరుతూ టీడీపీ సెంట్రల్ మైనార్టీసెల్ నేతలు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను కలసిన మైనార్టీ నేతలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

లయోలాలో పుస్తక ప్రదర్శన



భారతీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ పుస్తక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రా లయోలా కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో బుధవారం పుస్తక ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరుకు చెందిన ప్రముఖ సాహిత్య పరిశోధకుడు పారా అశోక్ కుమార్ పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 75వసంతాల రాజ్యాంగ దినోత్సవ అంశంపై పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయటం చాలా సంతోషించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ పి. కిశోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జి.ఏ ప్రసాద్ రావు, పీజీ లైబ్రేరియన్ టి. రోజామణి, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటీపీ, పిన్ నెంబర్లు ఎవరితో పంచుకోవద్దు

● స్టేట్‌బ్యాంక్ డీజీఎం మనీష్ కుమార్



మాట్లాడుతున్న స్టేట్ బ్యాంకు డీజీఎం మనీష్ కుమార్

లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ డీజీఎం మనీష్ కుమార్ తెలిపారు. స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం బందరు రోడ్డులోని ఒక హోటల్‌లో వినియోగదారుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీల విషయంలో సైబర్ మోసాలు అధికమయ్యాయని, ఆ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్స్‌కి వచ్చే ఓటీపీలను, ఏటీఎం పిన్ నెంబర్లను ఎవరితో పంచుకోకూడదని, ఏటీఎంల వద్ద నగదు డ్రా, డిపాజిట్ చేసే విషయాలలో అపరిచితులను నమ్మవద్దని అన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంతో పాటు బ్యాంకు అందిస్తున్న పలు రుణాలు, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు చిన్నారావు, రామకృష్ణ, ఇతర బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గోవిందరాజుల స్కూల్‌లో ఫ్లాష్‌మాబ్



పటమట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రుతుస్రావంపై యువతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహిళా, శిశుసంక్షేమ శాఖ రిటైర్డు ప్రాజెక్టు డైరెక్టర్ కె.సుహాసిని దేవి తెలిపారు. మ్యాజిక్‌అండ్ ఏఐసీఎఫ్ యూనిట్స్, ఆంధ్రా లయోలా కళాశాల సహకారంతో విజయవాడ తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో పటమట గోవిందరాజుల స్కూల్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ సహజంగా వచ్చే రుతుస్రావం మీద యువతలకు ఎన్నో అపోహలు, సందేహాలు ఉన్నాయన్నారు. వాటిని నివృత్తి చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తరుణీతరంగాలు ఉపాధ్యక్షురాలు విద్యాఖన్నా,సభ్యులు ఉషారాజు, సత్యవతి, వసుంధర, ఏఐసీఎఫ్ లయోలా కాలేజీ ఆర్గనైజర్ పిటీ పార్కర్, పాఠశాల అధ్యాపక బృందం, జన శిక్షణ సంస్థాన్ సభ్యులు పాల్గొన్నారు.

వీనులవిందుగా సాగిన గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంలోని రామకోటి క్షేత్రంలో జరుగుతున్న సద్గురు సంగీత సభ 31వ వార్షిక సంగీత మహోత్సవాలలో నాల్గవ రోజు బుధవారం కార్యక్రమంలో విఖ్యాత గాత్ర విద్వాంసుడు శ్రీ విఘ్నేష్ ఈశ్వర్ గాత్ర కచేరీ రక్తిగా సాగింది. దేశ విదేశాల్లో ఎన్నో కచేరీలు చేసి శ్రీ విఘ్నేష్ ఐఐటీ మద్రాస్‌లో సౌండ్ టెక్నాలజీలో పరిశోధన చేస్తున్నారు. కచేరికి కె.వి.కృష్ణ, కె.సద్గురు చరణ్, చంద్రకాంత్ వయోలిన్, మృదంగం, ఘటంలపై చక్కని సహకారమందించారు.



బ్యూటీ ఆఫ్ వాల్

నగరంలో ఖాళీగా ఉన్న గోడలపై వీఎంసీ రంగులు వేయిస్తోంది. పక్షులు, ప్రకృతి వంటి దృశ్యాలు ఆయా గోడలకు కొత్త శోభను తెస్తున్నాయి. ఈ గోడలపై కనిపించే రంగులు, సుందరమైన దృశ్యాలు పట్టణ వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తున్నాయి.

అపరిశుభ్ర వాతావరణాన్ని దూరం చేసేలా ఏర్పాటు చేసి ఈ పెయింటింగ్స్ ప్రకృతి సౌందర్యాన్ని చాటి చెబుతున్నాయి. అటువైపు నుంచి వెళ్లే పట్టణ ప్రజలకు నూతన అనుభూతిని అందిస్తూ అలరిస్తున్నాయి.

బందరు రోడ్‌లోని రాఘవయ్య పార్కు వద్ద..



బందరు రోడ్‌లోని రాఘవయ్య పార్కు వద్ద..

కృష్ణలంకలోని సర్వీస్ రోడ్ వద్ద..

త్రిలింగ దర్శిని, యాగంటి, మహానందికి ప్రత్యేక బస్సులు

బస్‌స్టేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఏపీఎస్‌ఆర్టీసీ ఈనెల 29న త్రిలింగ దర్శిని యాగంటి, మహానందికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా రవాణ అధికారి ఎం. యేసుదానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న రాత్రి 8 గంటలకు విజయవాడ బస్‌స్టేషన్‌లో ప్రత్యేక బస్సులు బయలుదేరి ఆదివారం ఉదయం 4 గం టలకు యాగంటి చేరుకుని కోనేరులో స్నానం చేసి దర్శ నం చేసుకుంటారు. ఉదయం 11 గంటలకు మహానంది చేరుకుని దర్శనానంతరం అన్న ప్రసాదం స్వీకరిస్తారన్నా రు. అదే రోజు సాయంత్రం 4గంటలకు శ్రీశైలం చేరుకుని దర్శనం చేసుకుని రాత్రి 8 గంటలకు బయలుదేరి ఉద యం 8 గంటలకల్లా విజయవాడ చేరుకుంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ ఒక్కొక్కరికి రూ.1800, వివరాల కొరకు సెల్ నెంబర్లు 80742 98487, 7382898942లో సంప్రదించాలని తెలిపారు.

డ్రగ్స్ విక్రయించటానికి యత్నించిన ఇద్దరి అరెస్టు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మిథేల్ మిశ్రమ (ఎండీఎంఏ) డ్రగ్స్‌ను విక్రయించటానికి ప్రయత్నించిన ఇద్దరిని బుధవారం కృష్ణలంక పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్ తార్నాక వాసి, ప్రస్తుతం విజయవాడ సత్యనారాయణపురం సంగీత కళాశాల ఎదురుగా ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న పులిచెర్ల శ్రీనివాసరెడ్డి (54) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి హైదరాబాద్‌లో ఉన్న రమేష్ పరిచయమై అతని ద్వారా డ్రగ్స్ విక్రయించాడు. శ్రీనివాసరెడ్డి డ్రగ్స్ కేసులో అరెస్టు అయ్యి జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, వేంసురు గ్రామానికి చెందిన నందికోల కిషోర్ (36)తో పరిచయమైంది. ఇరువురు కలిసి ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడకు డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం విజయవాడ బస్ స్టేషన్ సమీపంలో నిందితులు ఇద్దరూ కారులో తిరుగుతుండగా సమీపంలో వున్న పోలీసులకు అనుమానం వచ్చి వారిని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద నాలుగు కేజీల 30 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను, కారును స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి, అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచారు.

దేవదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్‌గా సీతారామయ్య

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్‌గా కృష్ణాజిల్లా నూజివీడు గ్రూప్ టెంపుల్ ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న పామర్తి సీతారామయ్యను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా విజయవాడ సత్యనారాయణపురం శివాలయం ఈవో సువర్ణా దేవి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీతారామయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

క్వారీల అనుమతి కోసం 33 దరఖాస్తులు

● పరిశీలించిన అటవీ అధికారుల బృందం

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి, నున్న అటవీ శాఖ బీట్ల పరిధిలో క్వారీల కోసం వచ్చిన దరఖాస్తులపై అటవీ శాఖ అధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి 33 దరఖాస్తులకు ఆయా ప్రాంతాలలో అనుమతులు ఇవ్వటానికి సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. కుందావారి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, కొత్తూరు తాడేపల్లి, నున్న, ముస్తాబాద, జి.కొండూరు, తదితర ప్రాంతాలకు చెందిన పలువురు కొత్తూరు తాడేపల్లి, నున్న అటవీ శాఖ పరిధిలో క్వారీల కోసం అటవీశాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం కొత్తూరు తాడేపల్లి బీట్ పరిధిలో 32 మంది, నున్న బీట్ పరిధిలో ఒకరు క్వారీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులు తెలిపిన వివరాలలో సర్వే నెంబర్లు, భూమి విస్తీర్ణం, ఇంకా విస్తరణ జరిగిందా, దరఖాస్తులు చేసుకున్న అన్ని విషయాలను సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం అటవీ శాఖ అధికారులు నాలుగు టీమ్‌లుగా ఏర్పడి దరఖాస్తుదారులు క్వారీల కోసం చేసుకున్న భూములను పరిశీలించారు. స్థానికంగా అవగాహన ఉన్న అధికారులు లేకపోవటం వల్ల పరిశీలనకు వెళ్లిన బృందాలు ఇబ్బందులు పడ్డారు. ఈ 33 దరఖాస్తులను బుధవారం, గురువారం పరిశీలించాలని అధికారులు ఆదేశించటం, ఆ బృందాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొదటి రోజు నాలుగు టీమ్‌లు ఒక్కొక్క క్వారీని పరిశీలించినట్లు తెలిసింది. ఇంకా మిగిలిన క్వారీలు ఎన్ని రోజులు పడతాయోనని ఆ బృందాలు చర్చించుకుంటున్నాయి.

దేశ్‌కి ప్రకృతి పరీక్షా అభియాన్ ప్రచారం ముమ్మరం చేయాలి

ఆటోనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేశ్‌కి ప్రకృతి పరీక్షా అభియాన్ ప్రచారాన్ని ఆయుర్వేద వైద్యులు ముమ్మరం చేయాలని ఆంధ్ర బోర్డు ఫర్ ఆయుర్వేద అడిషినల్ డైరెక్టర్, రిజిస్ట్రార్ డాక్టర్ వై. శేఖర్ అన్నారు. బుధవారం ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంపీకప్స్ స్టోర్స్ వద్ద దేశ్‌కి ప్రకృతి పరీక్షా అభియాన్ యాప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర బోర్డు ఫర్ ఆయుర్వేద, ఇంపీకప్స్ డైరెక్టర్ డాక్టర్ వేముల భాను ప్రకా ష్, నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్ రావు, ఆయుర్వేద స్టోర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మల్లేశ్వరునికి సహస్రలింగార్చన



సహస్రలింగార్చన సేవలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లుతో నయనమనోహరంగా అలంకరించారు.

దుర్గగుడిలో ఊంజల్ సేవ

కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో బుధవారం గంగా పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించి, సహస్ర దీపాలను వెలిగించారు. వేదమంత్రాలు, భక్తజనుల కోలాహలం మధ్య సహస్రదీపాలంకరణ చేశారు. ఊంజల్ సేవ, సహస్రదీపాలంకరణల్లో ఈవో కేఎస్ రామారావు పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.

కళావేదికపై వీణ వాజ్య కచేరీ

దుర్గగుడి కళావేదికపై బుధవారం వీణ వాజ్యకారిణి అచలా శంకరనాథ్ వీణ వాజ్య కచేరి హృద్యంగా సాగింది. మృందంగంపై విద్యాసాగర్, ఘటంపై శ్రీధర్ ఆచార్యులు సహకరించారు. అమ్మవారి కీర్తనలతో పాటు శివుడు, విష్ణుమూర్తికి సంబంధించిన పలు కీర్తనలను వీనుల విందుగా వాయించారు. చెరువు ఆదినారాయణ రంగస్థల యాంకర్‌గా వ్యవహరించి, వీణ వాజ్య సొబగులను వివరించారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారిణిని అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకర్ రావు, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేయగా, అమ్మవారి దర్శనానంతరం వారికి అధికారులు ప్రసాదం, శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.



హుండీలు లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

దుర్గమ్మకు రూ.3.80 కోట్ల కానుకలు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వర దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.3,80,77,021 నగదు కానుకల రూపేణ లభించింది. బంగారం 559 గ్రాములు, వెండి 7 కిలోల 020 గ్రాములు లభించింది. 615 యుఎస్‌ఏ డాలర్లు, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 7 కువైట్ దినార్లు, 27 ఖతార్ రియాల్స్, 110 ఎమిరేట్స్ దిర్హమ్స్, 33 మలేషియా రింగేట్లు, 19 సౌదీ రియాల్స్, 30 ఇంగ్లండ్ పౌండ్లు, 10 యూరప్ యూరోలు, 25 కెనడా డాలర్లు, 0.5 ఒమన్ రియాల్స్, 10 సింగపూర్ డాలర్లు హుండీల్లో లభించాయి. ఈవో కేఎస్ రామారావు డిప్యూటీ ఈవో రత్నరాజు, ఏఈవోలు, సిబ్బంది, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదార్లు లెక్కింపులో పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కర్ణాటక పంపాక్షేత్ర సాధకుడు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పంపాక్షేత్ర సాధకుడు, ద్వారకా, బద్రి జ్యోతిష్ పీఠం శిష్యుడు గోవిందా నంద సరస్వతీ స్వామీజీ బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అనంతరం ఈవో రామారావు ఇటీవల అమ్మవారి వైభవం, క్షేత్ర మహిమల గురించి ముద్రించిన పుస్తకాలను అందజేశారు. ఆ పుస్తకాలను పరిశీలించిన ఆయన గ్రంథాలలో ఎంతో విపులంగా అమ్మవారి వైభవం గురించి రాశారని కొనియాడారు.



స్వామీజీకి చిత్రపటం అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు, డీఈవో రత్నరాజు తదితరులు

నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడలోని రామచంద్రానగర్‌కు చెందిన కేశినేని ఈశ్వర్, శిల్ప బుధవారం ఆలయానికి విచ్చేసి నిత్యాన్నదానం నిమిత్తం రూ.1,11,116 విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● మున్సిపల్ మంత్రి నారాయణ

చిట్టినగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ ప్రణాళికలను సీఎంతో చర్చించి ముందుకు తీసుకెళ్తామన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సరిగా అందడం లేదని ప్రస్తావించారు. పరిష్కారానికి కొన్నిచోట్ల తాగునీటి ట్యాంకులు నిర్మించాలని అధికారులు తెలిపారు. ఆయా ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులను వీఎంసీ సాధారణ నిధుల నుంచి కేటాయించాలని మంత్రి అధికారులకు సూచించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో అమృత్ పథకం నిధులు విడుదల కాలేదని, ఆ నిధులు వచ్చి ఉంటే నగరంలో తాగునీటికి కొరత ఉండేది కాదన్నారు. అమృత్ 1.0 పథకంలో చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయో మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా(ఐలా) పరిధిలో గురునానక్ నగర్‌లో ఉన్న సుమారు 400 ఇళ్లకు తాగునీటి సరఫరా ఇవ్వడం లేదని గద్దె రామ్మోహన్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఐలాతో ఉన్న సాంకేతిక పరమైన కారణాలతో కార్పొరేషన్ నుంచి తాగునీటి పైప్‌లైన్ ఇవ్వలేదని కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. ఆయా ఇళ్లకు తాగునీరందించేందుకు అవసరమైన పైప్‌లైన్ నిర్మించాలని నారాయణకు అధికారులకు చెప్పారు. సాంకేతిక పరమైన అవరోధాలు తొలగేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. బుడమేరు వరద కారణంగా పాడైన రహదారులను త్వరగా నిర్మించాలన్నారు. అనంతరం వరద కాల్వల నిర్వహణ, సివరేజ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణంపై చర్చించారు. డ్రెయిన్స్‌లో ఉన్న పూడికతీత పనులు కొనసాగించాలని, సిల్ట్ తొలగింపు పనులు పూర్తిచేయాలన్నారు. వాంబే కాలనీలోని కొంతమందికి ఇళ్ల పట్టాలివ్వాలనే అంశాన్ని ఎమ్మెల్యే బొండా ఉమా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అసైన్డ్ భూముల్లోని వాటికి ఇళ్ల పట్టాలిచ్చే అంశంపై కలెక్టర్‌తో మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ నిధి మీనా

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

● జాయింట్ కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఆదేశించారు. బంగాళాఖాతంలో తుఫాను దృష్ట్యా జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులకు, తహసీల్దార్లకు, మండల వ్యవసాయ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, సివిల్ సప్లైస్ సిబ్బందికి, వ్యవసాయ శాఖ సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, మిల్లర్లకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులను వేగిరపరిచి కల్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను దృష్ట్యా రవాణా వాహనాలకు జీపీఎస్ విధానాన్ని పరిశీలించడం అయిందని, రైతులకు అవసరమైన గోనె సంచులు, లేబర్, రవాణా వాహనాలు, మిల్లులకు బ్యాంక్ గ్యారంటీలు అందుబాటులో ఉన్నట్లు జేసీ తెలిపారు. కావున రైతులందరూ గమనించి ఎలాంటి భయాందోళన చెందకుండా తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మాల్సిందిగా జేసీ కోరారు.

బాల్యవివాహాలు పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావం

● మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

విజయవాడ లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం అన్నారు. సిటీ సివిల్ కోర్టుల ఆవరణ నుంచి బుధవారం 'బాల్య వివాహ రహిత భారతదేశాన్ని నిర్మిద్దాం' అంటూ బెజవాడ బార్ అసోసియేషన్, మండల న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 5వ నెంబరు రోడ్డుపై న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు 18ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు రాకుండా వివాహం చేయరాదని, అలా చేస్తే వివాహం చేసిన వారికి శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా పై వయసులోపు పిల్లలకు వివాహం చేసే ప్రయత్నం చేస్తే పోలీసులకు గానీ, మండల న్యాయసేవాధికార సంస్థకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాన్ని రూపుమాపేందుకు ప్రయత్నాలు చేయాలన్నారు. సమాజంలో అందరికీ ఈ విషయంపై అవగాహన కల్పించేలా న్యాయవిజ్ఞాన సదస్సుల ఏర్పాటుతో న్యాయవాదులు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా) పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సత్యానందం, బార్ కౌన్సిల్ మెంబర్ మల్లేశ్వరరావు

ఉత్కంఠగా ఏపీ స్టేట్ ఓపెన్ ఫెన్సింగ్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డీఎస్ఏ హాల్లో ఏపీ స్టేట్ ఓపెన్ జూనియర్ అండర్-20 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు బుధవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ డ్రా తీసి పోటీలను ప్రారంభించారు. ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 50 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డిసెంబర్ 2 నుంచి బీహార్ రాష్ట్రం పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగే 32వ జూనియర్ జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి కృష్ణా ఫెన్సింగ్ సెక్రటరీ నాగం సతీష్, జిల్లాల నుంచి సంఘ సభ్యులు డి అశోక్, త్రినాథ్, పవన్ వికాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర విజేతలు వీరే...

బాలుర ఫాయిల్ విభాగంలో ఎన్ నిఖిలేష్ (కర్నూల్), వై నాగ మహిజిత్ (కర్నూల్), జి భార్గవ (క ర్నూల్), పి మనోజ్ (విజయనగరం) తొలి 4 స్థానాల్లో నిలిచారు. బాలికల్లో పి విష్ణు ప్రియాంక (కృష్ణా), ఆర్ సుశ్రిత నాయుడు (విశాఖ), ఎస్ మొబీనా (తూర్పుగోదావరి), వై ప్రవల్లిక (విజయనగరం) తొలి 4 స్థానాల్లో నిలిచారు. ఇప్పీ విభాగంలో బాలురు: సీహెచ్ విష్ణువర్ధన్ (నెల్లూరు), వి లోకేష్ సాయి (ప్రకాశం), ఎండీ ఉదయ్‌కుమార్ (కర్నూల్), పి అంబరీష్ (ప్రకాశం), బాలికల్లో వి చైత్ర (కర్నూల్), వి కేసవి (విజయనగరం), ఎస్‌కే ఆఫిషా (ప్రకాశం), పి హరిషా (కర్నూల్) తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. బాలుర సబరే విభాగంలో కె శృత్ సింహా (అనంతపురం), ఎస్ఎల్ చరణ్‌జిత్ (కర్నూల్), బి నాగ కార్తికేయ రెడ్డి (కర్నూల్), ఎ సాయి మల్లిఖార్జునరెడ్డి (తూర్పుగోదావరి), బాలికల్లో దివ్య శ్రీ (కర్నూల్), కేవీఎస్ మహిత (కృష్ణా), టీఎల్ కృష్ణకుమారి (గుంటూరు), డి సుసన్ (విజయనగరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు.



కూరగాయల లారీని తిరుమలకు పంపిస్తున్న వ్యాపారవేత్త కోటయ్య

తిరుమలకు 10 టన్నుల కూరగాయల పంపిణీ

లబ్బీపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నదాన ప్రసాదంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వ్యాపారవేత్త ఎస్.కోటయ్య అన్నారు. దాతలు శీలంశెట్టి బాలాజీ, సాయి ప్రపూర్ణ, చింతల రవికుమార్, పద్మ ఆధ్వర్యంలో తిరుమలకు 10 టన్నుల కూరగాయలను కస్తూరిబాయిపేటలోని కార్యాలయం నుంచి పంపే కార్యక్రమం బుధవారం జరిగిం ది. ఈ లారీని వ్యాపారవేత్త ఎస్.కోటయ్య ప్రారంభించారు. దాతలు మాట్లాడుతూ శ్రీవారి సేవలో పాల్గొనే అవకాశం రావడం తమకు దక్కిన అదృష్టమన్నారు. ఏవీ ఆప్టికల్స్ అధినేత సుబ్బారావు, గోగినేని సుజాత, అడబాల సత్యన్నారాయణ, మణి, ఆడిటర్ అక్కయ్య నాయుడు, తమ్మిన శివకుమార్, కుసుమ, శీలంశెట్టి కార్తిక్, రాగ చంద్రిక, బుద్ధసాగర్, శ్రీనివాసరావు, వరలక్ష్మి, నరసయ్య, సమత, సాంబశివరావు, లక్ష్మి, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి

సౌత్ ఇండియా చెస్ పోటీలకు కేబీఎన్ విద్యార్థులు

వన్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ స్థాయిలో త్వరలో జరగబోయే చెస్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. చెస్‌పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈనెల 22న కృష్ణా విశ్వ విద్యాలయంలో జరిగిన వర్శిటీస్థాయి అంతర కళాశాలలో పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడం ద్వారా జాతీయ మహిళలు, పురుషులు రెండు విభాగాల్లో నూ తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. తమిళనాడులోని వెల్‌టెక్ వర్శిటీ లో జరగబోయే మహిళల టోర్నమెంట్‌కు ఎ.బిందుమాధవి ఎంపికయ్యారన్నా రు. విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను హిందూ హైస్కూల్ విద్యా సంస్థల కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

రుణ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలి

సత్యనారాయణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సంఘం జిల్లా యూనియన్‌లో సభ్యత్వం తీసుకొని జిల్లా యూనియన్ ఇచ్చే రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్, యూనియన్ ఫంక్షనల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ముత్యాలంపాడులోని పశుసంవర్థక శాఖ కార్యాలయం సమేశ మందిరంలో బుధవారం కృష్ణాజిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ డి.వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రాథమిక సంఘాలు వెంటనే ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఆడిట్ జరగని సంఘాలు యూనియన్ కార్యనిర్వహణాధికారిని సంప్రదించి వెంటనే ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లా యూనియన్‌లో 125 ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలుండగా వాటిలో 33 ప్రాథమిక సంఘాలకుగాను 153 మందికి ఎన్‌సీడీసీ పథకం ద్వారా 20శాతం రాయితీతో రుణమిచ్చామన్నారు. కేంద్రప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం రాయితీతో ఇచ్చే రుణసదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ జి ఉమ పర్యవేక్షించారు.

సముద్రంలో ఉన్న నౌకలో కలెక్టర్ తనిఖీలు

» దక్షిణాఫ్రికాకు వెళ్లే నౌకలో 640 టన్నుల పీడీఎస్ బియ్యం గుర్తింపు



నౌకలో బియ్యాన్ని తనిఖీ చేస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ కాకినాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాకు బియ్యం రవాణా చేస్తున్న నౌకను తనిఖీ చేసేందుకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం పెద్ద సాహసమే చేశారు. సముద్రంలో ఉన్న భారీ నౌకను చేరుకునేందుకు యాంకరేజ్ పోర్టు నుంచి గంటపాటు ప్రయాణించి నౌకలో సోదాలు చేశారు. దక్షిణాఫ్రికాకు వెళ్తున్న ఈ స్టెల్లా ఎల్ నౌకలో 640 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. జూన్‌లో సీజ్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని ఇటీవల విడుదల చేశామని, నౌకలో ఉన్న బియ్యం.. తాము విడుదల చేసిన బియ్యం ఒక్కటేనా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

మైనార్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇప్పించనున్నట్టు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో భాగస్వామ్యమై ఈ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందు కోసం ఆసక్తిగల సంస్థలు, అభ్యర్థులు www.apcedmmwd.org పోర్టల్ ద్వారా, లేదా మైనార్టీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 0866-2970567 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

కుప్పంలో వర్చువల్‌గా మండల సమావేశం

కుప్పం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం సాంకేతికంగా గొప్ప ముందడుగు వేసింది. కుప్పంలో తొలిసారిగా మండల సమావేశం వర్చువల్‌గా జరిగింది. బుధవారం మండల కార్యాలయం నుంచి ఇతర సచివాయాల్లో ఉన్న సర్పంచులు, కార్యదర్శులతో వర్చువల్‌గా ఈ సమావేశం నిర్వహించారు. కుప్పం మండల సచివాలయంలో వర్చువల్ ఇంటరాక్షన్ ఏరియా (వయా) ఏర్పాటుకు ఎంపీడీవో సాయిలహరి శ్రమకోర్చి అందుబాటులోకి తెచ్చారు.

వైద్య కళాశాలల్లో పోస్టులు నింపండి: సత్యకుమార్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యకళాశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖపై సమీక్ష సందర్భంగా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నారాయణ స్కూల్స్ పూర్వ విద్యార్థికి ఐఈఎస్‌లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

హైదరాబాద్, నవంబరు 27: ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ (ఐఈఎస్) 2024 (సివిల్ ఇంజనీరింగ్)లో నారాయణ స్కూల్స్ పూర్వ విద్యార్థి రోహిత్ ధొండ్గే ఆలిండియా ఫస్ట్ (1) ర్యాంక్ సాధించాడు. అంకితభావం, నిరంతర సాధనతో ఈ రికార్డును స్వంతం చేసుకున్నాడని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ఓ ప్రకటనతో తెలిపింది. రోహిత్ ఆలిండియా టాప్ ర్యాంక్ సాధించటంపట్ల నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ డా. పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. నారాయణ స్కూల్‌లోని బేసిక్ కాన్సెప్ట్‌పై వేసిన స్ట్రాంగ్ ఫౌండేషన్, నారాయణ ప్రోగ్రామ్స్, టీచింగ్.. రోహిత్ విజయానికి ఎంతోగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు మరియు విద్యార్థులు రోహిత్ ధొండ్గే మరియు అతని కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ఫెంగల్ తుఫాన్ ముప్పు!

» నేటి ఉదయానికి తుఫాన్‌గా మారనున్న తీవ్ర వాయుగుండం

» రేపు రాత్రికి చెన్నై వద్ద తీరం దాటుతుందని అంచనా

» తీరం వెంబడి పెరిగిన గాలుల తీవ్రత

విశాఖపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం రాత్రి ఇది నాగపట్నానికి 320 కి.మీ. ఆగ్నేయంగా, చెన్నైకి 500 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది గురువారం ఉదయానికి తుఫాన్‌గా మారుతుందని భారత వాతావరణశాఖ(ఐఎండీ) అంచనా వేసింది. తరువాత రెండు రోజుల్లో శ్రీలంక తీరాన్ని తప్పించుకుని ఉత్తర తమిళనాడు తీరం దిశగా రానుందని ఐఎండీ తెలిపింది. శుక్రవారం రాత్రి ఉత్తర తమిళనాడులోని చెన్నై, కడలూరు మధ్య తుఫాను తీరం దాటుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. శ్రీలంక తీరానికి సమీపంగా వచ్చేటప్పుడు చలిగాలులు తీవ్ర వాయుగుండం వైపు వీచే అవకాశం ఉన్నందున దాని గమనం కొంత నెమ్మదిస్తుందని చెబుతున్నారు. గురువారం ఉదయం తుఫాన్‌గా మారిన తరువాత కొంతమేర బలపడుతుందని, శుక్రవారం ఉదయం నుంచి తిరిగి వాయుగుండం లేదా తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని, శుక్రవారం రాత్రి ఉత్తర తమిళనాడులో తీరం దాటుతుందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో బుధవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వాతావరణం చల్లగా మారింది. తీరం వెంబడి గాలులు తీవ్రత పెరిగింది. గురువారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. శుక్రవారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయంది. గురువారం నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, అన్నమయ్య కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. శనివారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, బాపట్ల, శ్రీసత్యసాయి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వచ్చే నెల ఒకటి, రెండు, మూడు తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 30వ తేదీ వరకు దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 55 నుంచి 65, అప్పుడప్పుడు 75 కి.మీ.వేగంతో గాలులు వీస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. కోస్తాంధ్రలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు హెచ్చరిక ఎగురవేశారు. కాగా, ఈ సీజన్‌లో వాయుగుండాలు/తుఫానులు దక్షిణ తమిళనాడు వైపు వస్తుంటాయని, దానికి భిన్నంగా ఇది ఉత్తర తమిళనాడు దిశగా వస్తోందని నిపుణులు చెబుతున్నారు. కోస్తాంధ్రలో తీరం వెంబడి ఉన్న ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, తీరం నుంచి 30 కి.మీ. దాటిన తరువాత ప్రభావం ఒక మోస్తరుగా ఉంటుందని వాతావరణ అధికారి ఎస్.జగన్నాథకుమార్ తెలిపారు.

తేమ 25% ఉన్నా ధాన్యం కొంటాం: మనోహర్



తెనాలి, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లిపర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మారిన వాతావరణ పరిస్థితులతో చేతికొచ్చిన పంటను అమ్ముకోలేమనే భయంతో రైతులు ఉన్నారు. ఎవరికీ ఆ భయం అవసరం లేదు. ప్రతి గింజా కొంటాం. మీ ఇబ్బందులు చూసి కొనుగోలు నిబంధనల్లో మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. దీంతో వాటిని సవరించి, తేమ శాతం పెంచాం. ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు వేస్తున్నాం' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం ఆయన గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గుంటూరు జిల్లా తెనాలిలో విలేకరులతో మాట్లాడారు. రైతుల్లో ధైర్యం నింపేలా వారి దగ్గరకు వెళ్లాలని చంద్రబాబు, పవన్ ఆదేశించడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు. 17శాతానికి మించి తేమ ఉంటే ధాన్యం కొనక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో వాటిలో మార్పులు చేశామన్నారు. కోస్తా ప్రాంతంలోని 5 జిల్లాల్లో ధాన్యంలో 24-25 తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. కేవలం ఐదు కిలోల తరుగు మాత్రమే తీసుకుని ధాన్యం కొనుగోళ్లకు వెసులుబాటు కల్పించామన్నారు. ఇప్పటి వరకు కోసిన ధాన్యాన్ని రెండు రోజుల్లో కొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధాన్యం కొనుగోలు వాహనాలకు జీపీఎస్ ఉండాలనే నిబంధన కూడా మార్చామని చెప్పారు. గోతాలు, కూలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పటి వరకు రూ.1100 కోట్ల విలువైన ధాన్యాన్ని కొన్నామని చెప్పారు. కాగా బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరు, క్రాప, గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం గొడవర్రు ప్రాంతాల్లో రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. వల్లభాపురం, మున్నంగిల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం ఎంతకు, ఎవరికి అమ్ముతున్నారని రైతులను ప్రశ్నించగా తేమ శాతం, ఈకేవైసీతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు మంత్రికి చెప్పగా.. ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

3, 4 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. అమరావతి సచివాలయంలో డిసెంబరు 3, 4 తేదీల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, 100 రోజుల పాలనా లక్ష్యాలు, తొలి కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన అజెండా అమలు, తదితర అంశాలపై కలెక్టర్లతో ప్రభుత్వం చర్చించనుంది. ఇసుక, సహజ వనరులు, భూ కుంభకోణాలు, శ్వేతపత్రాల విడుదల అనంతరం అందులోని అంశాలపై జిల్లాల వారీగా కలెక్టర్లు తీసుకున్న నిర్ణయాలు, భూ రికార్డుల పునఃపరిశీలన, నూతన పరిశ్రమల ఏర్పాటు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కట్టడి, శాంతిభద్రతలు, సోషల్‌మీడియాలో సైకోల అరాచకం, వ్యవసాయం, నీటిపారుదల తదితర అంశాలపైనా చర్చిస్తారు. తొలి కలెక్టర్ల సమావేశం అనంతరం ప్రభుత్వం ఆయా శాఖలు, జిల్లాలకు 100 రోజుల లక్ష్యాలను నిర్దేశించింది.

రాగూర్ ఫార్మాలో ప్రమాదం

» విష వాయువులు లీకై ఒకరు దుర్మరణం

» తొమ్మిది మందికి అస్వస్థత.. ఇద్దరి పరిస్థితి విషమం

పరవాడ/అనకాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని ఫార్మా సిటీలో విషవాయువు మరో ప్రాణాన్ని బలి తీసుకుంది. రాగూర్ లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం విష వాయువులు లీకవ్వడంతో ఒడిశాకు చెందిన అమిత్ భాగ్ (23) అనే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అయితే ప్రమాద సమాచారం బుధవారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాగూర్ లేబొరేటరీస్‌లోని ప్రొడక్షన్ బ్లాక్-3లో హైడ్రోక్లోరిక్ యాసిడ్ (హెచ్‌సీ సెల్), క్లోరోఫామ్ కలిపి 2కే ఎల్ సామర్థ్యం కలిగిన రియాక్టర్‌లోకి పంపించారు. అయితే ఓవర్ ఫ్లో కావడంతో క్లోరోఫామ్ లిక్విడ్ అధిక మొత్తంలో రియాక్టర్‌పై ఉన్న పైపు ద్వారా బయటకు వ్యాపించింది. అక్కడే పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. యాజమాన్యంతో పాటు అస్వస్థతకు గురైన ఉద్యోగులు దీన్ని తేలిగ్గా తీసుకున్నారు. సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి 11 గంటల నుంచి వాంతులు మొదలయ్యాయి. యాజమాన్యం సూచన మేరకు బాధితులను వడ్లపూడిలోని పవన్‌సాయి, షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రుల్లో చేర్చారు. తీవ్ర అస్వస్థతకు గురైన హెల్పర్ అమిత్‌భాగ్ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతిచెందాడు. అస్వస్థతకు గురైన మరో తొమ్మిది మందిలో శిలపరశెట్టి వీరశేఖర్, దుంపల చిన్నికృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెబుతున్నారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఆరా తీశారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అస్వస్థతకు గురైన సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించి ప్రాణహాని లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వపరంగా బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉండాలన్నారు. కాగా, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ జిల్లా అధికారులను ఆదేశించారు.

ఉద్యోగాల కల్పనకే నైపుణ్య గణన

» కంపెనీలకు అందుబాటులో నిరుద్యోగుల సమాచారం: లోకేశ్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాల కల్పనే నైపుణ్య గణన లక్ష్యమని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. నిరుద్యోగ యువతకు ఈ నైపుణ్య గణన ఉపయోగపడాలని అధికారులకు సూచించారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. నైపుణ్య గణన సమయంలోనే యువత సర్టిఫికెట్లు, అర్హతలను ఏకీకృతం చేయాలన్నారు. దానివల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. నైపుణ్యాలపై ప్రాథమిక మూల్యాంకనానికి మైక్రోసాఫ్ట్ సంస్థ అంగీకరించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గణన సమయంలో ఇళ్ల వద్ద లేనివారు యాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. గణన పూర్తయిన తర్వాత జె.పాల్ సంస్థ ద్వారా విశ్లేషించాలని మంత్రి ఆదేశించారు. గణన అనంతరం ఆ సమాచారాన్ని పరిశ్రమలకు అందుబాటులో ఉంచితే, అవసరమైన వారిని ఉద్యోగాల్లో తీసుకుంటారన్నారు. నైపుణ్య గణన డేటాను లింక్డిన్, నౌకరీ.కామ్, జాబ్ ఎక్స్ లాంటి సంస్థలతో అనుసంధానం చేయాలన్నారు. ట్రెయిన్ అండ్ హైర్ విధానంలో యూనివర్సిటీల్లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ముందుకొచ్చాయని అధికారులు తెలిపారు. కాగా, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి, నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణ ఇవ్వాలని మంత్రి సూచించారు. ఓంక్యాప్ ద్వారా విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. అమరావతిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు.

మెగా డీఎస్సీ సిలబస్ విడుదల

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీకి సంబంధించిన సిలబస్‌ను పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో సిలబస్ సమాచారం అందుబాటులో ఉంచింది. కాగా దీనిపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సిలబస్ ప్రకటించామని, డీఎస్సీకి పూర్తిస్థాయిలో సన్నద్ధమై, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని యువతకు సూచించారు.

నవ్య | చిత్రజ్యోతి

విడాకులు మంజూరు



తమిళ హీరో ధనుష్ - ఐశ్వర్య రజనీకాంత్ చట్టపరంగా విడిపోయారు. ఈ దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ చెన్నై ఫ్యామిలీ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. దీంతో వీరిద్దరి రెండు దశాబ్దాల వివాహ బంధం ముగిసిపోయినట్లయింది. 2004లో వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి వేద్, లింగా అనే ఇద్దరు మగ పిల్లలున్నారు. అయితే, మన స్పర్థల కారణంగా తాము విడిపోతున్నట్టు వారు 2022లో ప్రకటించారు. ఆరు నెలల క్రితం ధనుష్ విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణకు హాజరుకాకపోవడంతో వీరిద్దరూ మళ్లీ ఒక్కటవుతారని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా ఈ నెల 21వ తేదీన కోర్టుకు హాజరై విడాకులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. వారిద్దరి ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి శుభాదేవి తుది తీర్పును 27వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు బుధవారం వారికి విడాకులు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఈ క్రిస్మస్ మాదే!

నితిన్



'భీష్మ' చిత్రం తర్వాత దర్శకుడు వెంకీతో చేస్తున్న సినిమా 'రాబిన్‌హుడ్'. నా కెరీర్‌లోనే ఇది హయ్యెస్ట్ బడ్జెట్ సినిమా. 'భీష్మ' మ్యాజిక్ రిపీట్ అవుతుందని స్ట్రాంగ్‌గా నమ్ముతున్నా. శ్రీలీలతో నాకు ఇది సెకండ్ ఫిల్మ్. మాది హిట్ పెయిర్ అని ఈ సినిమా తర్వాత అనిపించుకుంటాం. నిర్మాతలు పెట్టిన డబ్బుని రాబిన్‌హుడ్ రెట్టింపు మొత్తంలో మీ నుంచి దోచుకుని వారికి ఇస్తాడు. గ్యారంటీగా చెబుతున్నా ఈ క్రిస్మస్ మాదే' అన్నారు హీరో నితిన్. ఆయన హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' చిత్రం వచ్చే నెల 25న విడుదలవుతున్న సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'ఇప్పటివరకూ నన్ను కమర్షియల్ హీరోయిన్‌గా, డాన్సింగ్ స్పెషల్‌గా ఆడియన్స్ చూశారు. 'రాబిన్‌హుడ్'తో నా నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'నన్ను , కథని నమ్మి ఇంత బడ్జెట్ పెట్టి సినిమా తీసిన నిర్మాతలకు కృతజ్ఞతలు. సపోర్ట్ చేసిన నితిన్‌కు థాంక్స్. ఎడిటింగ్ రూమ్‌లో సినిమా చూసుకున్నా. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. నిర్మాతలు కూడా చాలా హ్యాపీగా ఉన్నారు. ఇందులో ఓ ఐటెం సాంగ్ ఉంది. అది కూడా ట్రంప్ కార్డ్ అవుతుంది' అని చెప్పారు. నిర్మాతలు నవీన్, రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని మా నమ్మకం' అన్నారు.

పదిహేనేళ్ల ప్రేమ



ఇటీవలే కీర్తి సురేశ్ తన చిరకాల స్నేహితుడు, కేరళకు చెందిన వ్యాపారవేత్త ఆంటోనీ తట్టిల్‌ని పెళ్లిచేసుకోబోతున్నారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై స్పందించిన కీర్తి సురేశ్.. తన రిలేషన్ స్టేటస్‌పై స్పష్టత ఇచ్చారు. ఈ మేరకు దీపావళీ రోజున ఆంటోనీతో కలసి తీసుకున్న ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆంటోనీతో నాది 15 ఏళ్ల అనుబంధం. ఇక ముందూ మా ఇద్దరి బంధం ఇలాగే కొనసాగనుంది" అని తమ రిలేషన్‌షిప్ గురించి చెప్పారు. ఈ పోస్టు చూసిన పలువురు సినీ ప్రముఖులు కీర్తి సురేశ్‌కు అభినందనలు తెలుపుతున్నారు. అయితే వీరి వివాహానికి సంబంధించిన వివరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. డిసెంబరు 11న గోవాలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో వీరి వివాహం జరగనుందనీ, పెళ్లికి రెండు రోజుల ముందే డిసెంబరు 9న వివాహ వేడుకలు ఆరంభమవుతాయని సమాచారం.



నటుడు సుబ్బరాజు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ మేరకు తన సతీమణితో కలసి బీచ్‌లో దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ పోస్టును చూసిన సినీ ప్రముఖులు, అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే సుబ్బరాజు భార్య గురించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

డిసెంబరులో వస్తున్న ఫియర్



వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో దత్తాత్రేయ మీడియా బేనర్‌పై డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. కో ప్రొడ్యూసర్ సుజాత రెడ్డి. అరవింద కృష్ణ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు.ఈ మూవీని డిసెంబరు 14 విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులను గెల్చుకోవడం కూడా మూవీపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు.

సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి

- నిర్మాత ఏ.ఎం.రత్నం



డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్ నిర్మాతగా, గురుప్రసాద్ దర్శకత్వంలో లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ 'సినిమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి. 'ఝాన్సీ ఐపీఎస్' ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. లక్ష్మీ రాయ్ యాక్షన్ ఆకట్టుకుంటుంది" అన్నారు.

గద్దర్ నటించిన చివరి చిత్రం



నటుడు సత్యారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. ప్రజా గాయకుడు గద్దర్ నటించిన చివరి చిత్రం ఇది. ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ 'తన పదవికి రాజీనామా చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణతో పాటు ఎంతో మంది ఉద్యమకారులను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాలో కథానాయకుడి పాత్రను గద్దర్ తీర్చిదిద్దారు. ఆ పాత్రను పోషించే అవకాశం నాకు దక్కింది.' అన్నారు.

నయనతార దంపతులపై ధనుష్ దావా

హీరోయిన్ నయనతార, ఆమె భర్త, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌లపై తమిళ హీరో ధనుష్ కోర్టులో దావా వేశారు. తాను నిర్మించిన 'నానుమ్ రౌడీ దాన్' చిత్రంలోని విజువల్స్‌ను 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' అనే డాక్యుమెంటరీలో తన అనుమతి లేకుండా వాడుకున్నారని ధనుష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ డాక్యుమెంటరీ టీజర్‌లో 3 సెకండ్ల పాటు 'నానుమ్ రౌడీ దాన్' చిత్రం విజువల్స్‌ను వాడినందుకు రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ ధనుష్ నయనతారకు నోటీసు పంపించారు. దీంతో ఆగ్రహించిన నయనతార.. ధనుష్ వైఖరిని తప్పుబడుతూ బహిరంగ లేఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు.



స్ఫూర్తిదాయకంగా అనిపించలేదు

"నేను 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'ను చూశా. స్ఫూర్తిదాయకమైన, ఆకట్టుకునే అంశాలు ఏమీ ఇందులో లేవు' అని డాక్యుమెంటరీపై ప్రముఖ రచయిత్రి శోభా డే అన్నారు. 'నాకు నయనతార గురించి తెలీదు. ఆమె గురించి తెలుసుకోవాలని ధైర్యం చేసి 45 నిమిషాల పాటూ చూశాను. వివాహాన్ని ఇలా వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవడం మంచి పద్ధతి కాదు. ఇది చూసి అందరూ వీరినే ఫాలో అవుతారు" అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

పండ్ల మొక్కలు పెంచేద్దాం..!

పూల మొక్కలు, పండ్ల మొక్కలు పెంచాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. కానీ ఇంటి పరిసరాల్లో మొక్కలను పెంచడానికి సరిపోయే స్థలం లేదని బాధపడుతూ ఉంటారు. అలా కాకుండా బాల్కనీలో చిన్న కుండీల్లో సులువైన పద్ధతుల్లో పెంచుకునే పండ్ల మొక్కల వివరాలు తెలుసుకుందాం.



బొప్పాయి

● బొన్సాయి రకం బొప్పాయి చెట్టును కుండీలో పెంచవచ్చు. ఈ పండ్లు చాలా తీయగా రుచికరంగా ఉంటాయి కూడా. ఈ చెట్టును పెంచడానికి పద్దెనిమిది అంగుళాల కన్నా ఎక్కువ లోతున్న కుండీని ఎంచుకోవాలి. అందులో ఇసుక పాళ్లు ఎక్కువగా ఉండే నల్ల మట్టిని నింపాలి. దీనిలో యూరియా తదితర ఎరువులు కలపాలి. నర్సరీ నుంచి బొన్సాయి రకం బొప్పాయి మొక్కను తెచ్చి కుండీలో లోతుగా నాటాలి. ప్రతి రోజూ తగినన్ని నీళ్లు పోస్తూ సూర్యరశ్మి తగిలేలా ఉంచాలి. నాలుగు నుంచి ఆర్నెల్లలో బొప్పాయి కాత ఆరంభమవుతుంది.



స్ట్రాబెర్రీ

● ఈ మొక్కని కుండీలో పెంచడం చాలా సులువు. చలికాలంలో ఇది వేగంగా పెరుగుతుంది కూడా. ఈ మొక్కని పెంచడానికి అంతగా లోతు లేని వెడల్పాటి కుండీని ఎంచుకోవాలి. దీనిలో తోట మట్టి నింపాలి. ఇందులో స్ట్రాబెర్రీ గింజలు చల్లి మొక్కలు పెంచవచ్చు. లేదంటే నర్సరీ నుంచి స్ట్రాబెర్రీ మొక్కను తెచ్చి నాటవచ్చు. ఈ మొక్క పెరుగుతున్నపుడు దానికి ఊతగా కర్ర లేదా చెక్కను నిలబెట్టాలి. పెద్దగా సంరక్షణ అవసరం లేదు.



కివీ

● పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన పండు ఇది. చలికాలంలో ఈ పండు మొక్కను పెంచడం చాలా సులువు. బొన్సాయి రకాన్ని కూడా కుండీలో పెంచవచ్చు. లోతుగా ఉన్న పెద్ద కుండీలో తోటమట్టి, సేంద్రియ ఎరువు కలపాలి. కనీసం పది వారాల వయసు ఉన్న మొక్కను నర్సరీ నుంచి తెచ్చి కుండీలో నాటాలి. ఈ మొక్కకు ఎండ తగిలేలా ఉంచి రోజుకు రెండు పూటలా దానిపై నీరు చిలకరించాలి.



నిమ్మ

● ఎండ తగులుతూ ఉంటే నిమ్మ మొక్క కూడా వేగంగానే పెరుగుతుంది. ఒక కుండీలో తోటమట్టి, కొబ్బరి పీచు, సేంద్రీయ ఎరువు, ఆవుపేడ వేసి బాగా కలపాలి. ఇందులో నిమ్మ మొక్కను తెచ్చి నాటాలి. లేదంటే నిమ్మ గింజలను పలుచని పేపర్లో మొలకెత్తించి కూడా నాటవచ్చు. ఈ మొక్క పెరుగుతున్నపుడు దానిపై కొన్ని నీళ్లను చిలకరిస్తే చాలు. ఈ మొక్కకు ముళ్లు కూడా ఉంటాయి.

మధుమేహం ఉన్నట్లేనా!

మహిళలను వేధిస్తున్న ప్రధాన సమస్య మధుమేహం. దీనిని ప్రారంభ దశలో గుర్తిస్తే సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. మధుమేహం ఉన్న మహిళల్లో నాలుగు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవి...

అధిక దాహం

● రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువైనపుడు మూత్రపిండాలు అదనంగా ఉన్న గ్లూకోజ్‌ను బయటికి పంపేందుకు నిరంతరం శ్రమిస్తుంటాయి. దీనివల్ల శరీరంలో ఉన్న నీరు మూత్ర రూపంలో విసర్జితమవుతుంది. వెంటనే శరీరంలో తేమ శాతం తగ్గి దాహమేస్తుందన్న భావన కలుగుతుంది. అంతేకాకుండా మూత్రాశయంలో మంట, దురద వంటివి బాధిస్తుంటాయి. ఈ సమస్యలు రాత్రిపూట ఎక్కువగా కనిపిస్తుంటాయి.



ఇన్సులిన్ నిరోధకత

● మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత కారణంగా పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పీసీఓఎస్) ఏర్పడుతుంది. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను సరిగా ఉపయోగించుకోలేదు. అప్పుడు టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. దీని కారణంగా నెలసరి సరిగా రాకపోవడం, శరీరం బరువు పెరగడం, మొటిమలు రావడం వంటి సమస్యలు కనిపిస్తాయి.

మూత్రాశయ వ్యాధులు

● శరీరంలో చక్కెర స్థాయి పెరిగినపుడు మూత్రంలో గ్లూకోజ్ సాంద్రత పెరుగుతుంది. దీనివల్ల మూత్రాశయంలో హానికారక బ్యాక్టీరియాలు పెరిగే ప్రమాదముంటుంది. తరచూ మూత్ర విసర్జన, శరీరం త్వరగా అలసిపోవడం, నీరసం, కళ్లు మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నెలసరి సమస్యలు

● మధుమేహం ఉన్నట్లయితే మహిళల్లో రుతుచక్రం అస్తవ్యస్తమవుతుంది. నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, నెలసరి సరిగా రాకపోవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. అధిక గ్లూకోజ్ కారణంగా హార్మోన్ల అసమతుల్యత తద్వారా ప్రత్యుత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది.

గురువారం • 28 నవంబరు 2024



భారత క్రికెట్‌లో పెను తుపాను సూర్యకుమార్ యాదవ్. అతడు క్రీజ్‌లోకి వచ్చింది మొదలు పెవిలియన్‌కు వెళ్లేదాకా... బౌండరీల వర్షం కురుస్తూనే ఉంటుంది. ఒకప్పటి సాధారణ ఆటగాడు నేడు అసాధారణ ఆటతో చెలరేగుతున్నాడంటే... అది అతనొక్కడి విజయం కాదు. అన్నింటా తోడై... స్ఫూర్తి మంత్రమై... సూర్యలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన అతడి సహచరి... **దేవిషా శెట్టి**కీ అందులో భాగం దక్కుతుంది. జాతీయ టీ20 జట్టు కెప్టెన్‌గా అతడు అపురూప విజయాలు అందిస్తున్నాడంటే... దాని వెనుక ఆమె కృషి వెల కట్టలేనిది.

ఆమే అతడి విజయం

దేవిషా శెట్టి పేరు ప్రపంచానికి తెలిసింది భారత స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ జీవిత భాగస్వామిగానే కావచ్చు... కానీ ఆమెకంటూ ఒక గుర్తింపు ఉంది. ముంబయిలో పుట్టి పెరిగిన దేవిషా బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయంశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తగా, మంచి నర్తకిగా, నాట్య గురువుగా, సామాజిక కార్యకర్తగా విభిన్న పాత్రలు పోషిస్తున్నారు. 'బాంబే స్కాటిష్ స్కూల్'లో ప్రాథమికోన్నత విద్య పూర్తి చేసిన ఆమె... 'ఆర్‌ఏ పొదార్ కామర్స్ అండ్ ఎకనామిక్స్ కాలేజీ' నుంచి డిగ్రీ పట్టా పొందారు. 'హెచ్ఆర్ కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్'లో మాస్టర్స్ చదివారు. ఆమె తండ్రి దేవ్‌దాస్ శెట్టి హోటల్ రంగంలో పని చేస్తున్నారు. తల్లి లత గృహిణి. వీరి ఇద్దరు కూతుర్లలో రెండో సంతానం దేవిషా.

నాట్య గురువుగా మొదలై...

బాల్యం నుంచి దేవిషాకు కళలంటే మక్కువ. అందుకే చదువుతూనే సంప్రదాయ నాట్యం అభ్యసించారు. కళాకారిణిగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఆ తరువాత నాట్య గురువుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఇప్పుడామె ముంబయిలో పేరుపొందిన డ్యాన్స్ కోచ్. అంతేకాదు... సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. చదువుకొనే రోజుల్లో స్వచ్ఛంద సంస్థ అయిన 'లైట్‌హౌస్ ప్రాజెక్ట్'తో కలిసి రెండేళ్లపాటు వాలంటీర్‌గా పని చేశారు. అనాథలు, అణగారిన వర్గాల పిల్లలకు అండగా నిలిచే సంస్థ అది. ఆ సంస్థ తరఫున పలు మురికివాడల్లో పర్యటించారు.

పరిచయం అలా...

సూర్యకుమార్ యాదవ్‌ను దేవిషా తొలిసారి చూసింది తన కాలేజీ వేడుక(2012)లో. ఆ వేడుకలో ఆమె నాట్యం చూసి ముగ్ధుడయ్యాడు సూర్య. అక్కడే ఇద్దరికీ పరిచయమైంది. తరువాత స్నేహితులయ్యారు. కొన్నాళ్ల స్నేహంలో మనసులు కలిశాయి. దేవిషా డ్యాన్స్‌ను ఆస్వాదిస్తూ సూర్య... మైదానంలో అతడి సొగసరి షాట్లకు చప్పట్లు కొడుతూ ఆమె... ఒకరి కోసం ఒకరన్నట్టు నాలుగేళ్ల వారి ప్రేమాయణం సాగింది. ఆ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని... ఇకపై కలిసి జీవిద్దామని నిర్ణయించుకుని... 2016లో ఇద్దరూ ఒక్కటయ్యారు.

అండగా... ఆత్మస్థైర్యంగా...

భార్యంటే భర్తలో సగం. దాన్ని అక్షర సత్యం చేసి చూపారు దేవిషా. పెళ్లి నాటి నుంచి జీవిత భాగస్వామిగా సూర్య కెరీర్‌కు ఆమె మూల స్తంభం అయ్యారు. ఇప్పుడైతే కళ్లు చెదిరే షాట్లతో అలరిస్తున్నాడు కానీ... కెరీర్ ఆరంభంలో సూర్య ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ఎత్తుపల్లాలను చూశాడు. అలాంటి సమయంలో అతడికి అండగా నిలిచారు దేవిషా. ఒక దశలో తన ప్రతిభపై తనకే సందేహపడినప్పుడు... అతడిలో ఆత్మస్థైర్యం నింపారు. శారీరకంగానే కాకుండా... మానసికంగానూ సూర్యను దృఢంగా మార్చడంలో దేవిషా కృషి అమూల్యం. భారత జట్టులో చోటు కోసం ప్రయత్నించి విఫలమైనప్పుడు... ఇక తనకు అది అందదని అనుకున్నప్పుడు ఆమే ధైర్యం చెప్పారు. అతడి ఆటపై అతడికి నమ్మకం కలిగించి, బలహీనతలను అధిగమించేలా ఆత్మవిశ్వాసాన్ని నింపి... తిరుగులేని ఆటగాడిగా తీర్చిదిద్దడంలో సఫలం అయ్యారు. అందుకే సంతోషమైనా... బాధైనా... విజయమైనా... వైఫల్యమైనా సూర్య తొలుత తన భార్యతోనే పంచుకొంటాడు. ముఖ్యంగా తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లినప్పుడు, మానసికంగా కుంగిపోయినప్పుడు... అతడికి గుర్తుకువచ్చేది దేవిషా మాత్రమే. అలాగే ఆమె కెరీర్‌కు ఏమేం కావాలో అవన్నీ సూర్య చేసి పెడతాడు. అడిగినవన్నీ సమకూర్చుతాడు. ఇద్దరి మధ్య ఎలాంటి బేషజాలు, ఎక్కువ తక్కువ అనే భావనలు లేవు.



జంతు ప్రేమికులు...

దేవిషా అందించిన ప్రోత్సాహం, సహకారం, ప్రేమే నేడు సూర్యను జాతీయ టీ20 జట్టుకు సారథిని చేసింది. పలు ఇంటర్వ్యూల్లో సూర్య ఈ విషయం పంచుకున్నాడు. దేవిషాకు భర్త అంటే ప్రాణం. అతడి గెలుపే ఆమె గెలుపు. అతడి కల ఆమె కల. ఒకరిపై ఒకరికున్న ప్రేమానురాగాలే తమ అన్యోన్య దాంపత్యానికి పునాది అంటున్న ఆమెకు ఇన్‌స్టాలో దాదాపు ఏడు లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. అక్కడ ఎక్కువగా సూర్యతో కలిసివున్న మధుర క్షణాలనే ఆమె పంచుకొంటారు. వంటలు, కేక్‌లు చేయడం ఆమె అభిరుచి. జంతువులంటే ఇద్దరికీ ప్రాణం.

ప్రతి సందర్భంలోనూ...

2021లో జాతీయ జట్టుకు ఎంపికైన సూర్య... ఆ మరుసటి ఏడాది టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపే బ్యాటింగ్‌తో పతాక శీర్షికలకు ఎక్కాడు. అతడి కెరీర్‌ను మలుపు తిప్పిన ఇన్నింగ్స్ అది. 360 డిగ్రీల ఆటగాడిగా పేరు గడించిన దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలర్స్ సైతం అతడి బ్యాటింగ్‌కు మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఏబీలా 360 డిగ్రీల ఆటగాడిగా పోలుస్తూ సూర్యను సీనియర్లు, అభిమానులు ఆకాశానికి ఎత్తినప్పుడు అందరికంటే ఎక్కువ సంతోషపడింది దేవిషానే. తన ఆనందాన్ని నాడు ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. మ్యాచ్ ముగిసిన వెంటనే మైదానం నుంచి భార్యకు వీడియో కాల్ చేసిన సూర్య... భావోద్వేగానికి లోనయ్యాడు. అలాగే ఈ ఏడాది టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో బౌండరీ లైన్‌పై అద్భుతమైన క్యాచ్‌ను అందుకొని... భారత్‌కు చిరస్మరణీయ విజయం అందించాడు. అప్పుడూ తన భార్యను పొగడకుండా ఉండలేకపోయాడు. దేవిషాతో ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ... 'నిజానికి అత్యంత విలువైన క్యాచ్ నేను ఎనిమిదేళ్ల కిందటే పట్టాను' అని రాసుకొచ్చాడు. ఆమెతో కలిసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టి ఎనిమిదేళ్లు పూర్తయ్యాయనే ఉద్దేశం అతడిది. దేవిషా లేనిదే తాను లేనని ప్రతి సందర్భంలోనూ అతడు గుర్తు చేస్తూనే ఉంటాడు.

హృదయాలకు అండగా..!

ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యంలో గుండె జబ్బు పాలైంది. అంతలోనే రోడ్డు ప్రమాదం వెంటాడింది. కలలు కన్న ప్రపంచ సుందరి కిరీటం తృటిలో చేజారింది. అయినా ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన కోసం పని చేస్తోంది మాజీ మిస్ వరల్డ్ మొదటి రన్నరప్ శ్రీ సైని. సవాళ్లు ఎదురైనా కుంగిపోకూడదని చెబుతూ... గుండె సంబంధిత వ్యాధులపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తోంది.

"నేను పంజాబ్‌లోని లూధియానాలో పుట్టాను. నాకు అయిదేళ్ల వయసు ఉన్నపుడే కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లిపోయా. అక్కడే పాఠశాలలో చేరా. నాకు నృత్యం చేయడమంటే చాలా ఇష్టం. ఆటలు కూడా బాగా ఆడేదాన్ని. ఒక రోజు పాఠశాలలో నిర్వహించిన పరుగు పందెంలో ఓడిపోయా. అందరిలా నేనెందుకు వేగంగా పరుగెత్తలేకపోయానో అప్పుడు నాకు అర్థం కాలేదు. ఒకరోజు మా అమ్మ నన్ను మామూలు ఆరోగ్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లింది. అప్పుడు నాకు పన్నెండేళ్లు ఉంటాయి. నా చేయి పట్టుకుని నాడి పరీక్షిస్తున్న వైద్యుని ముఖంలో రంగులు మారడాన్ని నేనిప్పటి వరకు మర్చిపోలేదు. నా గుండె అయిదు సెకన్లు కొట్టుకోలేదని ఆ వైద్యుడు చెప్పాడు. వెంటనే ఆరోగ్య పరీక్షలన్నీ పూర్తి చేసి నా గుండెలో బ్లాక్ ఉందని, దానివల్లనే గుండె నిర్ణీత లయలో కొట్టుకోవడం లేదని చెప్పారు. కుటుంబ సభ్యుల రోదనల మధ్యనే నాకు శస్త్రచికిత్స చేసి పేస్‌మేకర్ అమర్చారు. జీవితంలో ఎప్పటికీ నృత్యం చేయకూడదని, శ్రమ అనిపించే ఆటలు ఆడకూడదని వైద్యులు చెప్పినపుడు నా వేదనకు అంతు లేకుండా పోయింది.

ఆత్మవిశ్వాసంతో....

ఎప్పుడో ఎనభై ఏళ్ల తరవాత అమర్చాల్సిన పేస్‌మేకర్‌ను నాకు పన్నెండేళ్లకే పెట్టాల్సి వచ్చింది. దీని వల్లనే నేను ఇంకా బతికి ఉన్నా అని అనుక్షణం గుర్తుకు వచ్చేది. శస్త్రచికిత్స తరవాత నేను కోలుకోవడానికి చాలా నెలలు పట్టింది. ఎప్పుడూ మంచంలోనే ఉండడం వల్ల ఒంటరితనం వేధించేది. కాస్త కోలుకున్నాక పాఠశాలకు వెళ్లడం మొదలుపెట్టా. నెలలపాటు హాజరు లేనందున అక్కడ ఇబ్బందులు తప్పలేదు. కన్నీళ్లు దాచుకుని నాకు నేనే ధైర్యం చెప్పుకొనేదాన్ని. ఎవరు మనల్ని బాధపెట్టినా వారితో మనం ప్రేమగా నే వ్యవహరించాలని అమ్మ చెప్పడం నన్ను ఆలోచనలో పడేసింది. అదే సమయంలో మిస్ వరల్డ్ పోటీలు, ఆ పోటీదార్ల సానుకూల దృక్పథం నన్ను ఆకర్షించాయి. నేను కూడా ఈ పోటీల్లో పాల్గొనాలని బలంగా నిర్ణయించుకున్నా. పాఠశాల విద్య పూర్తయి కాలేజీలో చేరిన కొన్నాళ్ళకే కారు ప్రమాదంలో నా ముఖం పూర్తిగా కాలిపోయింది. నన్ను నేను అద్దంలో చూసుకోవడానికే భయపడేదాన్ని. ఒక ఏడాది పాటు కాలేజీ మానేస్తే ముఖానికి సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పారు. కానీ పాఠశాల సంఘటనలు గుర్తుకు వచ్చి నేను ఎలా కనిపించినా సిగ్గుపడకుండా కాలేజీకి వెళ్లి చదువుకోవాలని నిర్ణయించుకున్నా. కాలిన గాయాలకు ఎండ తగలకుండా తలపై టోపీ, ముఖానికి ముసుగు వేసుకునేదాన్ని. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ప్రపంచ సుందరి పోటీలకు సన్నద్ధమవుతూ ఉండేదాన్ని. నిరంతర సాధన, పట్టుదలతో 'మిస్ వరల్డ్ అమెరికా'గా ఎంపికయ్యా. 'ప్రపంచ సుందరి 2021' పోటీల్లో మొదటి రన్నరప్‌గా నిలిచా. ఈ సంఘటన నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నాకు అందిన ఈ గౌరవం ఆసరాగా ప్రజలకు మంచి చేయాలని నిర్ణయించుకున్నా.



క్యాన్సర్ కంటే ప్రమాదం....

ప్రపంచంలో మూడో వంతు మంది అంటే ఏటా 18 మిలియన్ల మంది గుండె జబ్బుల కారణంగానే చనిపోతున్నారు. క్యాన్సర్ కంటే గుండె సంబంధిత వ్యాధులే ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఆరోగ్యకరమైన జీవన శైలి, గుండె ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండె పరీక్షల గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికీ అవగాహన కల్పించడమే జీవిత లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ ప్రయత్నం వల్ల 80 శాతం మరణాలను నివారించవచ్చని నా అభిప్రాయం.



"నాకు ఇప్పటిదాకా ఎనిమిదిసార్లు గుండెకు శస్త్రచికిత్స జరిగింది. రెండుసార్లు పేస్‌మేకర్ మార్చారు. పేస్‌మేకర్లో ఉండే బ్యాటరీలు నిర్ణీత సమయం వరకు మాత్రమే పనిచేస్తాయి. తరవాత కొత్తదాన్ని అమర్చాల్సి ఉంటుంది. 'నా గుండె చాలా పెద్దది. దానికి జనరేటర్ అమర్చండి' అని వైద్యులతో హాస్యమాడుతూ ఉంటాను."

సేవా దృక్పథంతో...

శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలు అనుభవించాను. కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకొనేవారు ఎవరో ఒకరు ఉండాలి. కానీ ఏ సాయం అందని అభాగ్యులు ఎందరో మన చుట్టూ జీవిస్తున్నారు. అలాంటివారికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. ఇతరులకు చేయూత అందిస్తే... అది వారి బంగారు భవిష్యత్తుకు భరోసా ఇచ్చినవారం అవుతాం. మనవల్ల ఏ ఒక్కరి జీవితం మలుపు తిరిగినా చాలు... నాకు అంతకు మించిన సంతృప్తి మరొకటి ఉండదు. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న లాభాపేక్షలేని పలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నాను. గుండె ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్'తో కలిసి పని చేస్తున్నాను. నా ప్రయత్నం ఎంతోమందిని అకాల మరణం నుంచి కాపాడింది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించడంలో వాటిని ఎదుర్కోవడంలో అందరికీ మార్గనిర్దేశనం చేస్తున్నాను."

సలహా

గర్భాశయంలో గడ్డలుంటే?

డాక్టర్! నా వయసు 30 ఏళ్లు. పెళ్లై ఐదేళ్లయినా పిల్లలు కలగడం లేదు. వైద్య పరీక్షల్లో ఫైబ్రాయిడ్లు ఉన్నాయని తేలింది. పిల్లలు కలగకపోవడానికి ఫైబ్రాయిడ్లే కారణమా? వీటిని తొలగించుకునే మార్గం లేదా?

\- **ఓ సోదరి,** విశాఖపట్నం.

పునరుత్పత్తి వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించే గర్భాశయంలో ఫైబ్రాయిడ్లు అనే గడ్డలు కొందరు మహిళల్లో తయారవుతూ ఉంటాయి. ఇవి రకరకాల పరిమాణాల్లో ఉంటాయి. ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల కంటే చిన్న ఫైబ్రాయిడ్లను వైద్య చికిత్స సహాయంతో తగ్గించుకోవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్స్ ఉన్న మహిళల్లో నెలసరి స్రావంలో రక్తపు గడ్డలు కనిపించడం, నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకవేళ ఫైబ్రాయిడ్స్ చాలా పెద్దవిగా ఉంటే, గర్భసంచి పక్కన ఉండే మూత్రాశయం మీద ఒత్తిడి పడడం మూలంగా మూత్రసంబంధ సమస్యలు (తరచూ మూత్రవిసర్జన చేయవలసి రావడం, మూత్రవిసర్జన పూర్తిగా జరగకపోవడం) మొదలవుతాయి. అలాగే కడుపులో నొప్పి, కడుపు ఉబ్బరం, కొన్నిసార్లు జీర్ణ సమస్యలు కూడా తలెత్తే అవకాశాలుంటాయి. కొన్ని రకాల ఫైబ్రాయిడ్లు గర్భసంచి లోపలి పొరల్లో ఏర్పడతాయి. వీటి వల్ల గర్భస్రావం జరిగిపోవడం, గర్భం దాల్చలేకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి.



కొందర్లో ఫైబ్రాయిడ్లు ఉన్నప్పటికీ ఎటువంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆరు నెలలు లేదా ఏడాదికోసారి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకుంటూ ఫైబ్రాయిడ్ల పరిమాణాన్ని కనిపెడుతూ ఉండాలి. అలాగే కొందరు మహిళల్లో పెద్ద సైజు ఫైబ్రాయిడ్లు ఉంటాయి. ఇతరత్రా వైద్య చికిత్సలు ఫలితాన్నివ్వవు. కాబట్టి సర్జరీ ద్వారా మాత్రమే వాటికి చికిత్స చేయవలసి ఉంటుంది. ఫైబ్రాయిడ్‌ను మాత్రమే తొలగించే మయోమెక్టమీ లేదా ఫైబ్రాయిడ్స్‌తో పాటు, గర్భసంచిని కూడా తొలగించే హిస్టరెక్టమీ సర్జరీలను ఎంచుకోవలసి ఉంటుంది. అయితే ఎవరికి ఏ సర్జరీ అవసరం అనేది వారి వారి వయసు, ఫైబ్రాయిడ్ మూలంగా తలెత్తే సమస్యల మీద ఆధారపడి ఉంటుంది. యువతుల్లో ఫైబ్రాయిడ్ల వల్ల గర్భధారణ సమస్యలున్నా, నెలసరి సమస్యలున్నా ఫైబ్రాయిడ్ గడ్డను మాత్రమే తొలగించే మయోమెక్టమీ సర్జరీ అవసరం అవుతుంది. అలా కాకుండా పిల్లలు కలిగి, 40 నుంచి 45 ఏళ్లు దాటి, ఫైబ్రాయిడ్ పరిమాణం వేగంగా పెరుగుతున్న పరిస్థితి ఉంటే, ఫైబ్రాయిడ్‌తో పాటు గర్భసంచిని కూడా తొలగించవలసి ఉంటుంది. ఇలా ఫైబ్రాయిడ్ సైజును బట్టి, వయసును బట్టి, బాధిస్తున్న సమస్యలను బట్టి సర్జరీ అవసరాన్ని వైద్యులు అంచనా వేస్తారు.

డాక్టర్ ఎమ్. రజని,
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, హైదరాబాద్.

నాజూగ్గా... నల్లపూసలు

ఎన్ని నగలు ఉన్నప్పటికీ వివాహమైన మహిళలు నల్ల పూసల గొలుసుకు ఇచ్చే ప్రాధాన్యం మాత్రం ప్రత్యేకం. అందుకే సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనంతో కాలానుగుణంగా నల్ల పూసల గొలుసులు రూపుదిద్దుకుంటున్నాయి. ట్రెండ్‌ను అనుసరించే ఉద్యోగినులను ఆకట్టుకునే విధంగా ఎన్నో రకాలు లభ్యమవుతున్నాయి. బంగారం, నవరత్నాలు, క్రిస్టల్స్, సిజెడ్స్‌తో కలగలిసి మహిళల మనసు దోచుకున్న ట్రెండీ డిజైన్స్ ఇవే...

బంగారం, వజ్రాలతో: బంగారు తీగకు నల్ల పూసలను జతచేసి అందమైన అమరికలో చుడతారు. బంగారం అల్లిక ఎక్కువగా, నల్ల పూసల అల్లిక తక్కుగా ఉండేలా రూపొందిస్తారు. దీనికి చిన్న వజ్రాలతో తయారు చేసిన లాకెట్‌ను జోడిస్తారు. లాకెట్‌ను పోలిన జుంకాలు లేదా దిద్దులు, ఉంగరం కూడా అందుబాటులో ఉంటాయి. నాజూగ్గా ఉంటూనే గొప్పగా కనిపించే ఈ నల్ల పూసల గొలుసు ఏ వయసువారికైనా నప్పుతుంది.

ముత్యాలతో: నల్ల పూసలు దగ్గరగా ఉండేలా బంగారు తీగతో గొలుసులా చుడతారు. లాకెట్ స్థానంలో పెద్ద సైజు ముత్యాలను, బంగారు గుండ్లను ఒక క్రమంలో అమర్చి గొలుసుకు జోడిస్తారు. ఈ గొలుసుకు మరో పెద్ద ముత్యాన్ని వేలాడేలా అమరుస్తారు. ఈ నల్లపూసల గొలుసు నాజూగ్గా ఉంటూ ఉద్యోగినులకు అనుకూలంగా ఉంటుంది.

రాశి గుర్తులతో: బంగారు తీగతో నల్ల పూసలను గొలుసులా అల్లిన తరవాత దానికి జోడించే లాకెట్‌లో భార్య భర్తల జన్మ రాశి గుర్తులను బంగారంతో తయారు చేసి అమరుస్తారు. లేదంటే రాశి గుర్తులనే లాకెట్‌లా జోడిస్తారు. ఈ రాశి గుర్తుల మీద వజ్రాలు లేదా సిజెడ్‌లను కూడా పొదుగుతారు. కావాలనుకుంటే కెంపులు, పచ్చలు కూడా అమర్చుకోవచ్చు. బాలివుడ్ నటి సోనమ్ కపూర్ ఈ తరహా నల్లపూసల గొలుసు ధరించడంతో అప్పటి నుంచి ఈ మోడల్ అత్యంత మహిళాదరణ పొందింది.

నవరత్నాలతో: పొట్టిగా ఉండే నల్లపూసల గొలుసుకు నవరత్నాలను ఒక క్రమంలో లాకెట్‌లా జోడిస్తారు. దీనికి వజ్రాన్ని వేలాడేలా అమరుస్తారు. ఈ మోడల్ గొలుసు ఆధునిక దుస్తుల మీద బాగుంటుంది. నవరత్నాలైన పగడం, గోమేధికం, పుష్యరాగం, నీలం, మాణిక్యం, మరకతం, వజ్రం, వైడూర్యం, ముత్యంలను ఒకే పరిమాణంలో ఉండేలా మార్చి వాటిని బంగారంతో అందమైన ఆకృతిలో జోడించి లాకెట్ రూపొందిస్తారు. దీనిని నల్లపూసల గొలుసుకు అమరుస్తారు. అప్పుడు అది చిన్న నెక్లెస్‌లా కనిపిస్తుంది. రోజువారీ వేసుకోవడానికి గృహిణులకు, ఉద్యోగినులకు అనుకూలంగా ఉంటుంది.

చాంద్‌బాలీతో: అర్ధచంద్రాకారపు చాంద్‌బాలీ లాకెట్‌ను జోడించి తయారు చేసే ఈ నల్ల పూసల గొలుసు చాలా అందంగా కనిపిస్తుంది. నల్ల పూసల గొలుసు మూడు లేదా అయిదు వరుసలు ఉండేలా కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ గొలుసుల్లో చిన్న, పెద్ద బంగారు గుండ్లను కూడా చేరిస్తే మంచి హారంలా మారుతుంది. చాంద్‌బాలీ లాకెట్‌కు ముత్యాలు లేదంటే నల్ల పూసల గుత్తులు వేలాడేలా చేస్తే ఈ నల్ల పూసల హారం ఇంకా గొప్పగా కనిపిస్తుంది.



మీనాకారీతో: నల్ల పూసల గొలుసుకు జోడించే లాకెట్‌ను బంగారంతో మాత్రమే కాదు. రాగి, వెండి లోహాలతో కూడా తయారు చేయవచ్చు. వీటి మీద అందమైన ఎనామిల్ రంగులు వేసి రంగురంగుల కుందనాలు అద్ది మీనాకారీ హారం రూపొందిస్తారు. ఈ మీనాకారీ హారం అన్ని రకాల చీరల మీద గొప్పగా కనిపిస్తుంది. మహిళలు ఎటువంటి సంకోచం లేకుండా అన్ని సందర్భాల్లో ధరించేందుకు వీలుగా ఉంటుంది.

టిడ్కో ఇళ్ల పరిశీలనకు టెక్నికల్ కమిటీ

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టిడ్కో ఇళ్ల పరిశీలనకు ప్రభుత్వం వివిధ శాఖల చీఫ్ ఇంజనీర్లతో టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రజారోగ్యశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఏపీ సీఆర్‌డీఏ గ్రూప్ డైరెక్టర్, ఆర్ అండ్ బీ (బిల్డింగ్స్) చీఫ్ ఇంజనీర్, ఏపీయూఎఫ్ఐడీసీ చీఫ్ ఇంజనీర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి ఒక ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఏపీ టిడ్కో చీఫ్ ఇంజనీర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

తప్పుడు కేసులకు భయపడను: చెవిరెడ్డి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు కేసులు పెడితే భయపడనని వైసీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కరరెడ్డి చెప్పారు. బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. తాను బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో, ఐటీ సెక్షన్లతో కూడిన 11 కేసులు పెట్టి తన ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు పోలీసులపై పరువు నష్టం దావా వేస్తానని చెవిరెడ్డి హెచ్చరించారు.

'మత్తు' వదలాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

మోపింది. రాష్ట్రవ్యాప్తంగా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన మంత్రులు లోకేశ్ (విద్య), సత్యకుమార్ (వైద్య), గుమ్మిడి సంధ్యారాణి (గిరిజన సంక్షేమ), కొల్లు రవీంద్ర(ఎక్సైజ్)లతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మన్యంలో గంజాయి సాగు నుంచి బయట వినియోగం వరకూ చర్చించిన మంత్రులు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా... గంజాయి సాగు, సరఫరా, విక్రయంలో పాల్గొనే వారిపై కేసులు పెట్టడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ అనర్హులుగా ప్రకటించాలని నిర్ణయించారు.

'ఈగల్' కన్ను...

గడచిన ఐదు నెలల్లో ఉత్తరాంధ్ర పోలీసులు గంజాయి కట్టడికి తీసుకుంటున్న చర్యలను హోం మంత్రి అనిత వివరించారు. అతి త్వరలో కార్యాచరణ ప్రారంభించబోతున్న యాంటీ నార్కోటిక్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి 'ఈగల్' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. 450మందికి పైగా వివిధ స్థాయి పోలీసులు ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో గంజాయి, మత్తు పదార్థాల కట్టడికి రంగంలోకి దిగబోతున్నట్లు చెప్పారు. గంజాయి సాగు, రవాణా, విక్రయం, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972ను అందుబాటులోకి తెస్తామన్నారు. కచ్చితమైన సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని... తగిన పారితోషికం కూడా ఇస్తామని చెప్పారు. గంజాయి సాగు నుంచి గమ్యం చేరేవరకూ రవాణాదారులు ఉపయోగించే మార్గాలపై పూర్తి నిఘా పెడతామని... దీనికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు, డ్రోన్లనూ వాడతామని చెప్పారు. జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ, ట్రాకింగ్ సిస్టమ్, ఏఐ ఆధారిత సీసీ కెమెరాల నిఘా, ఫేషియల్ రికగ్నిజేషన్, ప్రొఫైలింగ్, సోషల్ మీడియా మానిటరింగ్, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి కట్టడి చేస్తామన్నారు.

ఆ మాటే వినిపించొద్దు...

అభివృద్ధితోపాటు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వంలో గంజాయి మాటే వినిపించకుండా ఉండాలంటే మత్తు మహమ్మారి జోలికి వెళ్లే వారికి సంక్షేమ పథకాలు రద్దు చేయడం సరైనదని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు గంజాయి బారిన పడుతున్న నేపథ్యంలో... విద్యా సంస్థల్లో పదిమందితో 'ఈగల్' కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులతో పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల పరిధిలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గంజాయి నియంత్రణలో ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు, గ్రామ కమిటీల సేవలనూ ఉపయోగించుకోవాలని ఉపసంఘం నిర్ణయించింది. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా 'మహా సంకల్పం' పేరుతో భారీ అవగాహన సదస్సులు నిర్వహించాలని, రాబోయే ఆరు నెలల్లో రాష్ట్రం నుంచి గంజాయిని తరిమేసే మార్గాలన్నింటిపై దృష్టి సారించాలని తీర్మానించింది. పోలీసు, సాధారణ పరిపాలన, వైద్య, అటవీశాఖ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పురపాలక, విద్య, రవాణా, యువజన, గిరిజన, ఎక్సైజ్ శాఖల సహకారంతో గంజాయి, మత్తును తుదముట్టించాలని నిర్ణయం తీసుకుంది. గంజాయికి బానిసలైన వారికి రాష్ట్ర వ్యాప్తంగా 52చోట్ల డీఅడిక్షన్ కేంద్రాలు (ఆసుపత్రులు, జైళ్లలో) అందుబాటులోకి తేవాలని తీర్మానించింది. సమావేశంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, యాంటీ నార్కోటిక్స్ విభాగం చీఫ్ ఆకే రవికృష్ణ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పాల్గొన్న మాజీ ఎంపీ మోపిదేవి తదితరులు

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా చిలకలపూడి బాధ్యతల స్వీకరణ

విజయవాడ వన్‌టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావు బుధవారం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవనంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ బీసీలకు గౌరవప్రదమైన జీవనం అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయటానికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నారని, తాజా బడ్జెట్‌లో బీసీ వెల్ఫేర్‌కు రూ.39 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. చైర్మన్ పాపారావు మాట్లాడుతూ తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఏఎండీ రమాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్‌గా కేకే చౌదరి

విజయవాడ వన్‌టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖాదీ బోర్డు ద్వారా గ్రామాల్లోని యువతలో చైతన్యం తీసుకువచ్చి ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కస్తూరి కోటేశ్వరరావు చౌదరి (కేకే చౌదరి) తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ఆయన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకుజీవితాంతం రుణపడి ఉంటానన్నారు. లోకేష్ పాదయాత్రలో ఆయన వెంటే నడిచానన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఖాదీబోర్డు ఉండేలా కృషి చేస్తానని చెప్పారు. మంత్రి సవిత మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా యువకులతో యూనిట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి ప్రసంగించారు.



ఖాదీ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కస్తూరి కోటేశ్వర రావు చౌదరితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి సవిత

తీరం.. అభివృద్ధి హారం

రాష్ట్ర మారిటైమ్ పాలసీపై సీఎం సమీక్ష

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంత అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచ స్థాయి మారిటైమ్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2029 నాటికి జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి సాధించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని సమగ్ర ఆర్థికాభివృద్ధి చర్యలు చేపట్టాల్సి ఉందని, తీర ప్రాంతాల్లో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మారిటైమ్‌లో సుస్థిర అభివృద్ధి సాధనే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆలయ పర్యాటకానికి ప్రత్యేక కార్యాచరణ అమలుతోపాటు వాటర్‌వేస్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం 2024-29 మారిటైమ్ పాలసీపై సీఎం సమీక్షించారు. ఈ పాలసీని వచ్చే నెల 4న కేబినెట్ సమావేశంలో ఆమోదించనున్నారు.



ఏపీ మారిటైం పాలసీపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, అధికారులు

సరుకు రవాణాలో 16 శాతం వాటా

'రాష్ట్రంలోని పోర్టుల కార్గో హ్యాండ్లింగ్(సరుకు రవాణా)లో 16శాతం వాటా నమోదయింది. జీఎస్‌డీపీలో 2024-25లో రూ. 15.89 లక్షల కోట్ల వాటా ఉంటుంది. చేపలు, రొయ్యల ఎగుమతుల్లో 2023-24లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాం. వైజాగ్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లు కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సముద్ర ఆధారిత వాణిజ్యంలో మెరుగైన అవకాశాలున్నాయి. 2029 నాటికి రాష్ట్రాన్ని సముద్ర రంగంలో అత్యున్నత స్థానంలో నిలిపేలా కార్యాచరణ రూపొందించి మారిటైమ్ రంగంలోకి వీలైనంత పెట్టుబడులు ఆకర్షించేలా పాలసీని అమలు చేయాలి. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా 2029 నాటికి 15 శాతం స్థూల రాష్ట్ర ఉత్పత్తితో.. అత్యున్నత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యాలు నిర్దేశించుకుని ఆమేరకు ఫలితాలు సాధించాలి. రాష్ట్రంలో నౌకాశ్రయాల ద్వారా సరుకు రవాణాను విస్తరించేందుకు అపార అవకాశాలున్నాయి. పోర్టుల టెర్మినల్ అభివృద్ధి, పోర్టు సమీప ప్రాంతాల అభివృద్ధి, మారిటైమ్ అనుబంధ వాణిజ్యం అభివృద్ధి, షిప్‌యార్డ్ క్లస్టర్ అభివృద్ధి లక్ష్యంగా.. ఓడరేవుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పోర్ట్ హబ్ ఎకానమీపై దృష్టి పెట్టాలి. పరిశ్రమలకు అనువైన.. అవసరమైన పోర్టుల అభివృద్ధిపై ప్రణాళికలను రూపొందించాలి. సముద్రయాన రవాణాకు సంబంధించి పరిశోధన, శిక్షణ, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి. విశాఖపట్నంలోని మేజర్ ఓడరేవుతో పాటు, గంగవరం, కాకినాడ యాంకరేజ్, కాకినాడ డీప్‌వాటర్, రవ్వ, కృష్ణపట్నం.. ఓడరేవుల వినియోగంపైనా పూర్తి దృష్టి సారించాలి. మూలపేట, కాకినాడ గేట్‌వే, మచిలీపట్నం, రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ ఓడరేవులను త్వరగా పూర్తి చేయాలి. ఏపీ మారిటైమ్ బోర్డు, ఏపీఐఐసీ సమన్వయంతో మారిటైమ్ అభివృద్ధికి పని చేయాలి' అని సీఎం ఆదేశించారు.

సొంతూరుకు బాబు

» నేడు నారావారిపల్లిలో తమ్ముడి కర్మక్రియలు

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాత్రి సొంతూరుకు చేరుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన రామ్మూర్తికి గురువారం స్వగ్రామమైన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో కర్మక్రియలు జరగనున్నాయి. తనయుడు, మంత్రి లోకేశ్‌తో కలసి సీఎం చంద్రబాబు గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి బుధవారం సాయంత్రం 6.35 గంటలకు తిరుపతికి చేరుకున్నారు. రోడ్డు మార్గాన నారావారిపల్లి వెళ్లారు. గురువారం రాత్రికి నారావారిపల్లిలోనే చంద్రబాబు బస చేస్తారా లేదా సాయంత్రం తిరుగు ప్రయాణమవుతారా అన్నది ఇంకా ఖరారు కాలేదు. రాత్రికి స్వగ్రామంలోనే గడిపి శుక్రవారం ఉదయం బయల్దేరుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇసుక తవ్వకం చార్జీలే వసూలు చేయాలి

» గనుల శాఖకు సీఎం ఆదేశం



అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌ల్లో వినియోగదారుల నుంచి కేవలం తవ్వకం చార్జీలే వసూలు చేయాలని, అంతకుమించి మరే అదనపు భారం వేయవద్దని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నదీ ప్రాంతాలు, రీచ్‌లు లేని జిల్లాల్లో కూడా ఇసుక సులభంగా లభించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గనుల శాఖకు సూచించారు. బుధవారం సచివాలయంలో ఇసుకపై సమీక్ష చేశారు. ఇసుక ధరలు ఇంకా తగ్గించే మార్గాలు అన్వేషించడంతో పాటు రవాణా ఖర్చుల భారం తగ్గించేలా చూడాలని నిర్దేశించారు. ఫిర్యాదులు, సూచనలను ఆర్‌టీజీఎస్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. అక్రమ రవాణా, విక్రయాలను ఉక్కుపాదంతో అణచివేయాలని గనులు, పోలీసు శాఖలను సీఎం ఆదేశించారు.

రేపటి నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

సచివాలయాల ఉద్యోగులకు బాధ్యత


అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటి వరకు ఈ సర్వే కొనసాగుతుంది. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వే కోసం 'ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్' అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా జిల్లా పరిశ్రమల కేంద్రాలు, జిల్లా కలెక్టర్లు సర్వే పురోగతిని పర్యవేక్షిస్తారు. జిల్లా పరిశ్రమల కేంద్రాల జనరల్ మేనేజర్లు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి ఈ సర్వేని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల ఇండస్ట్రియల్ పార్కులను ఈ సర్వే పరిధిలోకి తీసుకురానున్నారు.

సర్వే లక్ష్యాలు..

- రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈల డేటాబేస్ అభివృద్ధి.
- వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన.
- మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పారిశ్రామికవేత్తల నైపుణ్యాల అభివృద్ధి, ఇతర సేవలు.
- నమోదు వల్ల వివిధ రకాల ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హత.
- 'ర్యాంప్' ప్రోగ్రాం ద్వారా రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు అవగాహన కల్పించి, వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ కార్యక్రమాలు.
- రాష్ట్రంలో బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ (బీడీఎస్) ప్రొవైడర్స్‌ను తయారు చేయడం.

అమరావతికి యాక్షన్‌ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)



జారీ చేసింది. 2019లో రాజధానిలో ఆగిపోయిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించనున్నారు. తద్వారా మధ్యలో ఆగిపోయిన పనులను మళ్లీ పట్టాలెక్కించనున్నారు. ఎంవోయూ ముగిశాక 120 రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిర్ణయించారు. టెక్నికల్ కమిటీ సిఫారసుల మేరకు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ కలిసి అమరావతి నిర్మాణంలో పాల్గొన్న అన్ని కాంట్రాక్టు ఏజెన్సీల ఎంవోయూల ముగింపుపై నిర్ణయం తీసుకుంటాయని పేర్కొన్నారు. టీడీపీ హయాం 2014-19లో అమరావతిలో 350 కిలోమీటర్ల మేర రోడ్లు వేశారు. భారీ భవనాలు నిర్మించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అమరావతిని నిర్వీర్యం చేశారు. చాలా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పూర్తయిన, నిర్మాణంలో ఉన్న రోడ్లు నాశనమయ్యాయి. ఈ పనులను మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. పనులు ముందుకు కదలాలంటే పెండింగ్ బిల్లుల చెల్లింపు తప్పనిసరని భావించింది. ఈ నేపథ్యంలో టెక్నికల్ కమిటీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది.

టెక్నికల్ కమిటీ నివేదికలోని అంశాలు

- అన్ని పెండింగ్ బిల్లులను ఒప్పందంలోని నిబంధనల ప్రకారం సర్దుబాటు చేసి చెల్లించాలి. 2019 మే 29వ తేదీన అప్పటి సీఎస్ ఇచ్చిన ఆదేశాలతో ఆగిపోయిన పనుల బిల్లులు చెల్లించాలి. ఒప్పందంలో లేకపోయినప్పటికీ జరిగిన పనులను ఒప్పందం పరిధిలోకి తీసుకురావాలి.
- 2019 మే 29వ తేదీ వరకు చేసిన పనులు, సర్టిపై చేసినవి, చేయాల్సినవి, రికార్డ్ చేసినవి, చేయాల్సిన పనులన్నింటినీ ఒప్పందంలోని నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలి.
- మొబిలైజేషన్ అడ్వాన్సుల మీద వడ్డీ ఎత్తేయాలి. పనులు ఆగిపోవడానికి, జాప్యం జరగడానికి కారణం కాంట్రాక్టర్ కాదని ప్రభుత్వం తెలిపింది.
- పెండింగ్ బిల్లులను వడ్డీ లేకుండా చెల్లించాలి.
- 2014-19 సమయంలో ఒప్పందాలు జరిగినప్పుడు ఉన్న జీఎస్టీ రేటుకు, ప్రస్తుతం జీఎస్టీ రేటుకు ఉన్న వ్యత్యాసాన్ని కూడా పూరించాలన్న డిమాండ్లు వచ్చాయి. జీఎస్టీ అమల్లోకి రాకముందు ఆర్థిక శాఖ ఇచ్చిన జీవోల ప్రకారం ఈ జీఎస్టీ వ్యత్యాసాన్ని తేల్చవచ్చు. ఈ విషయంలో వాణిజ్య పన్నుల శాఖ అభిప్రాయం పరిగణనలోకి తీసుకోవాలి.
- సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ దగ్గర బ్యాంకు గ్యారెంటీలు, నగదు రూపంలో ఉన్న ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ లాంటి సెక్యూరిటీ డిపాజిట్లను పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఉపయోగించాలి. ఇలాంటి డిపాజిట్లు లేని వారికి నేరుగా బిల్లులు చెల్లించాలి. మొబిలైజేషన్ అడ్వాన్సులు లేని ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులు చెల్లించడం కోసం ఈఎండీ, ఎఫ్ఎస్‌డీలను బ్యాంకు గ్యారెంటీలు, నగదు రూపంలో విడుదల చేయాలి.
- ప్రభుత్వ ఆమోదం పొందిన అమరావతి నిర్మాణాల డిజైన్లకు, బిల్ట్ డ్రాయింగ్ కాంపోనెంట్స్‌కు మాత్రమే చెల్లింపులు చేయాలి. ఇందుకు ఆ ఏజెన్సీ డిజైన్ల ప్రతులను సమర్పించాలి.
- కొంతమేర పనులు చేసినా షెడ్యూల్-హెచ్‌లో పేర్కొన్న స్థాయిలో పూర్తికాకపోవడంతో నిలిచిపోయిన చెల్లింపుల విషయంలో దశలవారీగా చెల్లించాలి. ఎంత మేర పనులు పూర్తయితే అంతవరకు చెల్లింపులు చేయాలని భావిస్తున్నారు.
- ప్రీకాస్ట్ వర్క్‌లు క్షేత్రస్థాయిలో మొదలు కానందున చెల్లింపులు చేయకూడదు. అలాగే సైట్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఖర్చులు చెల్లించకూడదు.
- అమరావతి నిర్మాణం కోసం కొనుగోలు చేసిన పైపులకు బిల్లులు చెల్లించాలి.
- నిర్మాణ పనుల కోసం తెచ్చిన పరికరాలను వాడకుండా పక్కన పెట్టినప్పటికీ వాటికి చెల్లింపులు చేయాలంటే సంబంధిత బిల్లులో ప్రస్తావించడంతో పాటు సరైన సాక్ష్యం కూడా చూపాలి.
- గత ప్రభుత్వం వెనక్కి తీసుకున్న ఇసుక నిర్మాణ సామగ్రిని రీయింబర్స్ చేయాలి.
- అమరావతి నిర్మాణం పనులు ఆగినప్పుడు చోరీకి గురైన నిర్మాణ సామగ్రి కోసం చెల్లింపులు చేయకూడదు.
- నిర్మాణ పనుల కోసం కొనుగోలు చేసిన స్పేసర్లు, బేరింగుల లాంటి సామగ్రి కోసం ప్రభుత్వం చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదు.
- ఇప్పటి వరకు అమరావతిలో నిర్మాణ పనులు ఎంతవరకు జరిగాయనేది ఏపీసీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌లోని క్వాలిటీ కంట్రోల్ విభాగంతో నిర్ధారణ చేయించుకోవాలి.
- ప్రభుత్వం డబ్బులు చెల్లించినప్పటికీ కొన్ని ఏజెన్సీలు పైపులు, ఇతర సామగ్రిని వెనక్కి తీసుకెళ్లిపోయాయి. ఇలాంటి కేసుల్లో ప్రభుత్వం చెల్లించిన డబ్బును ఈ ఏజెన్సీలు తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలి. వీటిని బిల్లుల చెల్లింపు కోసం ఉపయోగించాలి.

అమరావతి 2.0

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి రూ.336.3 కోట్ల పనులు మిగిలి ఉన్నాయి. అమరావతి రాజధాని విధ్వంసంలో భాగంగా వైసీపీ ప్రభుత్వం ఈ పనులను నిలిపివేసింది. దీంతో ప్రస్తుత అంచనాల మేరకు సవరించి పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ సిద్ధమైంది. ఆరు నెలల్లో పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎన్‌జీవో, మంత్రులు, జడ్జీల బంగళాల పునరుద్ధరణ పనులు కూడా అదే రోజున ప్రారంభం కాబోతున్నాయి. ఎన్‌జీవో క్వార్టర్స్‌ను గత టీడీపీ ప్రభుత్వంలో మల్టీస్టోర్డ్ భవనాలుగా నిర్మించేందుకు రెండు దశలలో పనులను చేపట్టారు. తొలి దశలో రూ.996.05 కోట్ల వ్యయంతో చేపట్టగా 62 శాతం మేర పనులు పురోగతిలో ఉన్నాయి. వీటికి సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.428.28 కోట్ల మేర అప్పట్లోనే చెల్లించారు. వీటిలో ఇంకా రూ.542 కోట్ల పనులు మిగిలి ఉన్నాయి. రెండో దశలో రూ.257.40 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవగా.. 3 శాతం పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన రూ.213 కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. మంత్రులు, జడ్జీల బంగళాల నిర్మాణ పనులను కూడా గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.243.27 కోట్ల వ్యయంతో చేపట్టారు. వీటి పనులు 27 శాతం మేర జరిగగా, కాంట్రాక్టర్లకు దాదాపు రూ.47 కోట్ల మేర చెల్లించారు. మరో రూ.179.22 కోట్ల పనులు మిగిలి ఉన్నాయి. ఎన్‌జీవో క్వార్టర్స్, మంత్రులు, జడ్జీల బంగళాల పనులను 9 నెలల్లో పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గవర్నమెంట్ టైప్-1, టైప్-2 (గ్రూప్ డీ), గ్రూప్ బీ, గెజిటెడ్ ఆఫీసర్స్ క్వార్టర్స్ నిర్మాణ పనులు కూడా అదే రోజున పునఃప్రారంభించనున్నారు.

అమరావతిలోనే రిపబ్లిక్ వేడుకలు!

తుళ్లూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే(జనవరి 26) వేడుకలను ఈసారి రాజధాని అమరావతిలో నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాయపూడి సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే టవర్ల సమీపంలో ఎన్ఆర్టీ టవర్స్‌కు వెళ్లే మార్గంలో ఉన్న స్థలాన్ని సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ముఖ్యమంత్రి కార్యాలయ(జీఏడీ) అధికారి సురేశ్‌కుమార్, ఏఎస్పీ ఏటీవీ రవి, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు.

2 దశల్లో ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులు..

అమరావతిలో మరో ప్రధాన ఘట్టమైన ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులనూ వచ్చేనెల 15న ప్రారంభించేందుకు సీఆర్‌డీఏ సిద్ధమైంది. జోన్-1, జోన్-2, జోన్-3, జోన్-4, జోన్-5, జోన్-6లలో ఈ పనులను చేపట్టనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 20,482 ఎకరాల విస్తీర్ణంలో 67,912 ప్లాట్లలో రూ.12,629 కోట్ల వ్యయంతో 12జోన్లలోనూ పనులు చేపట్టారు. అప్పట్లో రూ.183 కోట్ల బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులను 2దశలలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో ఆరు జోన్లలో నూతన ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం పనులు చేపట్టాలన్నది అంచనా. ఈ పనులను 24 నెలల్లో పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఆ అవినీతి ఒప్పందంపై దర్యాప్తు జరపాలి

» గవర్నర్‌ను కోరిన షర్మిల

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మధ్య అవినీతి ఒప్పందంపై దర్యాప్తునకు ఆదేశించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను అభ్యర్థించారు. రాజ్‌భవన్‌లో బుధవారం ఆమె గవర్నర్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. అదానీ, జగన్ మధ్య ముడుపుల బంధం వలన రాష్ట్రానికి తీవ్ర నష్టమని, వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని గవర్నర్‌ను కోరినట్టు తెలిపారు.

టిడ్కో గృహాల్లోకి కొండచిలువ



12 అడుగుల పొడవు... 30 కిలోలకు పైగా బరువున్న ఈ కొండచిలువ శ్రీకాకుళం జిల్లాలో కనిపించింది. పలాస సమీపంలోని కోసంగిపురం జాతీయ రహదారి వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహసముదాయంలో ఈ కొండచిలువ మంగళవారం రాత్రి కనిపించింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఈ భారీ కొండచిలువను చూసి భయంతో పరుగులు తీశారు. అక్కడి వారు వేసిన కేకలతో వ్యర్థనీరు వచ్చే సంపులోకి వెళ్లిన కొండచిలువ అందులో చిక్కుకుపోయింది. బుధవారం ఉదయం అటవీ అధికారులు, ఈస్టర్న్ గాడ్స్ వైల్డ్‌లైఫ్ సభ్యుడు ఓంకార్ త్యాడీ అక్కడకు చేరుకుని దానిని బంధించి సమీప అడవిలో వదిలివేశారు.

- పలాస, (ఆంధ్రజ్యోతి)

మన్యం గజగజ



చింతపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి ప్రజలను వణికిస్తున్నది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల గిరిజన ప్రాంతంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం డుంబ్రిగుడలో 8.2, జి.మాడుగులలో 8.7, హుకుంపేటలో 10, చింతపల్లిలో 11.5, పాడేరు, పెదబయలులో 12, అనంతగిరిలో 13, అరకులోయలో 13.2, కొయ్యూరులో 15.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంచు కూడా అధికంగా కురుస్తుంది. ఉదయం తొమ్మిది గంటల వరకూ సూర్యుడు కనిపించడం లేదు. ప్రధాన కూడళ్లలో సాయంత్రం ఆరు గంటల నుంచే జనసంచారం కనిపించడం లేదు.

కైలాసగిరిపై స్కై సైక్లింగ్!



విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రెండు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రాజెక్టులను బుధవారం ప్రారంభించింది. ఇందులో భాగంగా జిప్ లైనర్, స్కై సైక్లింగ్ రెండింటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ జిప్‌లైనర్‌పై ప్రయాణించారు.

- విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి)

బ్యాంకాక్ నుంచి విదేశీ బల్లులు



స్వాధీనం చేసుకున్న బల్లులతో కస్టమ్స్ అధికారులు

- **లగేజీలో కేక్ బాక్సుల్లో పెట్టి తరలింపు**
- **విశాఖ విమానాశ్రయంలో స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్**

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్ నుంచి విమానంలో అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ బల్లులను విశాఖ విమానాశ్రయంలో కస్టమ్స్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేశారు. బ్యాంకాక్ విమాన ప్రయాణికుల లగేజీని పరిశీలిస్తున్నప్పుడు చిన్న చిన్న పెట్టెల్లో (కేక్ బాక్సులు) ఏవో జంతువులు కదలాడుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో విశాఖపట్నంలో పాములు పట్టే (స్నేక్ క్యాచర్) రొక్కం కిరణ్ కుమార్‌ను పిలిపించి వాటిని బయటకు తీయించగా.. విదేశీ బల్లులు కనిపించాయి. వాటిలో మూడింటి నాలుకలపై నీలం రంగు మచ్చలు ఉన్నాయి. మరో మూడు వెస్టర్న్ నీలం రంగు నాలుకతో ఉన్నాయి. వీటి కాళ్లు పొట్టిగా, తోక చిన్నదిగా, శరీరం బలిష్ఠంగా ఉంది. ఈ తరహా బల్లులు ఎక్కువగా ఆస్ట్రేలియాలో ఉంటాయని, అడవుల్లో గడ్డి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కనిపిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఇద్దరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. అయితే వారు ఎవరు.. ఏ దేశానికి చెందినవారు.. ఈ బల్లులను ఎందుకు తీసుకువస్తున్నారు..? అనే వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు. ఈ కేసును విమానాశ్రయం పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగిస్తున్నట్టు రెవెన్యూ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజా పుండ్కర్, అటవీ శాఖ అధికారి ఎస్ వెంకటేశ్ తెలిపారు.

ప్రాణం ఖరీదు.. 3 లక్షలు..!

- **డయాలసిస్ రోగికి వేరొక గ్రూప్ రక్తం**
- **కాకినాడ జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం**
- **మహిళ మృతి.. పరిహారం**



శిరీష మృతదేహం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అది కాకినాడ జిల్లాలోని జీజీహెచ్ ఆస్పత్రి.. నిష్ణాతులైన వైద్యులున్నారు.. కావాల్సినన్ని మౌలిక సదుపాయాలున్నాయి.. కానీ ఇక్కడ ప్రాణం ఖరీదు కేవలం రూ.3 లక్షలు..! కొంతమంది వైద్యవిద్యార్థుల అవగాహనా రాహిత్యంతో నిర్లక్ష్యంగా ఒక గ్రూపునకు బదులు మరో గ్రూపు రక్తం ఎక్కించడం... ఒక మహిళ ప్రాణాన్ని బలితీసుకుంది. అయితే తప్పు తెలుసుకున్న అధికారులు ప్రభుత్వం ద్వారా సమకూర్చిన రూ.3లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వలమూరు గ్రామానికి చెందిన భావన శిరీష(34) గత నెల 14న అస్వస్థతకు గురికావడంతో కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు వెంటనే డయాలసిస్ చేయాలని కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. దీంతో ఆమెను ఈనెల 4న జీజీహెచ్‌లోని ఎం-5లో చేర్చారు. మంగళవారం ఆమెకు డయాలసిస్ చేశారు. అనంతరం ఆమెకు రక్తం ఎక్కించారు. కొద్దిసేపటికే ఆమె బిగుసుకుపోతుండడంతో ఆమె తల్లి వైద్యసిబ్బందికి తెలిపింది. దీంతో వైద్యవిద్యార్థులు తాము ఎక్కించింది రోగికి అవసరమైన ఓ పాజిటివ్ కాదని, ఏబీ పాజిటివ్ అని గ్రహించారు. శిరీష ఆరోగ్యం క్షీణించి బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. విషయం తెలుసుకున్న ఆస్పత్రివర్గాలు ఆమె తల్లిని సముదాయించి బుధవారం ప్రభుత్వపరంగా సమకూర్చిన రూ.3 లక్షల చెక్కును ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో కె.అనిత సమక్షంలో సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి అందజేశారు.

అదనపు నిధులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మోదీతో ఆయన సమావేశమయ్యారు. ఈ మిషన్ కింద కేంద్రం రాష్ట్రానికి రూ.23 వేల కోట్లు కేటాయిస్తే అందులో రూ.2 వేల కోట్లను మాత్రమే వైసీపీ సర్కారు ఖర్చు చేసిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పూర్తయిన పనుల వల్ల కూడా ఎవరికీ, ఎలాంటి ప్రయోజనమూ కలుగలేదని, పనులన్నీ నాసిరకంగా చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కేంద్ర ఆశయాలకు అనుగుణంగా విజన్‌ను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ 24 గంటలపాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పూర్తి ప్రణాళికను రూపొందించామని.. దీని అమలుకు అవసరమైన అదనపు నిధులను అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సింగిల్ విండో విధానం బెటర్..

ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగిల్ విండో విధానానికి మార్చాలని, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ-వేలంలో మెరుగైన ఫలితాలు వస్తాయని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రధానితో భేటీ తర్వాత కేంద్ర అటవీ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిశారు. ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్‌ను నిరోధించడం, అమ్మకం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. 'ఏపీ బయట పట్టుబడిన ఎర్రచందనం సైతం సింగిల్ వేలంలో కస్టోడియన్‌గా ఉండే మా రాష్ట్రానికే దక్కేలా చూడాలి. కేంద్రం పర్యవేక్షణలో ఏపీ ప్రభుత్వం కస్టోడియన్‌గా కొనసాగుతుంది' అని వివరించారు. ఈ-వేలం ద్వారా రెవెన్యూ పెరుగుతుందన్నారు.

ఎన్‌డీఏ ఎంపీలకు పవన్ కల్యాణ్ విందు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం రాత్రి ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో ఎన్‌డీఏ ఎంపీలకు విందు ఇచ్చారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, గిరిరాజ్‌సింగ్, మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరులు హాజరయ్యారు. ఈ విందు మర్యాదపూర్వకమేనని, రాజకీయాలేమీ చర్చించలేదని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.



కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ అయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

బంగ్లాలో హిందువులపై దాడులు బాధాకరం: పవన్

బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న హింసాకాండ చాలా బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'బంగ్లాదేశ్ ఏర్పడిందే భారత సైన్యం త్యాగాలతో. భారత్‌లో మైనారిటీలకు లభించే భద్రత బంగ్లాదేశ్‌లో హిందువులకు లభించడం లేదు' అన్నారు. అదానీ సోలార్ ప్రాజెక్టు విషయంలో ఏం చేయాలన్న విషయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలిస్తున్నారన్నారు.

పోలవరం పనులపై సమీక్షకు ప్రత్యేక వెబ్‌సైట్

- **వచ్చే వారంలో ప్రాజెక్టు వద్దకు సీఎం!**

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో జరిగే పనులపై రోజువారీ సమీక్ష కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ప్రధాన డ్యాం పనుల పరిశీలనకు సీఎం చంద్రబాబు వచ్చే నెల తొలివారంలో ప్రాజెక్టు వద్ద పర్యటిస్తారని తెలిపారు. డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణాల సన్నద్ధతపై కాంట్రాక్టు సంస్థలతో సమీక్షిస్తారని చెప్పారు. పోలవరం కుడి, ఎడమ కాలువల పూర్తి, సొరంగాల నిర్మాణంలో మిగిలిన తవ్వకం పనులు, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాధాన్య ప్రాజెక్టులైన హంద్రీ-నీవా, వెలిగొండ, చింతలపూడి ఎత్తిపోతల, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం, బుడమేరు, గోదావరి డెల్టా డీపీఆర్‌లపై సమీక్షించారు. డిసెంబరు 8న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు

కోటి రూపాయలకు మించి విలువైన పనులను చేపట్టే కాంట్రాక్టు సంస్థలకు పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సు ఇచ్చే విధానాన్ని జలవనరుల శాఖ పునరుద్ధరించింది. జగన్ హయాంలో 2019 డిసెంబరు 17వ తేదీన ఈ విధానాన్ని రద్దు చేశారు. కూటమి అధికార పగ్గాలు చేపట్టాక.. 2019కు ముందున్న మొబిలైజేషన్ అడ్వాన్సు విధానాన్ని మళ్లీ తీసుకురావాలని బోర్డు ఆఫ్ ఇంజనీర్స్(బీపీఈ) నివేదిక ఇచ్చింది.



నెల్లూరులోని జీజీహెచ్ వద్ద బైఠాయించిన హిజ్రాలు

కారును ఆపి.. కత్తులతో నరికి..

- **హిజ్రాల నాయకురాలి దారుణ హత్య**
- **ఆస్పత్రికి తరలించేలోపు మృతి**
- **నెల్లూరు జిల్లా కొడవలూరులో ఘోరం**



హాసిని (ఫైల్)

కొడవలూరు, నెల్లూరు (క్రైం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు ముగించుకుని బయల్దేరిన ఓ హిజ్రాను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో నరికి హత్య చేశారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు హిజ్రాల నాయకురాలు కావడంతో ఈ ఘటన సంచలనం రేపింది. నెల్లూరులోని దీనదయాళ్‌నగర్‌కు చెందిన హాసిని కొన్ని రోజులుగా తిరుపతి శివారు మంగళం ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఈమెకు తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బలమైన వర్గముంది. విడవలూరు మండలం పార్లపల్లి సమీపంలో మహాలక్ష్మమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఆమె శ్రీకారం చుట్టి కొంతమేరకు పనులు చేయించింది. ఈ క్రమంలో మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆమెతోపాటు సహచర హిజ్రాలు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో హాసిని కారులో నెల్లూరుకు బయలుదేరింది. టపాతోపు రైల్వే గేటు అండర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఆమె కారును అడ్డుకున్నారు. ఆమెను బలవంతంగా బయటకు లాగి మెడ, వీపు భాగంలో కత్తులతో నరికారు. అదే సమయంలో వెనుక ఆటోలో వస్తున్న హిజ్రాలను చూసి దుండగులు పరారయ్యారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన హాసినిని అంబులెన్స్‌లో నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించేలోపు మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిజ్రాల ఆందోళన

హాసిని హత్యకు గురైన విషయం తెలుసుకున్న నెల్లూరు, కడప, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళనాడు నుంచి భారీ సంఖ్యలో హిజ్రాలు బుధవారం నెల్లూరుకు చేరుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావును కలిసి తమ నాయకురాలిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం జీజీహెచ్ మార్చురీలో హాసిని మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతోందని తెలుసుకొని అందరూ అక్కడకు చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.

రఘురామ హత్యకు సీఐడీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

నివేదిక ఇచ్చిన అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతిని ఏ-5గా చేర్చినట్లు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ కేసులో విజయ్‌పాల్‌ను ప్రకాశం జిల్లా పోలీసులు బుధవారం ఒంగోలులో వైద్య పరీక్షల అనంతరం భారీ బందోబస్తు నడుమ సాయంత్రం గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. రఘురామరాజు తరఫున స్పెషల్ పీపీ, ప్రాసిక్యూషన్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్, విజయ్‌పాల్ తరఫున న్యాయవాది ఝాన్సీ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఆ కోర్టుకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ స్పందన.. విజయ్‌పాల్‌కు వచ్చే నెల 10 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఆయన నుంచి పలు వివరాలు రాబట్టాల్సి ఉందని.. కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాల్సి ఉందని.. పది రోజులు కస్టడీకి అనుమతివ్వాలని కోరుతూ గురువారం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ప్రాసిక్యూషన్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ ఈ అంశంపై గుంటూరులో మీడియాతో మాట్లాడారు. అరెస్టుకు నెలరోజుల ముందు రఘురామరాజుకు గుండె ఆపరేషన్ జరిగిందని తెలిసినా గుండెపోటుతో చనిపోయారని చిత్రీకరించేందుకు కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని, ఒక బలిష్ఠమైన వ్యక్తి ఆయన గుండెలపై కూర్చున్నారని చెప్పారు. చివరకు మందులు, మంచి నీరు కూడా ఇవ్వలేదన్నారు. 'ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. చివరకు ఆయన కూర్చున్న మంచం కూడా విరిగిపోయింది. పైగా ఆయన్ను కొడుతున్నప్పుడు ఓ అధికారి సెల్‌ఫోన్లో చిత్రీకరించి ఆ వీడియోను ఎవరికో పంపించారు. ఆ వీడియో తీసిన వ్యక్తి ఎవరు...? ఎవరికి పంపించారనేది విచారణలో తేలుతుంది. ఆ సమయంలో అక్కడకు సీఐడీ అదనపు డీజీపీ సునీల్‌కుమార్ వచ్చారు. అక్కడున్న వారందరినీ బెదిరించి కిందకు పంపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలున్నాయి. సీఐడీ కార్యాలయంలోకి దర్జాగా నడుచుకుంటూ వెళ్లిన రఘురామరాజు.. తిరిగి వచ్చే సమయంలో నడవలేని పరిస్థితుల్లో ఇద్దరి భుజాలపై చేతులు వేసి కాళ్లు ఈడ్చుకుంటూ వచ్చారని ప్రత్యక్ష సాక్షులైన పోలీసు సిబ్బంది చెప్పారు. కొడుతున్న సమయంలో ఆయన బిగ్గరగా కేకలు వేశారని, అవన్నీ తమకు వినిపించాయని కింద కూర్చున్న సిబ్బంది దర్యాప్తులో వెల్లడించారు. ఆయన్ను చిత్రహింసలకు గురిచేసిన సమయంలో అక్కడున్న 29 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని దర్యాప్తు అధికారులు విచారించి వారి నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. సాధారణంగా హత్యాయత్నం కేసులో పదేళ్ల శిక్ష పడుతుంది. కానీ ఈ కేసులో మిగిలిన సెక్షన్ల ప్రకారం నిందితులకు జీవిత ఖైదు తప్పదు. విజయ్‌పాల్‌ను మరింత లోతుగా విచారించాల్సి ఉంది. ఇందుకోసం పది రోజులు కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తాం' అని వివరించారు.

విధుల్లో చేరిన చోటే అరెస్టు

గుంటూరు జిల్లాకు చెందిన ఆర్.విజయ్‌పాల్ 1984లో ఆర్ఎస్ఐగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖలో చేరారు. నాలుగేళ్లు ఇక్కడే పనిచేశారు. తర్వాత సివిల్‌కు మారి ఇతర జిల్లాలకు వెళ్లారు. సీఐడీ ఏఎస్పీగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. అయితే ఎక్కడైతే ఉద్యోగంలో చేరారో అదే జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన అరెస్టు కావడం గమనార్హం. జిల్లాలో పనిచేసిన సమయంలో మంచి పోలీసు అధికారిగా గుర్తింపు ఉన్నప్పటికి సీఐడీలో చేరిన తర్వాత పనితీరు అత్యంత వివాదాస్పదంగా మారింది. గత ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధించడమే లక్ష్యంగా అనేక మందిపై కేసులు నమోదు చేశారనే విమర్శలు ఉన్నాయి.

'సిట్' విచారణ ముమ్మరం

- **ఏఆర్, వైష్ణవి ట్యాంకర్ల డ్రైవర్ల వాంగ్మూలాలు నమోదు**

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నాలుగో రోజు బుధవారం కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న డెయిరీలకు సంబంధించిన సిబ్బందిని విచారించింది. తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లాలోని వైష్ణవి డెయిరీలకు సంబంధించిన ట్యాంకర్ల డ్రైవర్లను సిట్ కార్యాలయానికి పిలిపించిన అధికారులు వారిని లోతుగా విచారించారు. రెండు డెయిరీలకు చెందిన సుమారు 15 మంది డ్రైవర్లను ప్రశ్నించి వివరాలు రాబట్టిన అధికారులు వారి నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. కాగా, సిట్ బృందం చెన్నై ఎస్ఎంఎస్ ల్యాబ్ నెయ్యి నాణ్యతపై ఇచ్చిన సర్టిఫికెట్లను, ఇతర పత్రాలను పరిశీలించింది. అధికారులు చేపట్టిన విచారణలో మరో వారం, పదిరోజుల్లో సరికొత్త అంశాలు వెలుగుచూసే అవకాశం ఉందని తెలిసింది.

సునీల్ కుమార్ పారిపోయే అవకాశం

- **ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేయాలి: రఘురామకృష్ణరాజు**

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తనపై కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడిన సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ పారిపోయే అవకాశాలున్నాయని, ఆయనపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేయాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఐడీ మాజీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను అరెస్ట్ చేయడం చాలా సంతోషంగా అనిపించిందని తెలిపారు. ఈ కేసులో అసలు కుట్రదారు సునీల్‌కుమార్ అని చెప్పారు. సునీల్‌కుమార్, విజయ్‌పాల్ అంతా ఒక ముఠా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ్‌పాల్ ఎన్నో దందాలు చేశారని, నేటికి ఆయన పాపం పండిందన్నారు. పోలీసులు ఎన్ని ప్రశ్నలు అడిగినా తనకేమీ తెలియదని విజయ్‌పాల్ ఒక క్రిమినల్ లాగా సమాధానాలు చెబున్నారని మండిపడ్డారు. తన ఛాతీపై ఒక బలమైన వ్యక్తి కూర్చున్నారని, ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, దాడి చేశారని రఘురామ తెలిపారు. తన అరెస్టు, దాడి అంతా ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగాయని ఆరోపించారు. వారిని శిక్షించడంలో ఇప్పటికే చాలా ఆలస్యమైందని అన్నారు. పీవీ సునీల్ కుమార్ తులసివనంలో గంజాయి మొక్కలాంటి వ్యక్తి అని ధ్వజమెత్తారు. ఈ కేసులో అందరినీ శిక్షించడానికి ఎక్కువ సమయం పట్టదని భావిస్తున్నట్లు రఘురామ తెలిపారు. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రఘురామరాజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. త్వరలో జరగనున్న 16వ ఆంధ్రప్రదేశ్ శాసనసభ నూతన సభ్యుల అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రావాలని ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని ఆయన గౌరవంగా స్వీకరించారు. ప్రతిపాదిత కార్యక్రయాన్ని విజయవంతంగా నిర్వహించడానికి లోక్‌సభ కార్యాలయం ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పత్తాలేని వర్మ

- **తనకు భయం లేదంటూ వీడియో విడుదల**
- **హైదరాబాద్, కోవైల్లో పోలీసుల గాలింపు**



ఒంగోలు క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ(ఆర్జీవీ) అజ్ఞాతంలో ఉండి విడుదల చేసిన వీడియో కలకలం రేపుతోంది. తనకు ఎలాంటి భయం లేదని చెబుతూ.. తనపై ఫిర్యాదు చేసిన వారికి ఏమాత్రం అర్హత లేదని ఆయన అందులో స్పష్టం చేశారు. పోలీసు విచారణకు సహకరిస్తానని చెప్పి.. తప్పించుకుని తిరుగుతున్న ఆయన వీడియోలో వివరణ ఇవ్వడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకరమైన పోస్టులకు సంబంధించి ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసులో రెండుసార్లు ఆయన విచారణకు గైర్హాజరైన సంగతి తెలిసిందే. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు గురువారానికి వాయిదావేసింది. ఈ నేపథ్యంలో వర్మ కోసం పోలీసులు హైదరాబాద్, కోయంబత్తూరుల్లో గాలిస్తున్నారు. వర్మపై రెండు రాష్ట్రాల్లో తొమ్మిది కేసులు నమోదై ఉన్నాయి.

దొంగలా తప్పించుకు తిరుగుతున్న వర్మ: కిరణ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామ్‌గోపాల్‌వర్మ వైసీపీ కార్యకర్త అని... మాజీ సీఎం జగన్ తాడేపల్లి నివాసం డెన్‌లో ఉన్నాడని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ అన్నారు. వర్మ కోసం పోలీసులు వెతుకుతున్నారని, ఆయన మాత్రం తనకు షూటింగ్ ఉందని దొంగలా తప్పించుకు తిరుగుతున్నారని తెలిపారు. ఎవరికీ భయపడనన్న ఆర్జీవీ నేడు పరుగులు తీస్తూ భయపడుతున్నారని అన్నారు.

భార్గవ్‌రెడ్డిపై బీఎన్ఎస్ సెక్షన్లు చెల్లవు

- **ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో పొన్నవోలు వాదనలు**

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇంచార్జి సజ్జల భార్గవ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ల పై బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌ను వివిధ కేసుల్లో నిందితుడిగా చేర్చారని చెప్పారు. బీఎన్ఎస్ చట్టం అమల్లోకి రాకముందు పెట్టిన పోస్టులపై ఆ చట్టం కింద పెట్టిన సెక్షన్ల నమోదు చెల్లుబాటు కావన్నారు. అధికార పార్టీ చెప్పినట్లు పోలీసులు నడుచుకుంటున్నారని, ఒకే అంశంపై పదుల సంఖ్యలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చెల్లుబాటుకాదని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడాన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణించడానికి వీల్లేదన్నారు. అతి తక్కువ సమయంలో ఎక్కువ కేసులు పెట్టి బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111ను పోలీసులు దుర్వినియోగం చేశారన్నారు. సమయం ముగియడంతో వ్యాజ్యాలపై తదుపరి విచారణను కోర్టు 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు ఇచ్చారు. తనపై నమోదైన 5 కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ భార్గవ్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా మరో 3 పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో దాఖలు చేసిన ఐదు కేసుల్లో వాదనలు విన్న హైకోర్టు, తాజా మూడు పిటిషన్లలో పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.

మొండితోక బ్రదర్స్ కేసు వివరాలు ఇవ్వండి

- **పోలీసులకు హైకోర్టు ఆదేశం**

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉండగా కాన్వాయ్‌పై రాళ్లదాడి చేసి ఆయనను అంతమొందించేందుకు కుట్రపన్నారనే ఆరోపణలతో మొండితోక అరుణ్‌కుమార్, జగన్ మోహనరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావుపై నమోదైన కేసులకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : N.Rahul Kumar,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*